www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

PRAJAPAKSHAM ★★★

**సరి కొత్త రికార్డు**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధిక వాయిదాపై ఉత్కంఠ 07

**రామాలయ విరాళాల చోరీ కేసులో.. చార్జ్‌షీట్ దాఖలుపై జాప్యమేల?**
బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం

సంపుటి 09, సంచిక: 293 | బుధవారం | 23-09-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళల జట్టుకు స్వర్ణం 09

## రిమ్స్‌లో అగ్ని ప్రమాదం

**ఊపిరాడక ముగ్గురు పసికందులు మృతి**

- ఎసి పేలి అలుముకున్న దట్టమైన పొగ
- ప్రమాద సమయంలో హాస్పిటల్‌లోని ఎన్ఐసియులో 27 మంది చిన్నారులు
- ప్రమాద అనంతరం మిగిలిన 24మంది పిల్లలను ప్రైవేటు అసుపత్రికి తరలింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం
- ఘటనపై సమగ్ర విచారణ
- ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/ఆదిలాబాద్/ హైదరాబాద్

ఆదిలాబాద్ రిమ్స్ (రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్(ఎన్ఐసియు) ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం అర్ధరాత్రి ఎసి పేలి దట్టంగా పొగ అలుముకుంది. ఆ సమయంలో ఇంక్యుబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇద్దోదకు చెందిన తరువాయి 8లో



## జూరాలకు 5 టిఎంసిల నీరు ఇవ్వండి

- కర్ణాటక సిఎం డి.కె.శివకుమార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- రేవంత్‌రెడ్డి ఫోన్‌కాల్‌కు డికె సానుకూల స్పందన
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టిఎంసిల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సిఎం డి.కె.శివకుమార్‌ను కోరారు. ఈ మేరకు కర్ణాటక సిఎం శివకుమార్‌కు మంగళవారం సిఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టిఎంసిల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మంగళ తరువాయి 8లో

## తీవ్ర వాయుగుండం

**రాష్ట్రంలో ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు**

- ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ
- పలుచోట్ల గంటకు 40–60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- వాతావరణ కేంద్రం హెచ్చరిక



**హైదరాబాద్‌లో దంచి కొట్టిన వాన**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంపై వర్షాల ముప్పు మరింత ముదిరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రానున్న 12 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో రెడ్ ఆరెంజ్ అలర్టు జారీ చేశామన్నారు. పలుచోట్ల గంటకు 40 — 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, నల్లగొండ, సూర్యాపేటతో పాటు తరువాయి 12లో

**పూర్తిస్థాయిలో అప్రమత్తం**

హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో వెంటనే సిబ్బంది, యంత్రాలను రంగంలోకి దించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ట్రాఫిక్ నిలిచిపోకుండా తరువాయి 12లో

**ఎల్‌నినో ప్రభావం కంటే..**

## బిఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే... నీటి ఇబ్బందులు

- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపాటు
- ప్రణాళికా లోపాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ ప్రాజెక్టుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఇబ్బందులకు ఎల్‌నినో ప్రభావం ఒక్కటే కారణం కాదని, బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో జరిగిన ప్రణాళికా లోపాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ ప్రాజెక్టుల నిర్లక్ష్యమే ప్రధాన కారణాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తొలుత ప్రతిపాదించిన విధంగా జూరాల నుంచి చేపట్టి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రస్తుత స్థాయి నీటి సంక్షోభం ఉండేది కాదని ఉత్తమ్ పేర్కొన్నారు. జూరాల పరిధిలో వరద జలాలను నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు తరువాయి 8లో

**నాలుగు డిమాండ్లపై సర్కార్ సానుకూలం..!**

- ఉద్యోగ సంఘాలతో చర్చలు మరో సారి వాయిదా....
- నేడు సిఎస్‌తో చర్చలు.. అనంతరం ప్రకటన..?

12

**దసరాకు ముందే కొత్త పెన్షన్‌లు**

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం 03

## జర్మనీలో వామపక్షాల అద్భుత విజయం

- బెర్లిన్ రాష్ట్ర ఎన్నికలో డీ లింకే (డిఎల్) పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరణ
- మూడవ స్థానంలోకి ఎ.ఎఫ్.డి. పార్టీ
- ఎలిఫ్ ఎరాల్ఫ్‌కే మేయర్ పదవి అవకాశం



**బెర్లిన్:** జర్మనీలోని బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో వామపక్ష 'డీ లింకే' (డిఎల్)పార్టీ అద్భుత విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది.సెప్టెంబరు ఆరో తేదీన తూర్పు జర్మనీ శాగ్సొనీ–అన్హాల్ట్ రాష్ట్రంలో 44 శాతం ఓట్లతో చారిత్రక విజయం సాధించిన జాత్యాహంకార పచ్ఛిమితవాద ఎ.ఎఫ్.డి.పార్టీని వామపక్ష డీ లింకే పార్టీ మూడోస్థానంలోకి నెట్టి చిత్తుగా ఓడించింది.బెర్లిన్ ఎన్నికల్లో కూడా తామే సంపూర్ణ విజయం సాధిస్తామని మితిమీరిన విశ్వాసం ప్రదర్శించిన ఎ.ఎఫ్.డి, వామపక్షాల ఘన విజయం చూసి తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. అదేసమయంలో జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ నాయకత్వంలోని అధికార సిడియు (సోషల్ డెమోక్రటిక్ యూనియన్)పార్టీ రెండోస్థానంలోకి వెళ్ళింది. డీ లింకే పార్టీ అధినేత్రి ఎలిఫ్ ఎరాల్ఫ్ (45) జర్మనీ రాజధాని నగర మేయర్ పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విచిత్రమైన విషయం ఏమిటంటే టర్కీ నుండి వలసవచ్చి జర్మనీలో తలదాచుకున్న వామపక్ష కుటుంబానికి చెందిన ఎలిఫ్ ఎరాల్ఫ్ జర్మనీలో కూడా వామపక్ష తరువాయి 12లో



## అక్టోబర్ తొలి వారం నుంచే ధాన్యం కొనుగోళ్లు


- 8,283 కేంద్రాల్లో 65 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- బోనస్‌కు అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి తప్పనిసరి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ మొదటి వారం నుంచి కొనుగోళ్లను ప్రారంభించనుండగా ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ధాన్యాన్ని వాతావరణ మార్పుల నుంచి రక్షించేందుకు తేమ కొలిచే యంత్రాలు, క్లీనర్లు, డ్రైయర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్) అన్ని జిల్లాల పౌరసరఫరాల అధికారులు, మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ తరువాయి 12లో

## ఎస్‌సి, ఎస్‌టిలపై అణిచివేత ధోరణి వద్దు

- వారి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలి
- సిఎం రేవంత్ రెడ్డి పిలుపు
- ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాల్లో పెద్దపీట
- ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల బాధితులకు సత్వరన్యాయం



ప్రజాపక్షం/హైదరాబాద్

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్‌సి, ఎస్‌టిలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని సిఎం పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం1989 అమలుపై రాష్ట్ర ఉన్నత స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను సిఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాయి 8లో

## 'క్యూర్' బిల్లుకు గవర్నర్ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులకు మార్గం సుగమమైంది. క్యూర్ బిల్లుకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయడంతో క్యూర్2026 చట్టం అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న జిహెచ్‌ఎంసి1955 చట్టం స్థానంలో కొత్త చట్టం అమలు కానుంది. హైదరాబాద్ నగరానికి సమగ్ర, ఏకీకృత పాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్యూర్ చట్టాన్ని తీసుకొచ్చింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే ఉద్దేశంతో జిహెచ్‌ఎంసితో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), సైబరాబాద్ మున్సిపల్ తరువాయి 12లో



## లక్ష్మీ భాస్కర్‌పై ఎసిబి కొరడా

- ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై నిమ్స్‌వైద్యులు, అదనపు సూపరింటెండెంట్ అరెస్టు
- రూ.6.13 కోట్లకు పైగా అక్రమ ఆస్తుల గుర్తింపు
- ఇళ్లు, ఫ్లాట్లు, లగ్జరీ కార్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కొరడా ఝుళిపించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదు చేసిన ఎసిబి తరువాయి 8లో

# సువేందు అధికారిపై నందిగ్రాం వేడి

నందిగ్రాం అసెంబ్లీ ఉప ఎన్నిక ఆసక్తిదాయకంగా, ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రతిష్టకు పరీక్షగా పరిణమించింది. ప్రత్యర్థి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి సంచిత ప్రధాన్ దేను బుజ్జగించి లేదా బెదిరించి పోటీ నుంచి తప్పించిన ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మమతా బెనర్జీ తోడ్పాటు ప్రకటించగానే, ఎప్పుడో 2007లో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన (దాని నాయకులు మమతా బెనర్జీ, సువేందు అధికారి అని గుర్తు చేసుకోవటం అవసరం) భూపోరాటంలో ఒక హత్యకేసును త్రవ్వి తీసి దానిలో నిందితుడుగా ఉన్న మిలన్ ప్రధాన్‌ను అరెస్టు చేయటం ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంది. ఆరునెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి చరిత్ర సృష్టించిన బిజెపి పక్షాన ముఖ్యమంత్రిగా ఉన్న సువేందు అధికారి ఇటువంటి అనైతిక చర్యకు ఎందుకు పాల్పడినట్లు? మమతా టిఎంసి అభ్యర్థిని పోటీనుంచి తప్పించి ఆమెను నిరాయుధం చేశానని చంకలెగరేసిన ముఖ్యమంత్రికి, ఆయన పూర్వ అధినేత మమతా బెనర్జీ ఊహించని షాక్ ఇచ్చారు. అది ఆయనలో బెదురుపుట్టించి ఉంటుంది. తన బిజెపి అభ్యర్థి పొరపాటున ఓడిపోతే అది తను జాగ్రత్తగా నిర్మించుకున్న రాజకీయ భవిష్యత్‌కు ముప్పు తెచ్చిపెట్టవచ్చు. ఆ ఊహే భరించలేనిది. అందుకే కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేసుకునే అవకాశం లేకుండా కటకటాల వెనుక కూర్చోబెట్టాడు. అయితే మమతా బెనర్జీ ఏమిటో, ఆమె పోరాట పటిమ, ప్రజాకర్షణ అధికారికి తెలుసు. చిత్రమేమంటే కాంగ్రెస్ నుంచి మమతా బెనర్జీతో పాటు బయటకు వచ్చి లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన అధికారి 2021 ఎన్నికల్లో నందిగ్రాంలో, 2026లో భవానీపూర్‌లో ఆమెను ఓడించి ప్రతిపక్ష నాయకుని స్థానం నుంచి ముఖ్యమంత్రి స్థానానికి ఎదిగాడు. అది ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా భిక్ష. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన నాటినుంచీ అధికారి ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకమైన చర్యలతో బిజెపి అధినాయకత్వానికి విశ్వాసపాత్రుడు కావటానికి అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మతో పోటీపడుతున్నాడు. ఇప్పుడు నందిగ్రాంలో రాజకీయ జూదానికి ఒడిగట్టాడు. బెడిసికొట్టిందో, అది నేరుగా మోదీ, షాలకు తగులుతుంది. ఆ దెబ్బ యావత్ దేశ రాజకీయాలపై పనిచేస్తుంది.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలన కాంగ్రెస్‌ను నామమాత్రావశిష్టం చేసింది – ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి వైస్సార్ సిపి కాంగ్రెస్‌ను చావుదెబ్బతీసినట్లు! అయితే జాతీయ రాజకీయాల్లో ప్రతిపక్ష ఇండియా కూటమిలో తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉంది. కాని మొన్నటి బెంగాల్ ఎన్నికల అనంతరం మమతా బెనర్జీ అధికారం కోల్పోవటమేగాక, ఆమె పార్టీ పార్లమెంటరీ, శాసనసభ పక్షాలు రెండింటిలో తిరుగుబాట్లు జరిగి ఆమె మైనారిటీలోకి నెట్టబడి నిస్సహాయంగా రాజకీయ పోరాటం చేస్తోంది. పార్టీ పేరు, బ్యాంక్ ఖాతాలు, ఎన్నికల గుర్తు స్తంభనలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నందిగ్రాం ఉప ఎన్నికలో అత్యాశతో కూడిన ముఖ్యమంత్రి ఎత్తుగడలు మమతా బెనర్జీకి అనూహ్యమైన అవకాశం కలుగజేశాయి, ఆమె వెంటనే అందిపుచ్చుకుని రాజకీయ చాతుర్యం ప్రదర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఆమె సన్నిహితమైనారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఆమె వెంట కాంగ్రెస్ అభ్యర్థికి తోడ్పాటు ప్రకటించింది. ఆ విధంగా ఇండియా కూటమి నూతన జవసత్వాలు సంతరించుకుంది. రాజకీయ కక్ష సాధింపు, అధికార దుర్వినియోగం, బెదిరింపులు వంటి కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి ప్రతిపక్షానికి ఈ ఉప ఎన్నిక అవకాశం కల్పిస్తోంది. ఇది బిజెపి దూకుడును పటిష్టం చేస్తుందో లేక కొత్తగా ఒకటైన ప్రతిపక్షానికి మానసికంగా కీలకమైన మలుపు తెస్తుందో అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపుకోసం వేచిచూడాలి.

ఇదే సమయంలో, అసోంలో అక్టోబర్ 6న జరిగే నాగోం లోక్‌సభ ఉపఎన్నిక కూడా ఆసక్తిదాయకంగా మారింది. 2019,2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన ప్రద్యోత్ బర్దోలయ్ అసెంబ్లీ ఎన్నికల ముందు, బహుశా ముఖ్యమంత్రి శర్మ ఒత్తిడిపై బిజెపిలో చేరి దిస్పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నిక కావటంతో ఆ లోక్‌సభ స్థానం ఖాళీ ఏర్పడింది. 2023లో నియోజకవర్గాల హద్దుల పునర్విభజనలో 18లక్షల ఓటర్లతో నాగోం ముస్లిం మెజారిటీ నియోజకవర్గం గా మారింది. అత్తరు వ్యాపారవేత్త, అఖిల భారత యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్ రంగంలో దిగటంతో ఈ ఉప ఎన్నిక ఆసక్తిదాయకంగా మారింది. కాంగ్రెస్‌కు పెద్ద సవాలుగా పరిణమించింది. సాధారణంగా ముస్లిం అభ్యర్థులకు ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ పార్టీ విధిగా జనరల్ అభ్యర్థిని పోటీకి దించాల్సిన స్థితిలోకి నెట్టబడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన 19 సీట్లలో 18చోట్ల ముస్లిం అభ్యర్థులే గెలిచారు. అంతేగాక కాంగ్రెస్ గెలుచుకున్న రెండవ లోక్‌సభ స్థానం ధుబ్రి నుంచి ముస్లిం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతేగాక ముస్లిం అభ్యర్థిని నిర్ణయిస్తే అది ముస్లిం ఓట్లలో చీలికకు దారితీసి బిజెపికి మేలు చేస్తుంది. అందువల్ల కాంగ్రెస్ మాజీ లెజిస్లేటర్ శివమణి బోరాను పోటీకి దించింది. కాగా మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికైన అజ్మల్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మల్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు లేనప్పటికీ ముస్లింలు అత్యధికంగా బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాబట్టి అజ్మల్ ఉప ఎన్నికలోకి ఆకస్మికంగా దిగటంతో పోటీ ఆసక్తికరంగా తయారైంది.



## వేధింపు ఘటనలు దారుణం

జముయి జిల్లాలో ఒక బాలుడు, బాలికపై జరిగిన వేధింపుల ఘటన అత్యంత దారుణం. బిహార్ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయి అనడానికి ఈ ఘటన ఒక నిదర్శనం. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి వెంటనే రాజీనామా చేయాలి. బిహార్ అవమానానికి గురవుతోంది. బిహార్ రాష్ట్రంలో 'గుండారాజ్' నడుస్తోంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తక్షణమే స్పందించాలి. మంత్రులతో సహా కొంతమంది ఎన్‌డిఏ నాయకులు ఇలాంటి చిన్న చిన్న విషయాలు సాధారణంగానే జరుగుతూ ఉంటాయని చెబుతూ ఈ ఘటనను సమర్థించడం సిగ్గుచేటు.

– బిహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్.

## శబ్దాలకు అతీతమైన భావ వ్యక్తీకరణ

భాష అనేది కేవలం ఒక శబ్దాల సమూహం మాత్రమే కాదు, అది మానవ సంబంధాలను, భావాలను మరియు ఆలోచనలను అనుసంధానించే ఒక గొప్ప వంతెన. అయితే, వినికిడి లోపం ఉన్న వ్యక్తులకు (బాధితులకు) భావవ్యక్తీకరణకు, సమాజంతో ముడిపడేందుకు 'సంజ్ఞా భాష' అత్యంత శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. బాధితుల హక్కులను పరిరక్షించడం, సంజ్ఞా భాషల ప్రాముఖ్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడం, వాటి సంస్కృతిని గౌరవిం చే లక్ష్యంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 23న 'అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం' నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి సాధారణ మండలి 2017 డిసెంబర్‌లో దీనిని అధికారికంగా గుర్తించింది, 2018 నుండి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

సెప్టెంబర్ 23నే ఈ దినోత్సవాన్ని ఎంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన చారిత్రక కారణం ఉంది. 1951 సెప్టెంబర్ 23న 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్' అనే స్వచ్ఛంద సంస్థ స్థాపించబడింది. వినికిడి లోపం ఉన్న వ్యక్తుల హక్కుల పరిరక్షణ, సంజ్ఞా భాషల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఈ సంస్థ పునాది దినాన్ని పురస్కరించుకుని ఈ తేదీని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 కోట్ల కంటే ఎక్కువమంది చెవిటి లేదా వినికిడి లోపం ఉన్న ప్రజలు ఉన్నారు. ప్రతి దేశానికి మరియు సంస్కృతికి అనుగుణంగా అమెరికన్, బ్రిటీష్, ఇండియన్ సైన్ లాంగ్వేజెస్ వంటి స్వతంత్ర రూపాలు ఉనికిలో ఉన్నాయి. నేటి ఆధునిక ప్రపంచంలో కూడా సంజ్ఞా భాషల విస్తరణ మరియు వినియోగంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రధానం గా పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ సంజ్ఞా భాషా ఉపాధ్యాయులు పరిమితంగా ఉండటం విద్యావకాశాలను నియంత్రిస్తోంది. భారతదేశ విషయానికి వస్తే, 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్' వంటి సంస్థలు 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్' ను ప్రమాణీకరించడానికి, వ్యాప్తి చేయడానికి కృషి చేస్తున్నాయి. టివి వార్తలలో, ప్రభుత్వ కార్యక్రమాలలో సంజ్ఞా భాషా అనువాదకులను చేర్చడం శుభపరిణామ మే అయినప్పటికీ, ప్రాంతీయ భాషల్లో సముచిత శిక్షణ సదుపాయాలు, దైనందిన ప్రజా సేవలలో అనువాదకుల కొరత ఇప్పటికీ ప్రధాన సమస్యగా మిగిలిపోయింది. అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం అనేది ప్రతి ఒక్కరి భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే పిలుపు. సాధారణ ప్రజలలో కూడా సంజ్ఞా భాష పట్ల ఉన్న అపోహలను తొలగించి, కనీస ప్రాథమిక సంకేతాలను నేర్చుకునేలా ప్రోత్సహించినప్పుడే వినికిడిలోపం ఉన్న వారితో సజావుగా కమ్యూనికేట్ చేయగల వాతావరణం ఏర్పడుతుంది. 'ఎవరినీ వెనుకబడనివ్వకూడదు' అనే దృక్పథంతో పనిచేసినప్పుడే నిజమైన సమ్మిళిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుం ది.

*(సెప్టెంబర్ 23 అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం సందర్భంగా)*

సుధాకర్ ఏ.వి; 9000674747

# రష్యాపై ఆంక్షలతో భారత్‌ను బెదిరిస్తున్న అమెరికా

**అజద్ మీర్జా**

వాషింగ్టన్ 'రష్యా ఆంక్షల' చట్టంపై న్యూఢిల్లీ హెచ్చరిక సుంకాల వివాదానికి మించినది. ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, ఇంధన భద్రత, దేశ సరిహద్దుల వెలుపల నుంచి బెదిరింపులు లేకుండా విదేశాంగ విధానాన్ని నిర్వహించుకునే హక్కుకు ఒక రక్షణ. బీజింగ్ ఆచితూచి ప్రతిస్పందించిన తీరు ఒక పెద్ద పోటీని సూచిస్తుంది. యుద్ధం, వాణిజ్యం, చమురు ఒకచోట కలుస్తున్న తరుణంలో ఆసియా ఆర్థిక నిర్ణయాలను ఎవరు నిర్దేశిస్తారనేది ఆ పోటీ సారాంశం.

అమెరికా తన రష్యా విధానాన్ని ఒక విస్తృత ఆర్థిక బలప్రయోగ సాధనంగా మార్చే దిశగా మరింత ముందుకు కదిలింది. రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కట్టబెట్టే 'లిండ్సే ఓ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'ను అమెరికా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఆమోదించింది. 262–159 ఓట్ల తేడాతో ఆమోదం పొంది న ఈ బిల్లు, రష్యా ఇంధన, రక్షణ రంగాలను మాత్రమే కాకుండా, ఆంక్షలను తప్పించుకోవడానికి మాస్కోకు సహాయపడుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న దాని ట్యాంకర్ల 'రహస్య నౌకల'ను కూడా లక్ష్యంగా చేసుకుంది. భారతదేశానికి సంబంధించి ఈ శిక్షాత్మక సుంకం కారణంగా రష్యా ముడి చమురు ధర పెరుగుతుందా లేదా అనేది మాత్రమే ఇక్కడ సమస్య కాదు. న్యూఢిల్లీ ఇంధన విధానం, విదేశాంగ విధానం నిబంధనలను వాషింగ్టన్ నిర్దేశించగలదా లేదా అన్నదే అసలు ప్రశ్న. ప్రతిపాదిత చర్యలు ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేయగలవని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదే సమయంలో, దేశం తన ఇంధన భద్రత, వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి 'అన్ని అవసరమైన చర్యలు' తీసుకుంటుందని కూడా స్పష్టం చేసింది. ఇందుకు ఉపయోగించిన భాషను చాలా జాగ్రత్తగా ఎంచుకున్నారు. ప్రతీకార చర్యలతో న్యూఢిల్లీని బెదిరించలేదు, వాషింగ్టన్‌తో సంప్రదింపులను కూడా తిరస్కరించలేదు. దానికి బదులుగా, ఈ వివాదాన్ని సార్వభౌమాధికారం పరిధిలోకి తీసుకువచ్చింది. ఉక్రెయిన్‌లో రష్యా చేస్తున్న యుద్ధానికి మద్దతుగా కాకుండా, జాతీయ అవసరాలు, మార్కెట్ పరిస్థితులు, సరఫరా లభ్యతను బట్టి మాత్రమే తాము చమురును కొనుగోలు చేస్తున్నామని భారతదేశం వాదిస్తోంది. దాని వైఖరి ఒక దీర్ఘకాలిక సూత్రాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఒక దేశం అధికార పరిధికి మించి, ఆ దేశం విధించిన ఆంక్షలను యథాతథంగా స్వీకరించటాన్ని భారతదేశం అంగీకరించదు.

ఈ ప్రతిస్పందనలోని దృఢత్వానికి ఆర్థికపరమైన అంశాలే కారణం. 2026 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం ముడి చమురు దిగుమతులలో సుమారు 30.3 శాతం రష్యా నుంచే వచ్చాయి. వీటి విలువ దాదాపు 40.8 బిలియన్ల డాలర్లు. జులై మాసంలో భారతదేశం దిగుమతి చేసుకున్న ముడి చమురులో సగానికి పైగా రష్యా సరఫరాలు ఉన్నాయని, ఇది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వెనిజులా, బ్రెజిల్, ఒమన్, యునైటెడ్ స్టేట్స్ నుండి కలిపి వచ్చిన దిగుమతులను కూడా అధిగమించిందని నివేదికలు చెబుతున్నాయి. ఇలా ఆధారపడటం కేవలం వాణిజ్యపరమైనది మాత్ర మే కాదు. మధ్యప్రాచ్యం అంతటా సంఘర్షణ, రవాణా అంతరాయాలు, అస్థిరత నెలకొన్న తరుణంలో, రష్యా చమురు భారతీయ రిఫైనరీలకు తక్కువ ధరకు లేదా పోటీ ధరలకు ముడి చమురును పొందడంలో సహాయపడింది.

కాబట్టి, రష్యా సరఫరాలను భర్తీ చేయడం తక్షణమే జరిగేది కాదు, తక్కువ ఖర్చుతో కూడుకున్నదీ కాదు. సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్, బ్రెజిల్ లేదా వెనిజులా నుంచి భారతదేశం మరింత కొనుగోలు చేయవచ్చు, కానీ ప్రత్యామ్నాయ సరుకులు మరింత ఖరీదైనవిగా, తక్కువ విశ్వసనీయత కలిగినవిగా లేదా రవాణా ప్రమాదాలతో పరిమితమైనవిగా ఉండవచ్చు. హోర్ముజ్ జలసంధి ఒక కీలకమైన ఇంధన కారిడార్‌గా కొనసాగుతుండగా, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ ధరలు, షిప్పింగ్ బీమాపై అనిశ్చితిని పెంచింది. రష్యా దిగుమతులను బలవంతంగా తగ్గించడం భారతదేశంలో ఇంధనం, రవాణా, పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాల ను పెంచవచ్చు.

దీని ప్రభావం చమురు మార్కెట్‌కు మించి విస్తరిస్తుంది. భారతీయ ఎగుమతిదారులు ఇప్పటికే అమెరికా వాణిజ్య చర్యల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 100 శాతం సుంకం విధించడం వల్ల అమెరికా మార్కెట్ లో అనేక భారతీయ ఉత్పత్తులు వాణిజ్యపరంగా పోటీపడలేవు. ఇది వస్త్రా లు, ఇంజనీరింగ్ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు మరియు చిన్న తరహా తయారీ రంగాలపై ఒత్తిడిని పెంచుతుంది. దీని ఫలితంగా ఏర్పడే షాక్, ఇప్పటికే క్లిష్టంగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను మరింత క్లిష్టతరం చేయడంతో పాటు, ఉపాధిని, ఎగుమతి ఆదాయాలను బలహీనపరుస్తుంది. విశ్లేషకులు ఈ ఆంక్ష ల చట్టాన్ని రష్యాను శిక్షించే ప్రయత్నంగానే కాకుండా, భారతదేశానికి వ్యతిరేకంగా ఒక బేరసారాల ఆయుధంగా కూడా వ్యాఖ్యానించారు.

ఇక్కడే ట్రంప్ అంశం ముఖ్యమవుతుంది.అంతర్జాతీయ సంబంధాల పట్ల ట్రంప్ వైఖరి సుంకాలను కేవలం వాణిజ్య రక్షణ సాధనాలుగా కాకుండా, ఒత్తిడి సాధనాలుగా పరిగణిస్తుంది. ఆయన ప్రభుత్వం ఈ చర్యను దేశీయం గా రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చే ప్రభుత్వాలను శిక్షిం చే మార్గంగా ప్రదర్శించవచ్చు, అదే సమయంలో భారతదేశంపై ఉన్న బెదిరింపును ఉపయోగించి వాణిజ్యం, మార్కెట్ ప్రవేశం, ఇంధన కొనుగోళ్లపై రాయితీలను రాబట్టవచ్చు. ఈ చట్టం




ఒక సంప్రదింపుల ప్రయోజనానికి కూడా ఉపయోగపడవచ్చు. భారత్, అమెరికా దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చిస్తున్నప్పటికీ, సుంకాలు, వ్యవసాయరంగ ప్రవేశం, పారిశ్రామిక రక్షణ, నియంత్రణ ప్రమాణాల వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. శిక్షాత్మక సుంకాలతో బెదిరించడం వల్ల, తక్కువ అనుకూలమైన నిబంధనలతో ఒప్పందాన్ని అంగీకరించేలా న్యూఢిల్లీపై ఒత్తిడి పెరిగే వాతావరణం ఏర్పడుతుంది. రష్యా సమస్యను ఒక సాకుగా చేసుకుని, భారత్ ను అసమాన వాణిజ్య ఒప్పందంలోకి బలవంతంగా నెట్టవచ్చని భారత వాణిజ్య విశ్లేషకులు వాదిస్తున్నారు.

ట్రంప్ లెక్కలు దేశీయ రాజకీయాలచే కూడా ప్రభావితం కావచ్చు. రష్యా పట్ల ఘర్షణ వైఖరి, ఉక్రెయిన్ యుద్ధంపై కఠినత్వాన్ని ప్రదర్శించాలనుకునే చట్టసభ సభ్యులను ఆకట్టుకుంటుంది. అదే సమయంలో, అమెరికా పరిశ్రమను రక్షించుకోవడానికి వాణిజ్య ఒత్తిడిని ఒక మార్గంగా చూసే ఓటర్లను సుంకాలు ఆకట్టుకుంటాయి. ఆంక్షలు, సుంకాలను కలపడం ద్వారా, ప్రభుత్వానికి ఒక సౌకర్యవంతమైన సాధనం లభిస్తుంది. అది గరిష్ట శిక్షను తప్పనిసరిగా విధించకుండానే, దాని ఆధారంగా బెదిరించగలదు, తద్వారా చర్చల ద్వారా పరిష్కారానికి ఆస్కారం ఉంటుంది. అయినప్పటికీ, ఈ విధానంలో ఒక వైరుధ్యం ఉంది. ఒక వేళ అమెరికా నిజంగా రష్యా చమురు ఆదాయాలను తగ్గించాలనుకుంటే, రష్యా ముడి చమురును వదులుకునేలా భారత్‌ను బలవంతం చేయడం ప్రపంచ సరఫరాకు అంతరాయం కలిగించి, ధరలను పెంచవచ్చు. రష్యా చమురు ను వినియోగించుకోగల కొనుగోలుదారులు భారతీయ రిఫైనరీలు మాత్రమే కాదు, భారత దేశం నుండి తరలివెళ్లిన ముడి చమురు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాల ద్వారా సులభంగా రవాణా కావచ్చు. ఎగుమతుల పరిమాణం తగ్గినప్పటికీ, బ్యారల్‌పై అధిక ప్రపంచ ధరలు మాస్కో ఆదాయాన్ని పెంచగలవు. ఈ ముప్పు రష్యాను నిర్ణయాత్మకంగా బలహీనపరచకుండానే అమెరికా మిత్రదేశాలను, వినియోగదారులను దెబ్బతీయవచ్చు.

చైనా ప్రతిస్పందన ఈ సంక్షోభానికి మరో కోణాన్ని జోడిస్తోంది. భారతదేశం కంటే రష్యా ఇంధనాన్ని భారతదేశం కంటే బీజింగ్ భారీగా కొనుగోలు చేస్తున్నప్పటికీ, చైనా వ్యాఖ్యానం బహిరంగంగా ఘర్షణపూరితంగా కాకుండా జాగ్రత్తగా ఉంది. ఆ సంయమనం ఒక వ్యూహాత్మక ఎత్తుగడను ప్రతిబింబిస్తుంది. విస్తృత వాణిజ్య ఘర్షణకు వాషింగ్టన్‌కు సులభమైన సమర్థన ఇవ్వడానికి చైనా ఇష్టపడటం లేదు, ప్రత్యేకించి దాని స్వంత ఆర్థిక వ్యవస్థ అమెరికా సుంకాలు, సాంకేతిక పరిమితులకు లోనవుతు న్న సందర్భాలలో... అదే సమయంలో, ఆసియా దేశాలు ఏ ఇంధన సరఫరాదారులను ఉపయోగించవచ్చో వాషింగ్టన్ నిర్ణయించగలదనే సూత్రాన్ని బీజింగ్ అంగీకరించే అవకాశం లేదు. చైనా అవలంబిస్తున్న జాగ్రత్త ఒక రకమైన వ్యూహాత్మక సహనంగా మారవచ్చు. అమెరికా గరిష్ట సుంకాన్ని వాస్తవంగా విధిస్తుందా, భారతదేశం ప్రతిఘటిస్తుందా లేదా చర్చలు జరుపుతుందా, రష్యాతో ఇంధన సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ ఐరోపా దేశాలు మినహాయింపు లు పొందుతాయా అనే విషయాలను బీజింగ్ గమనించగలదు. ఏవైనా స్పష్టమైన ద్వంద్వ ప్రమాణాలు కనిపిస్తే, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా నియమాల ఆధారిత వ్యవస్థను ఎంపికగా అమలు చేస్తున్నారనే చైనా వాదనకు అది మరింత బలం చేకూరుస్తుంది.

భారతదేశానికి, దీని భౌగోళిక రాజకీయ పరిణామా లు చాలా తీవ్రమైనవి. చైనా పట్ల ఉమ్మడి ఆందోళనలు, రక్షణ, సాంకేతికత, ఇండో–పసిఫిక్ రంగాలలో సహకా రం కారణంగా విస్తరించిన భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఉన్న ఊపును ఈ వివాదం బలహీనపరచవచ్చు. వాషింగ్టన్ ఒత్తిడి న్యూఢిల్లీని ఒక ఇబ్బందికరమైన స్థితిలో ఉంచుతుంది. రష్యాతో స్వతంత్ర సంబంధాన్ని కొనసాగించినందుకు శిక్షకు గురవుతూనే, చైనాకు వ్యతిరేకంగా అమెరికాతో మరింత సన్నిహితంగా ఉండాలని దాని నుండి ఆశించబడుతోంది. ఈ వైరుధ్యం భారతదేశాన్ని కేవలం చమురు సరఫరాదారుల విషయంలోనే కాకుండా, చెల్లింపు వ్యవస్థలు, రవాణా ఏర్పాట్లు, రక్షణ భాగస్వామ్యాలు, దౌత్య సంబంధాలలో కూడా మరింత వైవిధ్యీకరణ వైపు నెట్టవచ్చు. ఇది రష్యాతో సహకారాన్ని బలోపేతం చేయగలదు, గల్ఫ్ ఉత్పత్తిదారులతో మరింత సన్నిహిత ఇంధన సమన్వయాన్ని ప్రోత్సహించగలదు, తీవ్రమైన ద్వైపాక్షిక ఉద్రిక్తతల మధ్య కూడా చైనాతో సంబంధాల కోసం కొత్త అవకాశాలను సృష్టించగలదు.

కేవలం వాషింగ్టన్ బెదిరించిందనే కారణంతో రష్యా చమురును భారతదేశం వదులుకునే అవకాశం లేదు. అలా చేస్తే కలిగే నష్టాలు తక్షణమే ఉంటా యి. అయితే దౌత్యపరమైన ప్రయోజనాలు అనిశ్చితంగానే ఉంటాయి. అయినప్పటికీ, రాయితీలు తగ్గినా, ఆంక్షల ప్రమాదాలు పెరిగినా లేదా ప్రత్యామ్నాయ సరఫరాలు మరింత పోటీతత్వంగా మారినా, న్యూఢిల్లీ క్రమంగా రష్యాపై తన ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. అటువంటి మార్పు మార్కెట్ ఆధారిత సర్దుబాటు అవుతుంది. సుంకాల ఒత్తిడితో తీసుకున్న నిర్ణయాన్ని చాలా భిన్నంగా చూస్తా రు. కాబట్టి, ఇక్కడ ప్రధాన సమస్య రష్యాకు భారతదేశం మద్దతు ఇస్తుందా లేదా అనేది కాదు. వాణిజ్యం, ఆర్థికం, ఆంక్షలు నానాటికీ ఆయుధాలుగా మారుతున్న ఈ యుగంలో, ఒక ప్రధాన శక్తి తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోగలదా లేదా అన్నదే అసలు విషయం. ట్రంప్ సుంకాల బెదిరింపు, భారతదేశపు ఇంధన ఆధారపడటాన్ని అమెరికా కు ఒక బలం చేకూర్చే సాధనంగా మార్చాలని చూస్తోంది. భారతదేశం ప్రతిస్పందన రాజకీయ విధేయతగా మారకుండా నిరోధించాలని చూస్తోంది. దీని ఫలితం కేవలం ముడి చమురు ధరను మాత్రమే ప్రభావితం చేయదు. ఇది విచ్ఛిన్నమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సార్వభౌమాధికార సరిహద్దులను నిర్వచించడంలో సహాయపడుతుంది. ఆసియా శక్తులు ఆర్థికంగా వాషింగ్టన్‌కు కట్టుబడి ఉంటూనే స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలవా లేదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది.

# కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమే

ఈ మధ్య కమ్యూనిస్టుల ఐక్యత గురించి ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. కమ్యూనిస్టుల ఐక్యత కొరకు వ్యక్తులు, సంస్థలు, ప్రత్యేకంగా మేధావులు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జరుగుతున్న ఈ ప్రయత్నాలను చూసి సామాన్య ప్రజలు, కమ్యూనిస్టు అభిమానులు, అభ్యుదయవాదులు సంతోషిస్తున్నారు.

ఈ మంచి ప్రయత్నాలను చులకన చేస్తూ, అవహేళన చేస్తూ, వ్యతిరేకిస్తూ కొందరు మాట్లాడుతూనే ఉన్నారు. వారంతా సహజంగానే కమ్యూనిస్టుల ఐక్యతకు వ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులు, బూర్జువా వర్గ ఆలోచనలు కలిగిన వారు. వారు పాత చింతకాయ పచ్చడి లాగా బూజు పట్టిన వాదనలను మళ్లీమళ్లీ చెప్తూనే ఉంటారు.

మనుషులందరి మధ్య అంతరాలు అంతం కావడం అసాధ్యమని, కులాలు అంతరించడం జరగదని, ధనిక – పేద వర్గాలు ఉండటం సహజమని తమ ప్రచారం కొనసాగిస్తూనే ఉంటారు. దేశంలో చీలిన కమ్యూనిస్టు పార్టీలు కలవడం అసాధ్యమని, ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారని మార్క్స్ చెప్పడం కూడా కేవలం ఊహాజనితమైనదేనని చెప్పేవారు నిరంతరం తారసపడుతూనే ఉంటారు. అనేక రుగ్మతలతో నిండి ఉన్న సమాజం మారాలని కృషి చేసే సామాజిక ఉద్యమకారులను, అభ్యుదయవాదులను నిరుత్సాహపరచడానికి వారి ప్రయత్నం వారు నిరంతరం చేస్తూనే ఉంటారు; గతంలో చేశారు, భవిష్యత్తులో కూడా చేస్తారు.

ప్రకృతి సూత్రాల ననుసరించి అయినా, సామాజిక నియమాల ప్రకారమైనా సమాజం నిశ్చలంగా, స్తబ్దతతో ఉండదు. నిరంతరం చలనంలో ఉండటం, మార్పు చెందడం సహజం. మార్క్సిస్టు మహోపాధ్యాయులైన మార్క్స్, లెనిన్, మావోలు చెప్పింది ఇదే. భారతదేశ ప్రజల సమస్యలైన పేదరికం, అంటరానితనం, కులవివక్షలు, ప్రజల మధ్య ఉన్న అంతరాలు శాశ్వతంగా ఉండవని, మార్పు రాక తప్పదని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అదేవిధంగా ప్రపంచ కార్మికులు ఐక్యమవుతారని, చీలికలు పేలికలైన భారత కమ్యూనిస్టులు కలవక తప్పదని గతితార్కిక సిద్ధాంతం స్పష్టపరుస్తుంది. అదెలానో చూద్దాం.

పేదరికానికి కారణం వర్గ సమాజం. ధనిక, పేద వర్గాలు కొనసాగినంతకాలం పేదరికం ఉంటుంది. ఈ వర్గాలు ఉన్నంతకాలం, వీటి మధ్య ఘర్షణ అనివార్యం. వీటి మధ్య సామరస్యం సాధ్యం కాదు; సామరస్యం ఉందంటే ఏదో ఒక వర్గం ఆధిపత్యం వహిస్తున్నట్లే. ఇప్పటికే ఆధిపత్యం చేయగలిగే సంపన్న వర్గాలు మాత్రమే ఆధిపత్యం చేయగలుగుతాయి. కాని దోపిడీ వర్గాలు చేసే దోపిడీని, దోపిడీకి గురయ్యే వారు ఎంతోకాలం భరించరు. కాబట్టి ఈ రెండు వర్గాల్లో ఒకరు లాభపడితే ఇంకొకరు నష్టపోక తప్పదు. కాలక్రమేణా దోపిడీకి గురయ్యే శ్రామిక వర్గాలు తమ అనుభవాల ద్వారా తమకు జరుగుతున్న అన్యాయాలను తెలుసుకుంటారు. వివిధ తరగతులుగా విడిపోయిన పేద వర్గాలు తమ మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలు కావు, మిత్రభేదాలే అని గుర్తించి ఐక్యమవుతారు. కాబట్టి దోపిడీ చేసేవారికి, దోపిడీకి గురయ్యే వారికి ఘర్షణ అనివార్యం అవుతుంది. చైతన్యవంతమైన శ్రామికుల సంఖ్య దోపిడీ వర్గాల కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉండటం వలన, శ్రామిక వర్గాలు, దోపిడీ వర్గాలు ఘర్షించుకుంటే శ్రామికులే గెలుస్తారు.

అదేవిధంగా కుల పీడితులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసిలు కూడా నెమ్మది నెమ్మదిగా అగ్రకుల ఆధిపత్యాన్ని అర్థం చేసుకుంటారు. ఎస్సీల మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని, ఎస్సీలకు బిసిలకు మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని, బిసిల మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని క్రమంగా అర్థం చేసుకుంటారు. తమ మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలు కావు అని తెలుసుకుంటారు. ఈ బ్రాహ్మణీయ మనువాద అన్యాయాన్ని, దోపిడీని, అవమానాలను గుర్తిస్తారు. మెజారిటీగా ఉన్న ఈ వర్గాలు కచ్చితంగా అగ్రకులాధిపత్యాన్ని, కుల వివక్షను, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహిస్తారు. కుల నిర్మూలనకు బాటలు వేసుకుంటారు. ఈ పరిణామాన్ని ఎవరు ఆపలేరు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పీడితుల మధ్య ఉండేవి శత్రు వైరుధ్యాలు కావు. వివిధ దేశాల మధ్య ఉండే కార్మిక వర్గాల మధ్య ఘర్షణ అనివార్యం కాదు. వారి మధ్య వాటాల పంచాయతీ ఉండదు, లాభాల పంచాయతీ ఉండదు. ఒక దేశ కార్మిక వర్గాన్ని మరో దేశ కార్మిక వర్గం దోపిడీ చేయలేవు. వివిధ దేశాలలో ఉండే దోపిడీ వర్గాల మధ్య ఐక్యత ఉంటుంది. వివిధ దేశాల కార్మిక వర్గాల మధ్య కూడా ఐక్యతకు ఆటంకాలు ఏముండవు; కృత్రిమంగా సృష్టించబడినా, అవి తాత్కాలికమే. ప్రపంచ కార్మికుల మధ్య ఐక్యత శాశ్వతం, అనైక్యత తాత్కాలికం. అందుకే మార్క్స్ 'ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారు' అని అన్నది. అది ఊహాజనితమైంది కాదు, ఆచరణాత్మకమైనదే.

భారత కమ్యూనిస్టులు విలీనం కాలేరనేది కూడా అశాస్త్రీయమైనదే, గతితర్కానికి నిలవదు. కమ్యూనిస్టు పార్టీలన్నీ శ్రామిక వర్గానికి ప్రతినిధులే. శ్రామిక వర్గాల మధ్య ఉండే వైరుధ్యం లేదా కల్పించబడేది కృత్రిమమైనదే. ఒక కమ్యూనిస్టు పార్టీ వెనుకనున్న శ్రామిక వర్గానికి, మరో కమ్యూనిస్టు పార్టీని అనుసరిస్తున్న శ్రామిక వర్గానికి మధ్య ఉండేది శత్రుత్వ వైరుధ్యం కాదు. ఆ శ్రామిక వర్గానికి నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నది కూడా శత్రు వైరుధ్యం కాదు. కమ్యూనిస్టు పార్టీలకు, బూర్జువా పార్టీలకు మధ్య ఉండేది మాత్రమే శత్రు వైరుధ్యం. శ్రామిక వర్గ పార్టీల మధ్య ఉండే వైరుధ్యం మిత్రుత్వపూర్వకమైనది. శ్రామిక వర్గాల మధ్య సృష్టించబడే వైరుధ్యం సరైంది కాదని కార్మికులు తమ అనుభవంలో తెలుసుకుంటారు; కార్మిక వర్గాలకు నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు కూడా తెలుసుకుంటాయి. అందువల్ల అవి అనివార్యంగా కలుస్తాయి. ఈ క్రమాన్ని ఎవరూ ఆపలేరు. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలయితే ఎవరైనా ఈ ప్రయత్నం చేయడం వృధా ప్రయాస. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నవి కేవలం మిత్రభేదాలు కాబట్టి కమ్యూనిస్టులు విధిగా, తప్పకుండా విలీనమవుతారు.

గతంలో కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏమాత్రం సఖ్యత లేని పరిస్థితి ఉండేది. ప్రతి పార్టీ మరో పార్టీ పట్ల శత్రువైఖరి కలిగి ఉండేది, ఘర్షణలు చోటు చేసుకునేవి, హత్యలు కూడా జరిగాయి. ఈ మధ్యకాలంలో చాలా సానుకూలమైన మార్పులు వస్తున్నాయి. సిపిఎం, సిపిఐ లు గత కొంతకాలం నుండి ఈ ప్రయత్నాలు చేస్తున్నాయి. నక్సలైట్ పార్టీలు కూడా విడివిడిగా ఉన్నవి దగ్గరవుతున్నాయి. దేశవ్యాప్తంగా సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, వామపక్ష పార్టీలతో సమన్వయ కమిటీ ఉన్నది. ఈ మధ్యకాలంలో కొన్ని నక్సలైట్ పార్టీలు విలీనం కూడా అయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో పదికి పైగా కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం సమస్యలపై కలిసి పనిచేస్తూ ఉన్నాయి.

కలిసి పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీల మధ్య ఒక సంకీర్ణ రూపం ఏర్పడాల్సిన అవసరం ఉంటుంది. ఈ ప్రయత్నాలన్నింటి అంతిమ లక్ష్యం విలీనం కావాలి. అప్పుడే కమ్యూనిస్టులు, ఇతర పూలే అంబేద్కర్ వాదులతో మరియు ఇతర వామపక్ష, అభ్యుదయ, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

ఈ సందర్భంగా లెనిన్ 'ఏమి చేయాలి?' అనే పుస్తకంలో చెప్పిన స్పృహ/ప్రయత్నపూర్వకత (consciousness), యాదృచ్ఛికత (spontaneous) అనే అంశాలను సదా మననం చేసుకోవడం అవసరం. దేనిని సాధించాలన్నా యాదృచ్ఛికాలపై ఆధారపడకూడదు, ప్రయత్నపూర్వకంగా జరగాలి. కమ్యూనిస్టుల ఐక్యతను చిత్తశుద్ధితో కాంక్షించేవారెవరైనా మాటలతో చెప్పడానికి పరిమితం కాకుండా ఆచరణలో చూపించాలి. ఆచరణను బట్టే వారికి కమ్యూనిస్టుల ఐక్యత పట్ల ఉన్న చిత్తశుద్ధిని అంచనా వేయాలి. నిర్దిష్టమైన కార్యక్రమం, సమయం ఏర్పాటు చేసుకొని, ప్రయత్నపూర్వకంగా (conscious) కృషి చేస్తేనే పునరేకీకరణ సాధ్యం.

ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారని మార్క్స్ చెప్పింది, భారత కమ్యూనిస్టులంతా విలీనం అవుతారని కమ్యూనిస్టు అభిమానులు, అభ్యుదయవాదులు, మేధావులు కోరేది గతితార్కిక సూత్రాలకు భిన్నం కాదని అర్థం చేయించాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలను కూడా దృష్టిలో పెట్టుకొని కమ్యూనిస్టుల ఐక్యత కొరకు పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థల కృషి జయప్రదం కావాలని కోరుకుందాం. మనసుంటే మార్గం ఉంటుంది. కమ్యూనిస్టులకుండే విమర్శ, ఆత్మవిమర్శ ఆయుధం చాలా బలమైనది. గత పొరపాట్లను విశ్లేషించుకుని కమ్యూనిస్టులందరూ ఒకే వేదిక పైకి వచ్చి, సరైన విధానాలను సకాలంలో తీసుకోగలిగితే కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమే. తమ స్వప్రయోజనాల కోసం, లాభాల కోసం పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు విలీనం కావడాన్ని గమనిస్తున్న కమ్యూనిస్టు నాయకులు తమ విలీనం ఎంత అవసరమో అర్థం చేసుకుంటారని ఆశించవచ్చు. కమ్యూనిస్టుల విలీనం జరగాలని, జరుగుతుందని ఆశిద్దాం.

**జి.రాములు,** 9490098006

### స్కిల్ యూనివర్సిటీలో

# గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు



- అక్టోబర్ 31లోగా అన్ని పనులు పూర్తి చేసి సమ్మిట్ బృందానికి అప్పగింత
- 54 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో యూనివర్సిటీ అభివృద్ధి
- ఫిబ్రవరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు : మంత్రి వివేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్–ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు స్కిల్ యూనివర్సిటీ వేదిక కానుండటంతో అక్కడ ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు సమ్మిట్‌ను స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, సమావేశ మందిరాలు, రహదారులు, డ్రైనేజీ తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి మంగళవారం యూనివర్సిటీలో అధికారులతో, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, అవసరమైన మెటీరియల్, మ్యాన్‌పవర్, వివిధ నిర్మాణ పనుల షెడ్యూల్‌పై సమగ్రంగా చర్చించారు. అక్టోబర్ 31లోగా సమ్మిట్‌కు అవసరమైన అన్ని పనులను పూర్తి చేసి ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందానికి అప్పగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సమ్మిట్ ప్రారంభానికి ముందే ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందానికి తగినంత సమయం లభించేలా పనులను ముందుగానే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో వివిధ సమావేశాలు, సెమినార్లు, చర్చలు నిర్వహించేందుకు భారీ స్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా ఆరు సెమినార్ హాళ్లను సిద్ధం చేస్తున్నామని, వీటికి అదనంగా మూడు పెద్ద హాళ్లు, మరో పది చిన్న హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలకు అనుగుణంగా వీటిని వినియోగించనున్నట్లు చెప్పారు.
సమ్మిట్ కోసం చేపడుతున్న నిర్మాణాలు కేవలం కార్యక్రమం వరకే పరిమితం కాకుండా భవిష్యత్‌లో స్కిల్ యూనివర్సిటీకి శాశ్వతంగా ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమ్మిట్ ముగిసిన అనంతరం నిర్మించిన భవనాలు, మౌలిక వసతులను యూనివర్సిటీకి అప్పగిస్తామని వెల్లడించారు. 54 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం చేపడుతున్న పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల కోసం బాయ్స్ హాస్టల్, గరల్స్ హాస్టల్, డైనింగ్ హాల్‌తో పాటు ఇతర మౌలిక వసతుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. స్కిల్ యూనివర్సిటీలో వచ్చే ఫిబ్రవరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా అవి తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# యుపిఐపై చార్జీలు ఉపసంహరించుకోవాలి

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నరసింహ
కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యుపిఐ లావాదేవీలపై చార్జీలు విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకు నల్ల దుస్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.టి. నరసింహ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నల్లధనం వెనక్కి తీసుకురావడం, ధరలను నియంత్రించడం వంటి అనేక హామీలు ఇచ్చిందన్నారు. అయితే గత 12 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. నగదు లావాదేవీలకు స్వస్తి పలికి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన కేంద్రం, యూపీఐ చెల్లింపులకు ఎలాంటి చార్జీలు ఉండవని గతంలో చెప్పిందన్నారు. ఇప్పుడు యూపిఐపై చార్జీలు విధించే ప్రతిపాదన తీసుకురావడం ప్రజలపై పరోక్ష భారానికి దారితీస్తుందని అన్నారు. వ్యాపారులు అదనపు చార్జీలను తమ లాభాల నుంచి భరించకుండా వస్తువుల ధరల రూపంలో వినియోగదారులపై మోపే అవకాశం ఉందన్నారు. యూపిఐ నిర్వహణ కోసం కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పుడు చార్జీలు విధించాల్సిన అవసరం ఏమొచ్చిందో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన డిజిటల్ చెల్లింపు సేవలను అందించేందుకు ప్రభుత్వం ఆ స్వల్ప మొత్తాన్ని భరించలేదా అని ప్రశ్నించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజా సేవా రంగాలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మత రాజకీయాల ముసుగులో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం ఎక్కువకాలం సాధ్యం కాదని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తీసుకురావాలని ఇ.టి. నరసింహ కోరారు. ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, సీనియర్ నాయకులు పి. ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశం, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్,జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్ ఉమర్ ఖాన్, పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి,ప్రవీణ్, రాజ్ కుమార్, పి.వెంకటయ్య,బొడ్డుపల్లి కిషన్, చెట్టుకింది శ్రీనివాస్, గ్యార నరేష్, బాలకృష్ణ, మహమూద్, కళ్యాణ్, అనిల్, షబ్బీర్, ఉదయ్, కృష్ణ, నరసింహ, రమేష్, భాను, తదితరులు పాల్గొన్నారు.



### గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో

## సిఇసి అశాస్త్రీయ విధానాలు


బిఆర్ఎస్ ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలు అశాస్త్రీయమని బిఆర్ఎస్ ఆరోపించింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎల్. రమణ, దాసోజు శ్రవణ్,మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానందన్‌తో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సుదర్శన్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదు చేసుకునేందుకు (ఫారం18 సమర్పణకు) నవంబర్ 6వ తేదీ తుది గడువుగా విధించడం హాస్యాస్పదమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రకారం ఫైనల్ ఎలక్టోరల్ రోల్ నవంబర్ 20 న ప్రచురితమవుతుందని, తుది ఓటరు జాబితా రాకముందే, పోలింగ్ స్టేషన్, పార్ట్ నంబర్, ఎపిక్ నంబర్ల వివరాలు తెలియకుండా, ఫారం 18 ఎలా సమర్పించాలని ఆయన ప్రశ్నించారు. ఈఅంశాన్ని తాము రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిదృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చినట్టు దాసోజు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియ ఒక తూతూ మంత్రంగా సాగుతోందని, సరైన ప్రకటనలు, స్పెషల్ క్యాంపెయిన్లు లేకపోవడంతో దాదాపు 90 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 82 లక్షల మందిలో కేవలం 38 లక్షల మంది మాత్రమే విచారణకు హాజరయ్యారన్నారు. స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే నోటీసులు తీసుకున్న వారిలో ఏకంగా 96 శాతం మంది విచారణకు గైర్హాజరవ్వడం సీఎం అసమర్థతకు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఓటర్ల నమోదు ప్రక్రియపైన ప్రత్యేక దృష్టి సారించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత అంశంపైన ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం కెటిఆర్, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించాలని, త్వరలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై మరింత చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పెచ్చులు ఊడి గాయపడిన రోగులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడం దారుణమని కెటిఆర్ అన్నారు. వినయ్ భాస్కర్‌పైన జరిగిన దాడికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ ఘటనపై సమాధానం చెప్పాల్సింది ముఖ్యమంత్రి, హోంమంత్రినే అని అన్నారు. ప్రజాప్రతినిధుల హక్కులను, ప్రజలను పరామర్శించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు గాను కేవలం 400ల మెగావాట్లను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలని, కానీ జీ13,జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారని, బొగ్గు వాడకంలో నాణ్యతా లోపం ఉన్నదని ఆరోపించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిందని ఆయన తెలిపారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ప్రస్తుతం బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఎన్.టి.పి.సి ద్వారా తెలంగాణ రాష్ట్రానికి 1600 మెగావాట్ల విద్యుత్ ఇస్తామని హామీనిచ్చారని, ఇందులో భాగంగానే తొలివిడతగా తమ ప్రభుత్వంలో 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. కెసిఆర్ ప్రభు త్వం ఇచ్చిన విద్యుత్ ఉత్పత్తిలో 3వ వంతును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులకు 7 నుంచి 8 గంటలు కరెంటును కూడా ఇవ్వడం లేదన్నారు. ఏపీ సీఎం శ్రీశైలం నుంచి 700 కిలోమీటర్లు కృష్ణా నదీ జలాలను తీసుకెళ్తున్నారని, బేసిన్‌లోనే ఉన్న ప్రాజెక్టులకు సిఎం రేవంత్ రెడ్డి నీళ్లను తీసుకెళ్లడం లేదని ఆరోపించారు.

## దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగితే సహించం

మంత్రి అడ్లూరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితులు, గిరిజనుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఎలాంటి ఘటనలనూ సహించబోమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల పరిరక్షణ, సమానత్వం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులకు సంబంధించి సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం అనంతరం సచివాలయంలో కాంగ్రెస్ ఎంపీల ఫోరం చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఎంపి బలరాం నాయక్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, వెడ్మ బొజ్జు, డాక్టర్ మట్టా రాగమయి, మురళీ నాయలతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 7,563 ఎస్‌సి, ఎస్‌టిఅట్రాసిటీస్ కేసులు నమోదు కాగా ఆ కేసుల్లో బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం, ఇతర సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చెప్పారు. పరిహారం విడుదలను బడ్జెట్ ప్రక్రియతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యం లేకుండా చూడాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా పోలీసు, సంక్షేమ, న్యాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి,ఎస్‌టిఅట్రాసిటీస్ చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరగగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇలాంటి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి సమావేశం జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు.చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు చెప్పారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని మంత్రి ప్రశ్నించారు. దళితులు కోరుకునేది ఆత్మగౌరవం, సమానత్వం, భద్రత అని.. ఈ ప్రభుత్వం దళిత, గిరిజన వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు నిరసన వ్యక్తం చేస్తే ఆ ప్రదేశాన్ని పసుపు నీటితో శుద్ధి చేసిన ఘటనపై కఠిన చర్యలు తీసుకునేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు.


## దసరాకు ముందే కొత్త పెన్షన్‌లు

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొత్త సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీని దసరా పండుగకు ముందే ప్రారంభించేలా అన్ని చర్యలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసుయ సీతక్క అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నెలలోనే కొత్త పెన్షన్‌ల పంపిణీ ప్రారంభమయ్యేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల చేతికి పండుగకు ముందే పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త పెన్షన్‌ల మంజూరు ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా క్షేత్రస్థాయి పరిశీలనను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పరిశీలన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్‌కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొత్త పెన్షన్‌ల మంజూరులో ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలు ఎవరూ నష్టపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్‌ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్ అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## భూకబ్జాలపై బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బాల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో భూముల వ్యవహారంపై బిఆర్ఎస్ నేతలు తమపై ఆరోపణలు చేయడం కంటే, గతంలో వారు అధికారిక ఎన్నికల అఫిడవిట్లలో చూపించిన ఆస్తులపై ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బాల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు నాలుగు రోజులుగా నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలతో బీఆర్ఎస్ నేతల భూముల వ్యవహారాలు వెలుగులోకి రావడంతోనే ఆ పార్టీ నేతలకు భయం పట్టుకుందని విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బాల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నేతల ఎన్నికల అఫిడవిట్లలోనే వందల ఎకరాల భూములు ఉన్నట్లు వెల్లడవుతున్నాయని, ఇక వెల్లడించని భూములు, బినామీల పేర్లలో ఉన్న ఆస్తులు ఎన్ని ఎకరాలో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నేతలు తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల్లోనూ భూములు సమకూర్చుకున్నారని ఆరోపించారు.దళితులకు మూడెకరాల భూమి ఇవ్వడానికి ముందుకు రాని బిఆర్ఎస్ నేతలు వందల ఎకరాల భూములను ఎలా సమకూర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు ఆస్తులు 2009, 2014 ఎన్నికల అఫిడవిట్లతో పోలిస్తే 2023 నాటికి ఎలా పెరిగాయో ప్రజలకు వివరించాలని కోరారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో మాజీ సైనికులకు కేటాయించిన భూముల విషయంలోనూ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.రంగనాయకసాగర్ ప్రాజెక్టు భూసేకరణ, పరిహారం, అనంతరం భూముల కొనుగోలు, ఫామ్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి పలు ప్రశ్నలు ఉన్నాయని బాల్మూరి వెంకట్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్, దేవాదాయ, ఎఫ్‌టిఎల్, ఇనాం భూముల విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమగ్రంగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిఆర్ఎస్ నేతలపై ఉందన్నారు. కెటిఆర్ జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలోనూ ఆయనపై ప్రశ్నలు సంధించారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన భార్య పేరుతో జన్వాడలో భూమి ఉన్నట్లు పేర్కొన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

### కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది

## ఫామ్‌హౌస్‌ల వద్దకు కాదు...

ఎండిపోయిన పంటలను ఎందుకు పరిశీలించడం లేదు? : జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది ఫామ్‌హౌస్‌ల వద్దకు కాదని, ప్రజల సమస్యల వద్దకు వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి అన్నారు. ఫామ్‌హౌస్ వద్దకు వెళ్తున్న వారు ఎండిపోయిన పంటలను ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు షాబాద్ మండలం మద్దూరు అనే గ్రామంలో భూమి ఉందని అఫిడవిట్‌లో పొందుపర్చానని, తనకు ఎయిర్ పోర్టు పక్కనే విలువైన భూములు ఉన్నాయని మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని, తమను అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించరు. తాము ఎప్పుడో ఎన్నికల అఫిడవిట్ లో పెట్టిన అంశాలను మాట్లాడి, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. కృష్ణా, గోదావరి కింద రైతులకు సాగు నీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అనుమతి లేకుండా ప్రయివేటు వ్యక్తుల ఇళ్లల్లోకి వెళ్లవద్దనే విష యం తెలియదా? అని ప్రశ్నించారు. వ్యక్తుల భూముల్లోకి వెళ్లి విచారణ చేసే హక్కు ఎవరిచ్చారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై దాడి చేసిన పోలీసులపై డిజిపి వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అత్యుత్సాహంతో విర్రవీగే పోలీసులపై అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ఎవరిని వదిలి పెట్టబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. జూరాలలో 9 టిఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు సాగు నీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

## 'ఒబిసి కాలమ్'పై మౌనం వహిస్తే బిసి ద్రోహులే

అక్టోబర్ 4న పాలమూరు నుంచి బిసిల పోరుబాట
నవంబర్‌లో రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో బిసి కులగణన గర్జన



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రశ్నావళిలో ఒబిసి కాలమ్ చేర్చాలని దేశవ్యాప్తంగా బిసిలు డిమాండ్ చేస్తున్నా.. రాజకీయ పార్టీల అధినేతలు స్పందించకపోవడం బాధాకరమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసిల డిమాండ్లపై మాట్లాడని, పోరాడని రాజకీయ పార్టీలను, వాటి నాయకులను బిసి ద్రోహులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఒబిసి సదస్సులో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి ఒబిసి సంఘాల ప్రతినిధులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిసి సంఘాల నాయకులు, కుల సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, మేధావులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.ఒబిసి కాలమ్ చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసిల పోరుబాట నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా అక్టోబర్ 4న మహబూబ్‌నగర్‌లో బిసి కులగణన పోరుబాట సమావేశం నిర్వహిస్తామని, అనంతరం వివిధ జిల్లాలు, రాష్ట్రాల్లో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నవంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో బిసి కులగణన గర్జన నిర్వహిస్తామని వెల్లడించారు. ఒబిసి కాలమ్ డిమాండ్‌కు మద్దతు కూడగట్టేందుకు అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాజకీయ పార్టీలతో పాటు సామాజికవేత్తలు, న్యాయ నిపుణులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మేధావులు, పౌరసమాజ ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒబిసి కాలమ్ అంశంపై పునరాలోచించాలని కోరారు. సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో పాటు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కుర్మా, బర్లమని మంజరి సాగర్, గూడూరు భాస్కర్, వరుణ్ కుమార్ గౌడ్, అనంతుల పవన్‌సాయి గౌడ్, శేషాద్రి, అంజమ్మ, నరసమ్మ, కరుణ, వెంకటేష్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

**NIT No.** 72/EE-I/MKJZ/MMC/2026-27, **పని పేరు:** నిర్వహణ పనులు, ఇతరాలు-5, **అంచనా విలువ:** రూ.91.72లక్షలు, **బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం:** 22.09.2026 ఉ.11:00గం.ల నుండి 25.09.2026 ఉ.11:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 10428-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**

తేది: 21.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 16/EE12/SRNR/MMC/2026-27, Dated: 21.09.2026 | 08 పనుల కొరకు "సర్కిల్ కార్యాలయం వద్ద టాయిలెట్ పనులు మరియు ర్యాంప్ పనులు" | రూ. 82.52 లక్షలు | 30.09.2026 సా.03.10 గం.ల వరకు | శ్రీ వి కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. సెల్ నెం. 9701365519 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.

DIPR R.O. No. : 10393-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

తెలంగాణ ప్రభుత్వం
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం**
మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ :: మహబూబాబాద్

**షార్ట్ టెండర్ నోటీసు నెం. 01/2026-27, తేది: 21.09.2026**

01 పని-01వ పిలుపు-01వ దశ పనికి సంబంధించిన షార్ట్ టెండర్ నోటీసు. ప్రస్తుత బోర్‌వెల్ నుండి సీరోల్ EMR పాఠశాల వరకు కొత్త పంప్‌సెట్ ఏర్పాటు చేసి, పైప్‌లైన్ వేయడం కొరకు టెండర్‌ను ఆహ్వానించడమైనది. ఈ పని TSES, హైదరాబాద్ కార్యదర్శి గారి ప్రొసీడింగ్స్ నం. Rc.No.TGES-Admn/1050920/2006, తేది: 07.09.2026 ప్రకారం మంజూరు చేయబడింది.

పనిపేరు: ప్రస్తుత బోర్‌వెల్ నుండి సీరోల్ EMR పాఠశాల వరకు కొత్త పంప్‌సెట్ ఏర్పాటు చేసి, పైప్‌లైన్ వేయడం - (1వ పిలుపు).

ఈ టెండర్ https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో **28.09.2026** నుండి **04.10.2026** వరకు మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. టెండర్లను **04.10.2026** సాయంత్రం **4:00** గంటలకు తెరవబడును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మిషన్ భగీరథ ఇంట్రా, మహబూబాబాద్.

DIPR R.O. No. : 10404-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

# అరుదైన ఖనిజం.. అక్రమ తరలింపు

• కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో అక్రమ తవ్వకాలు : మత్తులో మైనింగ్ శాఖ • మంత్రి అనుచరులమంటూ రూ. కోట్ల దందా





**ప్రజాపక్షం/ ఖమ్మం :** అరుదైన ఖనిజం దీని లభ్యత చాలా తక్కువ. దీనితో అక్రమ తవ్వకాల ద్వారా కొందరు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ అరుదైన ఖనిజ సంపదను అక్రమంగా తరలిస్తున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో జరుగుతున్న ఈ అక్రమ దందా విషయంలో ఎవరు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ తవ్వకాలను నిలువరించాల్సిన మైనింగ్ శాఖ మత్తులో జోగుతుంది. బెరైటీస్ ఖనిజం అరుదైనది, విలువైనది. ఆంధ్రప్రదేశ్‌లోని కడపతో పాటు ఇప్పటి మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, ఖమ్మం అర్బన్ మండలాల్లో లభ్యమవుతుంది. గార్లలో ఫారెస్టు భూముల్లో క్వారీలు ఉండడంతో తవ్వకాలను నిలిపి వేశారు. ఖమ్మం అర్బన్ మండలంలో బెరైటీస్ తవ్వకాలకు అనుమతులు పొందిన కొందరు తప్పుడు ఆధారాలతో అటవీ భూముల్లో తవ్వకాలు జరుపుతుండడంతో నిలిపివేశారు. కానీ ఖమ్మం కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఇప్పుడు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. కడప ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఖమ్మం జిల్లాకు చెందిన మరికొందరితో కలిసి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ అరుదైన బెరైటీస్ ఖనిజాన్ని వెలికితీసి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రహస్య ప్రాంతాల నుంచి కడప, కోదాడ ప్రాంతాలకు బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఈ బెరైటీస్ తవ్వకాలు జరుపుతున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంత విలువైన ఖనిజం ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదంటే అక్రమ తరలింపుకు పాల్పడుతున్న వారు ఓ మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అక్రమ తవ్వకాలు జరపడంతో పాటు గార్ల నుంచి కూడా బెరైటిస్ ఖనిజాన్ని దొంగతనంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రఘునాథపాలెం మండలంలో బెరైటీస్ లభించే ప్రాంతాన్ని వివిధ సంస్థలకు కేటాయించినప్పటికీ అక్కడి నుంచి కూడా రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు చేపట్టి ఖనిజాన్ని తరలిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ మొత్తం అక్రమ తరలింపు వ్యవహారంపై గతంలో మైనింగ్ అధికారులు లారీలను నిలుపుదల చేయడంతో పాటు కొంత మందిపై కేసులు నమోదు చేశారు. వాస్తవానికి ఖమ్మం జిల్లాలో బెరైటీస్ తవ్వకాలకు సంబంధించి చింతకాని, కారేపల్లి మండలంలో ఒక్కో క్వారీ చొప్పున మాత్రమే అనుమతులు ఉన్నాయి. అనుమతులు లేకుండా ఖనిజాన్ని తరలిస్తూ కోట్లు కొల్లగొడుతున్న వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

**ఉదాసీన వైఖరిలో మైనింగ్ శాఖ :**

ఖమ్మం జిల్లా మైనింగ్ శాఖ ఉదాసీన వైఖరిలో ఉంది. ఎవరు అక్రమాలకు పాల్పడుతున్నారో వారికే మైనింగ్ శాఖ మద్దతు పలుకుతుంది. ఖమ్మంజిల్లాలో దశాబ్దకాలంగా మైనింగ్ శాఖ మాముళ్ల మత్తులో జోగుతుండడంతో మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతుంది. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసే వారు. గడిచిన రెండేళ్లుగా మైనింగ్ శాఖ ఇసుక, మట్టి అక్రమ రవాణా వ్యవహారంలో చేష్టలూడిగి చూస్తుండిపోతుంది. బెరైటీస్ విషయంలో ఎందుకో ఆ వైపుకు కన్నెత్తి చూడడం లేదు. మైనింగ్ శాఖ ఉదాసీన వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. మంత్రుల పేరు చెప్పి వారి అనుచరులు మట్టి, బెరైటీస్ దందాలకు పాల్పడుతున్నారు. నిజంగా మంత్రుల మద్దతు ఉందో లేదో తెలియదు కానీ వారి ప్రధాన అనుచరులు అధికారులకు ఫోన్ చేసి హెచ్చరికలు జారీ చేస్తుండడం కూడా మైనింగ్ శాఖపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

## మణుగూరు కరాటే మాస్టర్స్‌కు గ్లోబల్ అవార్డులు

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరుకు చెందిన కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక గ్లోబల్ స్థాయిలో అవార్డులు అందుకోవడం పట్ల పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. మణుగూరుకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ బ్లాక్ బెల్ట్ 4వ డాన్ విభాగంలో గ్లోబల్ మాస్టర్ అవార్డు అందుకోగా, గుగులోత్ రిషిక బ్లాక్ బెల్ట్ 1వ డాన్ విభాగంలో గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాలతో సత్కరించి అభినందించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన వారు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో యువత మరింతగా రాణిస్తూ ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మణుగూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## రామారావుకు మంత్రి తుమ్మల నివాళి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** డిసిసిబి మాజీ డైరెక్టర్, వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కిలారు రామారావు మృతిపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం వి. వెంకటాయపాలెం గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి రామారావు చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామారావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ కాపా ఆదినారాయణ, నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, కిలారు వెంకటరమణ, మూడ్ శంకర్, ఆవుల జానకిరాములు, అమరనేని వెంకటేశ్వర్లు, ఆదామ్, కుతుంబాక వెంకటేశ్వర్లు, మాలోత్ రమేష్, ఉయ్యాల వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం


**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో ఖాళీగా ఉన్న రెండు అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బి. రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత పనిలో అనుభవం కలిగిన మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, దరఖాస్తు ఫారం, ఏడవ తరగతి మార్కుల మెమో, ఇతర సంబంధిత ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో కెజిబివి పాఠశాలలో అందించాలన్నారు. దరఖాస్తులు ఈనెల 25న సాయంత్రం ఐదు గంటల వరకు అందించవచ్చునని ఎంఈవో తెలిపారు. అర్హత కలిగిన మహిళలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని అశోక ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సమావేశం రాష్ట్ర జనరల్ సెక్రటరీ దారవత్ మోహన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షునిగా కొణిజర్ల మండలానికి చెందిన దొండ దర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఖమ్మం రూరల్ మండలానికి చెందిన యల్లంపల్లి యాదగిరిని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ జానిమియా, కోశాధికారిగా గుమ్మడవెల్లి సంతోష్‌కుమార్, గౌరవ సలహాదారుగా కల్లూరు మండలానికి చెందిన రంగారావు లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 34 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు అభినందించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ఖమ్మం అర్బన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సాయికుమార్, గోర్ల మురళీ, ఖాజామియా, పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో కొత్త మిషనరీ అందుబాటులో ఉంచాలి: ఎఐటియుసి



**ప్రజాపక్షం/మణుగూరు:** పికె ఓ సి 2, కేసిహెచ్పి లో ఉన్నతాధికారులకు మెమోరాండం అందజేత పీకే ఓ సీ 2, కెసిహెచ్‌పిలలో నూతన వాహనాలు, యంత్రాల విడిభాగాలు, సేఫ్టీ పరికరాలు, సరైన మ్యాన్ పవర్ లేకపోవడం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. డంపర్, డోజరు, షావల్ లు, వాటి విడిభాగాలు, సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. కె సిహెచ్ పి కి సంబంధించి రోలర్లు, బెల్టులు, హైడ్లర్లు, కమ్యూనికేషన్ సిస్టం, టెక్నీషియన్స్ కి పనిముట్లు, కార్మికులకు లెదర్ షూ, ఆఫీస్ చైర్స్ అండ్ కార్మికులకు లాకర్లు, బేరింగులు, స్పేర్ పార్ట్స్ పీపీఈ కిట్స్, డస్ట్ సస్పెషన్ సిస్టం స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. రక్షణతో పని చేయడం కూడా కష్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, జీఎం కమిటీ మెంబర్ ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీలు ఎస్ కుమారస్వామి, జి శ్రీనివాసరావు, ఉడుత శివ, బైరి వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


• రబీ సీజన్‌కు పంటల ప్రణాళిక సిద్ధం చేయాలి • విద్యుత్ అవసరాలకు పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి • ఖమ్మం నియోజక వర్గ అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్:** ఖమ్మం నియోజక వర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజక వర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలన్నారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏప కాలువలకు అందించవచ్చో పరిశీలించి అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలన్నారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు 10ఎ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణిని మార్చుకోవాలని సూచించారు. సాగు నీరు, తాగునీటికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని ఒక ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదన్నారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేసి నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని నాలుగు లైన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల, హాస్టల్, అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖాధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నీటి లభ్యత, విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హ్యామ్ రోడ్లకు సంబంధించి పలు పనులకు రూ.36.60 కోట్లు మంజూరు లభించిందని టెండర్ పూర్తయిందని నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో ఏడు కొత్త సబ్ స్టేషన్లు ప్రతిపాదించామని వాటికి అవసరమైన భూమిని కేటాయించామన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖమ్మం కార్పోరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ సమీక్షలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రాధాన్యం

క్రీడల హబ్‌గా కొత్తగూడెం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/పాల్వంచ:** క్రీడాభివృద్ధికి, క్రీడాకారులను తయారు చేయటానికి ప్రాధాన్యతను ఇస్తున్నామని కొత్తగూడెం నియోజకవర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్మే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ క్రీడలు ఐదవ రోజు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆతిధ్యం ఇచ్చిన శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ సురేష్‌రెడ్డికి, 75, 80 సంవత్సరాల వయసుతో క్రీడల్లో పాల్గొన్న సాయిరాంబాబు, భాస్కర్‌రావులకు ముందుగా అభినందనలు తెలిపారు. క్రీడలు మానసిక ఒత్తిడిని జయించడమే కాకుండా గెలవాలనే పట్టుదలను పెంచుతాయని, శారీరక దృఢత్వాన్ని, మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగూడెం నియోజక వర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చి దిద్దేందుకు పాటుతున్నామని చెప్పారు. శ్రీనివాస కాలనీ మిని స్టేడియం అభివృద్ధికి 70 లక్షల నిధులను, కొత్తగూడెంలో ప్రగతి మైదానంతో పాటుగా మరో స్టేడియం ఏర్పాటుకు 18 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. . కొత్తగూడెం, పాల్వంచ నుండి సిఎం కప్‌లో విజేతలుగా నిలిచారని వారిని మరింత ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడాస్పూర్తిని ప్రస్ఫుంచి స్పూర్తిని నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, చీఫ్ రిటైర్డ్ జడ్జి రామక్రిష్ణ, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, డిప్యూటి ఛైర్మన్ సిరిపురపు లలితకుమారి, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, సిపిఐ నాయకులు డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్‌గిరి, 45 డివిజన్ కార్పోరేటర్ దంతెబోయిన నరేష్, టెన్నిస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి జకరయ్య, వై. వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల జలదోపిడీ అరికట్టాలి

సీతారామ జలాలను కొత్తగూడెం జిల్లాకు ఇవ్వాలి
ఇల్లందు మాజీ ఎమ్మెల్మే గుమ్మడి నరసయ్య



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మంత్రుల జలదోపిడీని అరికట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు అందజేయాలని ఇల్లందు మాజీ శాసనసభ్యులు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి లు డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండల పరిధిలోని వినోబా నగర్ ప్రాంతంలోని సీతారామ ప్రాజెక్టును మాస్ లైన్ పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాలు భూములు కోల్పోయి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఈ జిల్లాలోని రైతాంగానికి నీరు అందించకుండా ఇతర ప్రాంతాలకు జలాలను తరలిస్తూ ఉమ్మడి జిల్లాలోని మంత్రులు జలదోపిడి చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లా చివరి ప్రాంతమైన జూలూరుపాడు నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్నారని, అదే సమయంలో ఇక్కడ రైతాంగానికి కూడా నీరు అందించేందుకు చర్యలు చేపట్టకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో డిజైన్ చేసిన విధంగా రోల్లపాడు చెరువు నింపడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తానికి పక్కనున్న మహబూబాబాద్ జిల్లాకు కూడా తక్కువ ఖర్చుతో నీరందించే అవకాశం ఉన్నప్పటికీ గతంలో అధికారంలో ఉన్నటిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చుక్క నీరును ఈ జిల్లా రైతాంగానికి అందించలేదని విమర్శించారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట నష్టపోతున్న ప్రాంతానికి నీరు అందించకుండా మంత్రులు అధికార బలంతో ఇతర ప్రాంతాలకు నీరు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి కాలువలు నిర్మించారని, పంటలు పండే వారికే మరో పంట పండేందుకు నీరు అందించి మంత్రులు తమ కుటిల బుద్ధిని చాటుకున్నారని అన్నారు. జిల్లాలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు నీరు అందించేందుకు తక్షణమే సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. జూలూరుపాడు ప్రాంతంలో దండాల్ చెరువు చెనగచెరువు కప్పలకుంట చెరువులకు నీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పంట కాలువల తీయాలని వారు డిమాండ్ చేశారు. దీని ద్వారా సుజాత నగర్ ప్రాంతంలోని సింగభూపాలెం ప్రాజెక్టు కూడా నీరు చేరి పంటలు పండేందుకు అవకాశం ఉన్నదని వారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు జిల్లాలో నష్టపోయిన రైతాంగం కోసం, జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ కాల్వను పరిశీలించిన వారిలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు,భానోత్ ధర్మ, ఎస్ కే యాకుషావలి, కల్లూరి కిషోర్, బుర్ర వెంకన్న, మండల నాయకులు లింగాల, వీరభద్రం, తోటకూరి నరేష్, బైరు వెంకన్న, రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మంలోని వరుణ్ మోటార్స్, భారత్ హ్యూండాయ్ లలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీలో పనిచేసే విధంగా ఫార్మసిస్టు, ట్రైనీ ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వయిజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్‌గా పనిచేయుటకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ ర్హత గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 12,500 నుంచి రూ. 2 ట5వేల వరకు ఉంటుందన్నారు.ఖమ్మంలో వరుణ్ మోటార్స్ లో సేల్స్ ఎగ్జిక్యూటీవ్, టెక్నీషియన్, సెక్యూరిటీ, అడ్వయిజర్ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు.

## ధాన్యం నిల్వకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం నిల్వకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసి), వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి), ప్రైవేట్ గోదాముల యజమానులు, పౌర సరఫరాల శాఖాధికారులతో ఖరీఫ్ సీజన్ ధాన్యం నిల్వ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ప్రాంతాల్లో సేకరించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు తీసుకుంటున్న గోదాములు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. హమాలీలు లేని చోట్ల వెంటనే ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత


తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

జెడ్‌పి సిఇఒ నాగలక్ష్మి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జెడ్‌పి సిఇఒ నాగలక్ష్మి సూచించారు. సోమవారం మోరంపల్లి బంజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా 2026 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త చేయకుండా చెత్తబుట్టలను వినియోగించాలని సూచించారు. వైద్య, పారిశుధ్య వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపరాదన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని ఇళ్లు, పాఠశాలల్లో స్వచ్ఛత పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపిఒ రామకృష్ణ, సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉప సర్పంచ్ పొక్కుల రవి, పంచాయితీ కార్యదర్శి ఇసి వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యక్తిని గాయపరచిన వ్యక్తులు అరెస్ట్



**ప్రజాపక్షం/కరకగూడెం:** అశ్వాపురంపాడు గ్రామ శివారులో ఉన్న ఫారెస్ట్ ప్లాంటేషన్ వద్ద అశ్వాపురంపాడు గ్రామానికి చెందిన వజ్జా భీమరాజు అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసి మెడ పైన తల పైన విచక్షణారహితంగా గాయపరిచిన వ్యక్తులని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఏడుళ్ళ బయ్యారం సీఐ వి వెంకటేశ్వరరావు వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవాసి బాలకృష్ణ, పోడియం విజయ్, కోవాసి సంతోష్, పోడియం మంగయ్య అను నలుగురు వ్యక్తులు గతంలో వాళ్ల ఊరు పెద్దమనిషి అయిన వెంకటేశ్వర్లు మొదటి ముద్దాయి వాళ్ల నాన్న చంపబడినందుకు అతను చంపిన వ్యక్తి భీమరాజు అని జైలు నుంచి విడుదల కాగానే ఈ నలుగురు మాట్లాడుకుని అతనిని ఫారెస్ట్‌కు పశువుల మేపటానికి వెళ్లగా అతని వెంబడించి కత్తులతో నరికి అక్కడ నుంచి వెళ్ళిపోయారని తెలిపారు. ఈ రోజున నలుగురు నేరస్థుల్ని కరకగూడెం పోలీసు వారు పట్టుకొని వారిని రిమాండ్ కి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు, ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండు కాంప్లెక్స్ మీటింగులో పాల్గొన్నానీ విద్యార్థిని, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించే విధంగా తరగతులను నిర్వహించాలని, ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యం వచ్చే విధంగా వారికి శిక్షణ ఇవ్వాలని, ప్రతి విద్యార్థిని గమనిస్తూ ఉంటూ అందరికీ డిజిటల్, ఎఫ్ఎల్ఎన్, తరగతుల ద్వారా అత్యుత్తమ బోధనలు అందించాలని కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న (34) ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో పిల్లలకు హెల్త్, ఎడ్యుకేషన్ , న్యూట్రిషన్ , సానిటేషన్‌లపై అవగాహన కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆరోగ్య మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలని తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు జరుగుతున్న పోషణ అభియాన్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మన అంగన్వాడీ మన బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్, ప్రక్రియను నోటీసులు అందుకున్న వారి గ్రీవెన్స్‌లను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఓటును మ్యాపింగ్ చేయాలని, ఇప్పటివరకు రెస్పాండ్ గాని ఓటరును స్వయంగా కలిసి ఓటు ప్రాముఖ్యత గురించి వివరించాలని తెలిపారు, ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఇన్చార్జి డిఈఓ మందుల శ్రీరాములు, ఇంచార్జ్ వెల్ఫేర్ అధికారిని శిరీష, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో అనురాధ, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జీడికల్ రామచంద్రస్వామి ఆలయం పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగాలి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** శ్రీ వీరాచల శ్రీ రామచంద్ర స్వామి ఆలయం పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగాలని, మాజీ డిప్యూటీ సీఎం స్టేషన్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని జీడికల్ గ్రామంలోని గల శ్రీ వీరాచలం జీడి కంటి శ్రీ రామచంద్రస్వామి దేవాలయాన్ని స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. అనంతరం నవంబర్ నెలలో వచ్చే కార్తీకమాసంలో జరగనున్న శ్రీ వీరాచల రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు చేపట్టవలసిన ఏర్పాటుపై వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు 13 లక్షల 61 వేల రూపాయల విలువగల చెక్కులను వారిద్దరు కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించాలని శాశ్వత ప్రతిపాదికన కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం పనులు, జాతరలో ఎలాంటి అవనించనీయమైన సంఘటనలు చోటుచేసుకున్న ప్రత్యేక పోలీస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాజమహేంద్ర నాయక్ వంశీ, వంశీధర్ రెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, శివకుమార్, విజయ మనోహర్, మూర్తి, బెజ్జం ఆంజనేయులు, దేవరాయరాజు, సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్ :** గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే నిమజ్జన ఏర్పాట్లకు అధికారులను షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించడం జరిగిందని,తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, పడవలు, 108 అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు మొత్తం నిమజ్జన ఏర్పాట్లకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇంట్లో అల్లుడి పండగ నిద్ర!



**ప్రజాపక్షం/నెక్కొండ:** ఇంటికి అల్లుడు వస్తే ఎక్కడ పడుకోబెట్టాలి? అంటూ గత పాలనలో చేసిన వ్యాఖ్యలు..ఇప్పుడు పేదల ఇళ్ల ముందే రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోవడంతో పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. నెక్కొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం చెన్నారావుపేట, నెక్కొండ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు ఎంఎల్ఏ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఒకప్పుడు పేదవాడి ఇంట్లో అల్లుడు వస్తే ఎక్కడ పడుకోవాలన్న పరిస్థితిని ఎద్దేవా చేసిన మాటలు వినిపించాయి. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండలానికి 56, నెక్కొండ మండలానికి 34 మంది లబ్దిదారులకు కలిపి సుమారు రూ.91 లక్షలకు పైగా విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఎంపిడిఓ యాసం లావణ్య, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, బక్కి అశోక్, హరిప్రసాద్, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సదానందం, ఆవుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు న్యాయవాది తిరుమల చౌహాన్, లబ్దిదారులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఆలయానికి కొత్త వైభవం

రూ.198 కోట్లతో పునర్నిర్మాణ పనులు
పాత సిమెంట్ నిర్మాణాల తొలగింపు
కృష్ణశిలలతో కొత్త ఆలయ నిర్మాణం..
గోదావరి పుష్కరాల నాటికి ప్రధాన పనులు పూర్తి చేయాలని లక్ష్యం

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** దక్షిణ కాశీగా, దక్షిణ త్రివేణి సంగమంగా పేరొందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి క్షేత్రం కొత్త రూపు సంతరించుకోబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



**ఏప్రిల్ 20న సిఎం శంకుస్థాపన:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 20న కాళేశ్వరంలో పర్యటించి రూ.198 కోట్ల పునరాభివృద్ధి పనులకు, రూ.3. 70 కోట్లతో నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేసే ప్ర ణాళికలో భాగంగా కాళేశ్వరానికి తొలి ప్రాధాన్యత ఇ చ్చారు.

**యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులు:** ప్రస్తుతం పాత నిర్మాణాల కూల్చివేత దాదాపు పూర్తి కావొచ్చింది. 197682లో నిర్మించిన ఇటుక, సిమెంట్ నిర్మాణాలు, ప్రాకారాలు, రాజగోపురాలు, విజయ గణపతి, మహా సరస్వతి, శుభానందాదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు, మిర్రర్ మండపం, అభిషేక మండపాలను తొలగించారు. వీటి స్థానంలో కృష్ణశిలలతో శాశ్వత రాతి కట్టడాలను తమిళనాడు శిల్పుల ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. ప్రధాన గర్భగుడిలోని పవిత్ర ద్విలింగాలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. ఈ మాస్టర్ ప్లాన్ కు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి ఆమోదం కూడా లభించింది.



**భక్తులకు ఇబ్బంది లేకుండా బాలాలయం:** పునర్నిర్మాణ సమయంలో పూజలకు అంతరాయం కలగకుండా సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి ఆలయంలో బాలాలయం ఏర్పాటు చేసి నిత్య పూజలు, దర్శనాలు అక్కడికి మార్చారు.

**పుష్కరాల వరకు నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యం:** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి ప్రధాన గర్భాలయం, కీలక నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త ప్రాజెక్టులో ఒకేసారి 25,000 మంది భక్తులు ఉండేలా విశాలమైన క్యూ కాంప్లెక్స్, పరిపాలనా భవనం, మౌలిక వసతులు కల్పించనున్నారు. అదనంగా రూ.60 కోట్లతో అష్టతీర్థాలైన పక్షి తీర్థం, వ్యాస తీర్థం, జ్ఞాన తీర్థం తదితర పవిత్ర జలాశయాలు, స్నానఘట్టాలు, అప్రోచ్ రోడ్ల అభివృద్ధి కూడా చేపట్టనున్నారు.

**కాళేశ్వర దేవాలయ అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

కాళేశ్వరం దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులు బాగా రాష్ట్ర ఐ టి, ఇండస్ట్రియల్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆలయ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో అభివృద్ధి పనుల పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల నాటికి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

## మహిళా కారాగారాన్ని సందర్శించిన ఎసిపి రవీందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని నర్సంపేట ఏసిపి రవీందర్‌రెడ్డి, సిఐ ఎం. శ్రీనివాస్, జైలర్ స్రవంతిలు సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారంలోని భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను తనిఖీ చేసి, ఏర్పాట్లు సక్రమంగా ఉన్నట్లు తెలిపారు. భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

## రూ.1.43 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు శంకుస్థాపన

**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పెద్దమ్మగడ్డ కాలనీకి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్దమ్మగడ్డ ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని వెనుకబడిన ప్రాంతంగా ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నారే తప్ప, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలనే ఆలోచనతో ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. ప్రజలకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ అర్బన్



ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.1.43 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండేలా, శాశ్వతంగా వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు వెల్లడించారు.పెద్దమ్మగడ్డ అభివృద్ధికి హెల్త్ సెంటర్‌తో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తామని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కూడా పరిశీలించి, అందుకు అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పెద్దమ్మగడ్డ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీ సుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాల ను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లాలో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక ఆలయాల వద్ద పారిశుధ్య నిర్వహణ, మౌళిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్‌లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపదపై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డి ఈ ఓ, డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం గొల్లలగుడి వద్ద హెరిటేజ్ వాక్‌ను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్‌లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. 26వ తేదీన ఉదయం 8గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఇన్‌చార్జి జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, డిఈఓ సిద్దార్థ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే అని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను వారు సందర్శించి, పాఠశాల జూనియర్ కళాశాలలో తరగతులను పరిశీలించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పాఠశాలలోని తొమ్మిదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి అకాడమిక్ ఫ్రేమ్ వర్కులో భాగంగా ఇంగ్లీష్ గ్రామర్ పై విద్యార్థులను ప్రశ్నించారు. వాట్ ఇస్ హోంవర్క్, ఓవర్ ఈజ్ వాట్ అని రెండు వాక్యాలలో అడిగి సరైన వాక్యం వాట్ ఇస్ హోంవర్క్ పై విద్యార్థులకు వివరించారు. పదవ తరగతిని సందర్శించి ఫిజిక్ (భౌతిక శాస్త్రం) బోధన తీరును పరిశీలించారు. పాఠశాలలో తరగతుల గదులను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయు రాలికి సూచించారు. వంటశాలను పరిశీలించి కట్టెల పొయ్యి మీద వంట చేయరాదని గ్యాస్ పై మాత్రమే వంట చేయాలని వారు ఆదేశించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయ రాలు సునీత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగ మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు



**జనగామ:** ప్రజావాణిలో చేసిన విజ్ఞప్తికి స్పందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. పాలకుర్తి మండలంలోని మంచుప్పుల గ్రామానికి చెందిన దృష్టి వైకల్యం కలిగిన దివ్యాంగ మహిళ మేకల పద్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. పాత కచ్చా ఇంట్లో తండ్రి, తమ్ముడితో ఇబ్బందులు పడుతున్న పద్మ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ సాయం కోరారు. విచారణ అనంతరం ఆమె అర్హురాలిగా గుర్తించి రూ.5లక్షల ఆర్థిక సాయంతో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో పద్మకు ప్రొసీడింగ్స్ కాపీని కలెక్టర్ అందజేశారు. ఇంటి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి పూర్తయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలని ఎంపీడీవోను ఆదేశించారు.

## పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

భూపాలపలి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె.జీవన్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి ఆమె ఆత్మహత్యకు కారకుడైన గోల్కొండ రాజశేఖర్ అనే వ్యక్తికి నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10.000/ జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ మంగళవారం సంచలన తీర్పు ఇచ్చినారు.

**కేసు యొక్క పూర్వాపరాలు:** కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మైనర్ బాలికను 9/12/2021న కాటారం ఎమ్మార్వో ఆఫీస్‌లో ఆధార్ కార్డు మార్చుకోవడానికి కాటారం వెళ్ళుట కొరకు ధన్వాడ బస్టాండ్ వద్ద ఆటో కొరకు ఎదురు చూస్తుండగా, ఇంతలో మున్నా అనే తెలిసిన వ్యక్తి కాటారం వెళ్తుండగా, అతని మోటార్ సైకిల్‌పై ఎక్కి కాటారం వెళ్తుండగా, ఇంతలో కాటారం మండలం చింతకాని గ్రామానికి చెందిన గోల్కొండ రాజశేఖర్ అతను బండి ఆపి అతని బండి మీద ఎందుకు పోతున్నావని బెదిరించి, బాలికను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని చింతకాని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తన రూమ్‌కి తీసుకెళ్లి బాలికను బలవంతంగా లైంగిక దాడి చేసి, ఆ తర్వాత అట్టి బాలికను తన బండి మీద ఎక్కించుకొని వచ్చి కాటారం సెంటర్లో దింపి, ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపుతానని బెదిరించి వెళ్లిపోయినాడు. ఈ అవమానం భరించలేక సదరు మైనర్ బాలిక కాటారంలో గడ్డి మందు తీసుకొని తన ఇంటికి వెళ్లి తాగినందున, ఆమెను వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో చేర్పించగా, అక్కడ చికిత్స పొందు తూ చనిపోయింది. అమ్మాయికి తల్లిదండ్రులు లేనందున, ఆమె బాబాయి సంరక్షణలో ఉం టుంది. బాలిక బాబాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేర కు అప్పటి



కాటారం ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఏఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేసినారు. తదుపరి అప్పటి అప్పటి కాటారం సిఐ రంజిత రావు నేరస్తున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి సరియైన సాక్షాదారాలతో నిందితునిపై కోర్టులో చార్జి సీటు ఫైల్ చేసినారు. ఇట్టి కేసు విచారణ సమయంలో సూర్య నారాయణ డిఎస్పి కాటారం, సి.ఐ నాగార్జున రావు, కాటారం, సిహెచ్ శ్రీనివాస్ ఎస్ఐ కాటారం ఆధ్వర్యంలో కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ, జి .వెంకన్న, కోర్ట్ కానిస్టేబుల్ కె. రమేష్ సాక్షు లను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్.విష్ణువర్ధన్ రావు,జి. వెంకట్రామ్‌లు తమ వాదనలు వినిపించినారు. సాంకేతిక ఆధారాలతో నేరం రుజువైనందున, న్యాయమూర్తి నిందితునికి పై శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చినారు.

## ఎంజిఎంలోకి వెళ్లకుండా వినయ్‌ను అడ్డుకున్న పోలీసులు

పోలీసులకు, బిఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట
వినయ్ భాస్కర్‌కు గాయం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, మౌలిక వసతుల కొరత, రోగుల ఇబ్బందులను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో వినయ్‌భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తస్రావం జరిగినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. రోగులను పరామర్శించేందుకు అనుమతించాలని ఆయన కోరినా పోలీసులు నిరాకరించినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రధాన గేటు వద్ద గంట పాటు హైటెన్షన్ నెలకొంది.ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో ఇటీవల పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు సహా పలువురు గాయపడిన ఘటన కలకలం రేపింది. దీంతో ఆస్పత్రి భవనాల భద్రత, నిర్వహణపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఎంజీఎంలో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు, భవనాలకు పెచ్చులు ఊడిపడుతున్న తీరును పరిశీలించేందుకు వినయ్‌భాస్కర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆస్పత్రికి వచ్చారు.

**గేటు వద్దే అడ్డుకున్న పోలీసులు:** వినయ్‌భాస్కర్ ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ లోపలికి వెళ్లనివ్వలేదు. రోగులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన తనను ఎందుకు అడ్డుకుంటున్నారని వినయ్‌భాస్కర్ ప్రశ్నించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. అనుమతిపై స్పష్టత రాకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో గేటు పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం అనంతరం తోపులాట జరిగింది. కార్యకర్తలను పోలీసులు నిలువరించే ప్రయత్నం చేయడంతో పెనుగులాట, తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే వినయ్ భాస్కర్ కాలు, చేతికి తీవ్ర గాయాలై రక్తస్రావమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తనపై పోలీసులు దాడి చేశారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. తోపులాటలో గాయపడటంతోపాటు కడుపులో తన్నారని, చేతికి గాయమైందని కన్నీటి పర్యంతమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వ కనుసన్నల్లోనే పోలీసులు తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.



**మహిళల నిలదీత.. గంటపాటు హైటెన్షన్:** వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంపై అక్కడున్న కొందరు మహిళలు కూడా పోలీసులను ప్రశ్నించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. ఎంజీఎంలో కనీస వసతులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన వినయ్‌భాస్కర్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారని వారు నిలదీసినట్లు పేర్కొన్నారు. రోగులకు సరైన వైద్యం, కనీస సౌకర్యాలు కల్పించాలని మహిళలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధి రోగుల సమస్యలను తెలుసుకునేందుకు వస్తే అడ్డుకోవడం సరికాదని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలను పోలీసులతో అడ్డుకోవడం తగదని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# పోషకాహారంతో బంగారు భవితకు బాట

### అంగన్వాడీ సేవలు నియోగించుకోవాలి, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పిల్లలకు సరైన పోషకాహారం క్రమం తప్పకుండా ఇవ్వడంతో వారి బంగారు భవితకు బాటలు వేయవచ్చని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. 9వ పోషణ మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పోషమ మాసం సందర్భంగా మన అంగన్వాడీ మన బాధ్యత కింద ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పోషణ మాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, బాలామృతంతో సిద్ధం చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని కేంద్రాల సేవలు, వసతులు మెరుగుపరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ తదితర అంశాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు తప్పకుండా అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పోషకాహారం అందుతుందని ఆట, పాటలు, బొమ్మల ద్వారా విద్యబుద్ధులు చెపుతారని వివరించారు. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు తమ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీ చేయాలని సూచించారు.

#### తల్లులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గర్భిణీలు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకత పెట్టాలని తెలిపారు. 5 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడీ కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల నడవలేని వాళ్లు పుట్టుకతో వచ్చే లోపాల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్య, సరిగా మాట్లాడాలని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాలను గుర్తిస్తారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, సర్పంచ్ ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఎంపిడిఓ రమేశ్, వైద్య ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి

గొర్రెల కాపరుల ఆవేదన



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : మండలంలోని మూలసాల గ్రామంలో పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయిని సదయ్య, కాసు నరేష్‌లకు చెందిన గొర్రెలను అన్నయ్య కుంట చెరువు సమీపంలో మేపుతుండగా అకస్మాత్తుగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో మందలోని 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి.అకాలంగా సంభవించిన ఈ ఘటనతో గొర్రెల కాపరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ కళ్ల ముందే గొర్రెలు మృత్యువాత పడటం తో సదయ్య, నరేష్ కన్నీరుమున్నీరుగా విలపించారు.గొర్రెల పెంపకమే తమ జీవనాధారమని, ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో గొర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల మృతితో తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడిందని, ప్రభుత్వం స్పందించి నష్టపోయిన గొర్రెల కాపరులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. సంబంధిత అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతి చెందిన గొర్రెలను నమోదు చేసి,ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## దసరా వరకు ఆర్‌టిసి.. బస్సు డిపో ప్రారంభం

ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట



ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి ప్రజల చిరకాల వాంఛ పెద్దపల్లి బస్ డిపో దసరా వరకు ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.మంగళవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ. 8 కోట్లతో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆర్టీసీ డిపో పనులను ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ముందుగా పెద్దపల్లి, పట్టణ కేంద్రం లో వున్న వినాయక మండపాలను సందర్శించి గణనాథుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్దపల్లి బస్సు డిపోను రూ.8 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేత మంజూరు చేయించుకోవడం జరిగిందని,బస్సు డిపో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని,డిపో నిర్మాణ పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో జరుగుతున్నాయని,దసరా నాటికి దేవి నవరాత్రుల్లో బస్సు డిపో ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు.పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కౌన్సిలర్లు మరియు సింగిల్ విండో చైర్మన్ మరియు ఆర్టీసీ అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం



ప్రజాపక్షం/ధర్మపురి : భక్తి శ్రద్ధలతో ధర్మపురి పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.ధర్మపురి పట్టణంలోని గోదావరి నది,రాయపట్నం గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్,వివిధ శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు.భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.నిమజ్జన వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జగిత్యాల ఆర్డీఓ, మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి ,వైస్ చైర్మన్ ఐ.రాయమల్లు ,డిఎస్పీ పురుషోత్తం రెడ్డి,సీఐ నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రావు ,తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమంపై మండల స్థాయి సమీక్ష



ప్రజాపక్షం/రాయికల్ :రాయికల్ మండలంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు,ప్రభుత్వ పథకాల పురోగతిపై మండల ప్రత్యేక అధికారి, సీఈఓ గౌతమ్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఎలినినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు మండలంలోని ఒహెచ్ఎస్ఆర్‌లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని ఆదేశించారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనులను నిరంతరం చేపట్టాలని, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని వైద్యశాఖకు సూచించారు.అన్ని శాఖల అధికారులుసమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీఈఓ గౌతమ్‌రెడ్డి సూచించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/హుస్నాబాద్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రజలకు సూచించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో బస్తీ దావాఖానలో వైద్య సిబ్బంది ,మున్సిపల్ సిబ్బంది,ఆశవర్కర్లు, ఏఎన్ఎంలతో జిల్లా వైద్య అధికారి సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలతో డెంగ్యూ టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తగు సూచనలు చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణంలోని పరిశుభ్రతపాటిస్తూ దోమల సమస్య రాకుండ నీటి నిల్వలు చెత్తచెదారం లేకుండ మున్సిపల్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎక్కడ మురుగు నీటి బురద లేకుండ చూడాలని అలాగే ఎప్పటికప్పుడు బ్లీచింగ్, శానిటేషన్, స్పేయింగ్ ఫాగింగ్ ద్వారా ప్రత్యేక క్లీనింగ్ చేపట్టాలని కోరారు.

## పాత్రికేయునికి దక్కిన అరుదైన గౌరవం

జర్నలిస్ట్ చేకూర్తి నవీన్ పటేల్‌కూ

ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ ప్రాంత నివాసి జర్నలిస్టు చేకూర్తి నవీన్ పటేల్ కూ అరుదైన గౌరవం లభించింది. సామాజిక సేవలు చేస్తూ పాత్రికేయ రంగంలో చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి వారికి హైదరాబాద్ రవీంద్ర భారతి మెయిన్ అడిటోరియం లో ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. గత ఐదు సంవత్సరాల నుండి సామాజిక సే వలు చేస్తున్నందుకు పాత్రికేయ రంగంలో చేస్తున్న సేవలనూ గుర్తించి వా రికి ఈ అవార్డు అందజేశారు. జర్నలిస్ట్ చేకూర్తి నవీన్ పటేల్‌కూ ఈ అవార్డు రావడం పట్ల పలు జర్నలిస్టులు హార్షం వ్యక్తం చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. స్నేహితులు, మరిన్ని అవార్డులు పొందాలని బంధువులు ఆకాంక్షించారు.

## మెటీరియల్ కొరతతో కార్మికుల భద్రత పణంగా పెట్టొద్దు

### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరిక

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, వారికి అవసరమైన కీలక మెటీరియల్స్‌ను సకాలంలో అందించడంలో యాజమాన్యం విఫలమవుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని జీడీకే1 ఇంక్లైన్, జీడీకే2వ ఇంక్లైన్ జీడీకే 11వ ఇంక్లైన్ లలో జరిగిన వినతి పత్రాల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సపోర్ట్ మెన్‌కు అత్యవసరంగా అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రూఫ్ బోల్టింగ్‌కు అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్ కొరత ఏర్పడితే గని భద్రతా చర్యలపై ప్రత్యక్ష ప్రభావం పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. లైన్‌మెన్‌కు అవసరమైన కీళ్లు తదితర సామగ్రిని వెంటనే సరఫరా చేయాలని, ట్రాక్ లైన్ల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగితే టబ్బులు పట్టాలు తప్పడం, కిందపడటం వం టి ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికులకు జూన్, జూలై నెలల్లో అందాల్సి న సేఫ్టీ షూస్ సెప్టెంబర్ వచ్చినా ఇంకా అందకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని యాజమాన్యంపై మండిపడ్డారు. గ్లౌజెస్ నుంచి ఎస్‌డిఎల్ ఆయిల్ వరకు అన్నింటిలో కొరతేనా? అని ప్రశ్నించారు .కార్మికులకు అవసరమైన నాణ్యమైన గ్లౌజెస్, ఎస్‌డిఎల్ లకు అవసరమైన నాణ్యమైన ఆయిల్, గిరిమీట్లు తదితర మెటీరియల్స్‌ను,అలాగే నూతన రంగుతో కూడిన ఒకే రకం యూనిఫామ్‌ను అన్ని గనుల్లో వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. “ఉత్పత్తి లక్ష్యాలు గుర్తుంటే, కార్మికుల భద్రత ఎందుకు గుర్తుండదు? కార్మికుల నుంచి పని ఆశిస్తే పని చేయడానికి అవసరమైన మెటీరియల్స్ ఎందుకు ఇవ్వ రు?” అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ ఎఐ టియుసి సహించబోదని, ఆర్జీ1 ఏరియాలోని అ న్ని గనుల్లో కార్మికులకు అవసరమైన డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రెజిన్ క్యాప్సిల్స్, సేఫ్టీ షూస్, గ్లౌజెస్, ఎస్.డి.ఎల్ ఆయిల్, గిరిమీట్లు,ట్రాక్ మెటీరియల్స్,యూనిఫామ్ తదితర అవసరమైన సామగ్రిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఎఐటి యుసి ఆర్జీ1 బ్రాంచి ఆఫీస్ బేరర్స్ సంకె అశోక్, మాదన మహేష్, బోగ సతీష్ బాబు,ఎస్.వెంకట్ రెడ్డి,గండి ప్రసాద్,సుధాకర్,అన్ని గనుల పిట్ సెక్రటరీలు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, నాయకులు గొడిశెల నరేశ్,పి.రవి,సాన జలపతి,చంద తిరుపతి, సమ్మయ్య, మైన్స్,సేఫ్టీ కమిటీ సభ్యులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతులు ఉచిత న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్

ప్రజాపక్షం/కొత్తపల్లి : రైతులకుజిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని సంస్థ ద్వారా లభించే ఉచిత న్యాయ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి యశ్వంత్ సింగ్ పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాలమేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివ కుమార్ ఆదేశాల మేరకు కొత్తపల్లి మండల రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా న్యాయ సదస్సు నిర్వహించారు.ఆర్థికంగా వెనుకబడిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు కోర్టు ఖర్చులు భరించలేకపోతే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని, లీగల్ కౌన్సిలింగ్ అందించనున్నట్లు తెలిపారు. సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తక హక్కు, భూసేకరణ చట్టం ద్వారా తగిన నష్ట పరిహారం, పునరావాసం పొందే విధానాన్ని వివరించారు. కైలు రైతులకు సంక్షేమ పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా తక్కువ వడ్డీ రుణాలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షణ గురించి అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలను కాల్చి వాతావరణ కాలుష్యాన్ని పెంచవచ్చని కోరారు. భూ వివాదాలు, బ్యాంకు రుణాలు సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా టెలి లా యల్‌యస్‌యంయస్ పోర్టల్ డిజిటల్ సేవలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ.కిరణ్ కుమార్, సిహెచ్ చంద్రప్రకాశ్ రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మౌనిక, జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయ క్, రై తు సంఘం అధ్యక్షుడు, రైతులు పాల్గొన్నారు.



## పోక్సో కేసులో నిందితుడికి 3 సంవత్సరాల కారాగార శిక్ష

రూ.55వేలు జరిమానా

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తికి పోక్సో కేసులో 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడినదని సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ టి లక్ష్మి బాబు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం త్రీటౌన్‌లో నమోదైన క్రైం.నం.399/2020, సీ.న 0150 /2022 కేసులో సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెం దిన నిందితుడు బోయిని రాజు @ రజినీకాంత్(21) తండ్రిపేరు ముత్యం పై నేరాలకు గాను సిద్దిపేట1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జయ ప్రసాద్ గారు 22–09–2026 తీర్పు వెలువరించారని తెలిపారు. నిందితుడికి ఐపిసి354(డి) కింద 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా, ఐపిసి 506 కింద 1 సంవత్సరం సాధారణ కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా, పోక్సో ఆక్ట్ సెక్షన్ 11,12 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 25వేల జరిమానా కాగా మొత్తంగా రూ.55వేలు జరిమానా విధించారని అ న్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆ త్మారాములు దర్యాప్తు/కేసు పురోగతిలో ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది స్రవంతి సమన్వయంతో నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టారని తెలిపారు.

## ‘ఆల్ఫోర్స్ ఇటెక్నో’లో గణనాథునికి 108 రకాల ప్రసాదాలు



ప్రజాపక్షం/కొత్తపల్లి : గణనాథుడు అంటే సకల బాధల నుంచి విముక్తి కల్పించేవాడని విఘ్నాలను తొలగించి చక్కని విద్యను అందించేవాడని ఉజ్వలమైన భవిష్యత్ ప్రసాదించే గణనాథుడని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. భగత్‌నగర్‌లోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో శ్రీ విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని చివరి రోజులో భాగంగా మహా గణపతికి సుమారు 108 రకాల ప్రసాదాలతో మహా ప్రసాదం సమర్పించారు. నవ రాత్రి ఉత్సావాలు భక్తుల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గణనాధునికి పూజలు నిర్వహించడం పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. వినాయకునికి ఇష్టమైన ఉండ్రాళ్లు, మోదకాలు, గారెలు, పులిహోర, సిర, పెరుగన్నం, పొంగలి, తదితర ప్రసాదాలు సమర్పించారు.

## ‘టిబి ముక్త్ భారత్’ లక్ష్య సాధనకు కృషి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు ,టిబి బాధితుల గుర్తిం పు,నిర్ధారణ,చికిత్స,పోషకాహార సహాయం, అవగాహన కార్యక్రమాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో టిబి లక్షణాలు ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అందిస్తున్న చికిత్సను సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు.టిబి బాధితులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం కొనసాగించేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టిబి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు మరియు చికిత్సపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి అనుమానిత కేసులను గుర్తించాలని సూచించారు.



## భారీ పెట్టుబడి మోసం కేసు ఛేదించిన పోలీసులు

### ప్రధాన నిందితుడు సహా ముగ్గురు అరెస్ట్

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లో భారీ స్థాయిలో జరిగిన పెట్టుబడి మోసం కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించారు. శ్రేయ ఇన్ ఫ్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్వహించిన పెట్టుబడి పథకాల ద్వారా ప్రజలను ఆకర్షించి కోట్లాది రూపాయలు సేకరించి మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ రాయ్తో పాటు రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను పోలీసులు అరెస్ట్ చేశారు. 2020లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో స్థాపించిన ఈ సంస్థ ద్వారా వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టి తక్కువ కాలంలో పెట్టుబడులకు రెండింతలు, మూడింతలు లాభాలు వస్తాయని నమ్మబలికినట్లు విచారణలో వెల్లడైంది.ఈ వ్యవహా రంపై బాధితుడు గుగులోత్ శివరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, సీపీ ఆదేశాల మేరకు కేసును సిసిఎస్ పోలీసులకు బదిలీ చేశారు. సిసిఎస్ కరీంనగర్ ఇన్స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి, ఈ నెల 18న రాత్రి లక్నోలోని నిందితుల నివాసంలో హేమంత్ కుమార్ రాయ్, రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను అదుపులోకి తీసుకుంది. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్, ఎస్ఐ డి. మహిపాల్ రెడ్డి, బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కరీంనగర్ సిసిఎస్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.




## క్రీడల్లో గెలువు.. ఓటమిలు సహజం

### ట్రైనీ కలెక్టర్ భవ్య

ప్రజాపక్షం/ సిద్దిపేట : క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని, ఓటమిని క్రీడా స్ఫూర్తిగా తీసుకోవాలని సిద్దిపేట జిల్లా ట్రైనీ కలెక్టర్ భవ్య అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో 70వ జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ ను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.క్రమశిక్షణ పాటిస్తే క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని, క్రీడాకారులను తీర్చిదిద్దడంలో పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. 25 మండలాల నుండి సుమారు 1300 మంది క్రీడాకారులు పాల్గొని పోటీపడుతున్నారన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి జోనల్ టోర్నమెంట్ కు పంపిస్తామని జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నర్రా భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, పంచాయతీరాజ్ శాఖ అధికారి రవీందర్, డీవైఎస్‌ఓ వీరారెడ్డి, సిద్దిపేట జిల్లా జూనియర్ కళాశాలల సెక్రటరీ సమ్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు ఏర్వ అశోక్, తోట సతీష్ కుమార్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్‌కార్యదర్శి జంగపల్లి వెంకట నర్సయ్య, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ రవీందర్ రెడ్డి , సీనియర్ పీడీ , పీఈటీలు పాతూరి సుజాత, బిక్షపతి, రామేశ్వర్ రెడ్డి, సౌందర్య, రాజమౌళి, శ్రీనివాస్, వెంకటస్వామి, దేవరాజ్, కరణ్, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం

- దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న అనంత్‌నాగ్
- యామీ గౌతమ్, మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్‌లు ఉత్తమ నటులుగా ఎంపిక
- అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**ఏక్తానగర్ :** భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. దశాబ్దాలుగా దేశ రాజధాని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ వేదికగా ఈ వేడుకను నిర్వహిస్తుండగా, ఈసారి మాత్రం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం గుజరాత్‌లోని కెవాడియాలో ఏర్పాటు చేశారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తితో తొలిసారిగా ఢిల్లీ వెలుపల నిర్వహించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విజేతలకు పురస్కారాలు అందించారు. 2024లో విడుదలైన సినిమాలు, నాన్ ఫీచర్ ఫిలిమ్స్‌కు సంబంధించి పలు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ అవార్డులతో సత్కరించారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకోగా, యామీ గౌతమ్, మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్‌లు ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు. ఆదిత్య సుహాస్ జంభలే దర్శకత్వం వహించిన హిందీ చలనచిత్రం 'ఆర్టికల్ 370' ఉత్తమ చలనచిత్ర పురస్కారాన్ని అందుకుంది. నటుడిగా కెరీర్ ప్రారంభించి, దర్శకుడిగా మారిన రణదీప్ హూడా 'స్వతంత్ర వీర్ సావర్కర్' చిత్రానికి గాను ఉత్తమ తొలి దర్శకుడి పురస్కారాన్ని అందుకోగా, తమిళ చిత్రం 'అమరన్'కు గాను రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకత్వ పురస్కారాన్ని అందుకున్నారు. 'ఆర్టికల్ 370' చిత్రానికి గాను యామీ గౌతమ్ ఉత్తమ ప్రధాన నటి పురస్కారాన్ని అందుకున్నారు. అదే సమయంలో, 'బ్రహ్మయుగం' 'చందు ఛాంపియన్' చిత్రాలకు గాను మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ వరుసగా ఉత్తమ ప్రధాన నటుడు పురస్కారాన్ని పంచుకున్నారు. సుమీరా రాయ్ దర్శకత్వం, నిర్మాణంలో రూపొందిన 'భంగార్' ఉత్తమ నాన్‌ఫీచర్ ఫిల్మ్ పురస్కారాన్ని అందుకుంది, దీనిని రాయ్ స్వీకరించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా సంజీవ్ శ్రీవాస్తవ హిందీలో ఉత్తమ చిత్ర విమర్శకుడి పురస్కారాన్ని అందుకున్నారు. తమిళ చిత్రం 'మహారాజా'కు గాను సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటి పురస్కారాన్ని అందుకోగా, కన్నడ చిత్రం 'మిథ్యా'కు గాను రోపశ్రీ వర్కడి రెండవ ఉత్తమ సహాయ నటి పురస్కారాన్ని అందుకున్నారు. అభిషేక్ జైన్ దర్శకత్వం వహించిన 'మారన్' ఉత్తమ గుజరాతీ చిత్రం పురస్కారాన్ని అందుకుంది. తెలుగు చిత్రం 'పుష్ప: ది రూల్ పార్ట్02' ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ పురస్కారాన్ని అందుకోగా, అదే చిత్రానికి గాను బంద్రెడ్డి సుకుమార్ ఉత్తమ స్క్రీన్ ప్లే పురస్కారాన్ని అందుకున్నారు. తమిళ చిత్రం 'అమరన్'కు గాను ఆర్. కలైవన్నన్ ఉత్తమ ఎడిటింగ్ అవార్డును అందుకున్నారు. 'మైదాన్' చిత్రంలోని 'జానే దో' పాటకు గాను మనోజ్ ముంతాషిర్ ఉత్తమ గీత రచయిత అవార్డును అందుకున్నారు. 'భక్షక్' చిత్రానికి గాను బాలీవుడ్ నటుడు సంజయ్ మిశ్రా ఉత్తమ సహాయ నటుడు అవార్డును అందుకున్నారు. మరాఠీ చిత్రం 'ఘరత్ గణపతి'లోని 'నవసాచి గౌరీ మాజీ' పాటకు అభయ్ జోధ్‌పుర్కర్ ఉత్తమ పురుష నేపథ్య గాయకుడి అవార్డును అందుకోగా, మలయాళ చిత్రం 'ఎఆర్ఎం'లోని 'అంగువాన కోనిలు' పాటకు వైకోమ్ విజయలక్ష్మి ఉత్తమ మహిళా నేపథ్య గాయని అవార్డును అందుకున్నారు. 'ఆర్టికల్ 370'లోని పాటలకు శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకత్వ అవార్డును అందుకోగా, 'అమరన్' చిత్ర నేపథ్య సంగీతానికి జి.వి. ప్రకాష్ కుమార్ గౌరవించబడ్డారు. 'స్త్రీ 2'లోని 'ఆజ్ కీ రాత్' పాటకు విజయ్ గంగూలీ ఉత్తమ నృత్య దర్శకత్వ అవార్డును అందుకున్నారు.

## అయోధ్య రామమందిరం నుంచి...
# 105 సార్లు అనధికారికంగా కరెన్సీ తరలింపు

'ఉత్తర్వు'లో పేర్కొన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాల చోరీపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం.(సిట్) ఆలయ లెక్కింపు గది నుంచి నగదును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టడానికి సంబంధించిన 105 ఘటనలను గుర్తించిందని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను పరిశీలించింది. అయితే 200 కిలోల వెండి ఇటుకలు, 38.288 కిలోల వెండి ఇటుకలు, ఒక వెండి నెక్లెస్, చరణ్ పాదుక, రామచరిత మానస్‌కు సంబంధించిన 'విరాళం' నిర్వహణలో ఎటువంటి వ్యత్యాసాలు లేవని ఆ నివేదిక కనుగొంది. సెప్టెంబరు 25న లేదా అంతకంటే ముందుగా ప్రత్యేక దర్యాప్తు బృందం తన మొదటి ఛార్జిషీట్‌ను దాఖలు చేస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం ధర్మాసనానికి తెలియజేశారు. ఉత్తరప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం, విలువైన విరాళాలకు సంబంధించి మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలను ధృవీకరించినట్లు పేర్కొంది. 'ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రం (పిఎఫ్‌సి)లోని లెక్కింపు గదిలో ఉన్న సిసిటివి ఫుటేజ్, ఇతర డిజిటల్ డేటా, 'లెక్కింపు' ప్రక్రియలో పాల్గొన్న ఇతర వ్యక్తుల సహాయంతో, కౌంటింగ్ రూమ్ నుంచి అనధికారికంగా కరెన్సీని తీసివేయడం లేదా దాచిపెట్టిన 105 ఘటనలను వెల్లడించాయి' అని ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక వెల్లడించింది. 8మంది నిందితులను గుర్తించినట్లు, వారి ఖాతాలలో వివరించలేని డిపాజిట్ల పట్టిక సారాంశాన్ని, అలాగే దొంగిలించిన డబ్బును, పెట్టుబడి పెట్టిన స్థిరాస్తులు, చరాస్తుల గురించిన సమాచారాన్ని అందించినట్లు నివేదిక పేర్కొంది. 'ప్రతీ నిందితుడు చోరీ చేసినట్లు అంచనా వేయబడిన మొత్తాన్ని స్టేటస్ రిపోర్ట్ మరింత నొక్కిచెబుతోందని, అలాగే, కరెన్సీని లెక్కించే, నిర్వహించే ప్రక్రియ సమయంలోనే కౌంటింగ్ రూమ్‌లో అనుమానిత కరెన్సీ చోరీ జరిగిందని, ప్రస్తుతం ఉన్నటువంటి సాక్ష్యాలు సూచిస్తున్నాయని కూడా ఈ నివేదిక పేర్కొంటోందని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. దుర్వినియోగం జరిగినట్లు అనుమానిస్తున్న చర్యలను గుర్తించడం, ఇందులో ప్రమేయం ఉన్న ఆ వ్యక్తులను పరీక్షించడం, వాటి ద్వారా వచ్చినట్లు అనుమానిస్తున్న సొమ్మును గుర్తించడం, ఆర్థిక, ఆస్తి విచారణ, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను పరిశీలించడం, విలువైన వస్తువులను ధృవీకరించడం, సంబంధిత విరాళాలు, బ్యాంకింగ్ రికార్డులను సరిపోల్చడం వంటి పలు అంశాలపై దర్యాప్తు ఏకకాలంలో కొనసాగిందని ఆ నివేదిక తెలిపింది. విలువైన వస్తువులకు సంబంధించిన రికార్డులు, సామాగ్రిని పరిశీలించామని, ధృవీకరణలో ఎలాంటి వ్యత్యాసాలు కనుగొనలేదని సెప్టెంబరు 16నాటి ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక వెల్లడించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో ఉంచిన 803 వస్తువులను భౌతికంగా తనిఖీ చేయగా, వాటి విషయంలో ఎలాంటి వ్యత్యాసాలను కనుగొనబడలేదని నివేదిక తెలిపింది. టిసిఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా 803 విలువైన వస్తువులకు సంబంధించి జారీ చేసిన రసీదులను ధృవీకరించగా, వాటికి సంబంధించిన రికార్డులు ట్రస్ట్ వద్ద ఉన్నట్లు నివేదిక వెల్లడిస్తోంది. ఈ వస్తువులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరచబడ్డాయి. దానిని భౌతికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ 803 వస్తువులకు సంబంధించి ధృవీకరణ సమయంలో ఎలాంటి వ్యత్యాసాలు కనుగొనబడలేదు' అని ఉత్తర్వులో పేర్కొన్నారు. రసీదు జారీచేయని మరో 86విలువైన వస్తువులను విడిగాగుర్తించి, భౌతికంగా ధృవీకరించినట్లు నివేదిక తెలిపింది. కరిగించడం కోసం ట్రస్ట్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు పంపిన సుమారు 944.411 కిలోల వెండికి సంబంధించిన రికార్డులను కూడా 'సిట్' పరిశీలించింది. సెప్టెంబరు 14నాటికి 173మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు అది తెలియజేసింది. పరీక్షించిన వారిలో ట్రస్ట్ కార్యకర్తలు, అకౌంటింగ్ సిబ్బంది, బ్యాంక్ అధికారులు, భద్రతా సిబ్బంది, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు. విరాళాల దొంగతనం ఆరోపణలపై నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అంతకుముందు శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు కూడా నోటీస్ జారీ చేసింది. రామ మందిరంలో విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత, ఆర్‌జెడి ఎంపి సుధాకర్‌సింగ్‌తో సహా పలువురు పిటిషనర్లు ఆలయ ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై సిబిఐ దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# సరి కొత్త రికార్డు

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నివరధిక వాయిదాపై ఉత్కంఠ
- ఉభయసభలు వాయిదా పడి 40 రోజులు దాటినా అధికారికంగా ముగియకపోవడంపై కొనసాగుతున్న ఊహాగానాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నివరధిక వాయిదాపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఉభయలు సభలు వాయిదా పడి 40 రోజుల దాటినా కూడా సమావేశాలు ఇంకా అధికారికంగా ముగియకపోవడం గమనార్హం. ఈ చర్యతో కొత్త సమావేశాలు నిర్వహించకుండానే ప్రభుత్వం ఒక కీలక చట్టాన్ని తీసుకురావాలని చూస్తోందనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఉభయ సభలు 40 రోజుల పాటు వాయిదా పడకుండా ఉండటం ఒక కొత్త రికార్డు అని మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ పి.డి.టి. ఆచారి పిటిఐకి తెలిపారు. 2015లో, పార్లమెంట్ ఉభయ సభలను 28 రోజుల తర్వాత వాయిదా వేశారని ఆయన గుర్తుచేశారు. అప్పుడు ప్రభుత్వం జిఎస్‌టి చట్టంపై ఏకాభిప్రాయం సాధించడానికి ప్రయత్నించిందని ఆయన పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలులోకి తీసుకురావడానికి ప్రభుత్వం మళ్లీ ఒక సవరణను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల సమయంలో చేసిన గత ప్రయత్నం తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో విఫలమైన విషయం తెలిసిందే. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన వల్ల లోక్‌సభ ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనతో ఉన్న, ముఖ్యంగా దక్షిణాది ప్రతిపక్ష పార్టీల నుంచి వస్తున్న ఆందోళనలను తగ్గించడానికి, ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఏకరీతిగా 50 శాతం సీట్ల విస్తరణను ప్రతిపాదిస్తోంది. లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. సాధారణంగా తదుపరి మూడు, నాలుగు రోజుల్లో సమావేశాలు అధికారికంగా ముగుస్తాయి. కానీ ఈసారి, కడపటి వార్త అందే నాటికి కూడా వాయిదా నోటిఫికేషన్ జారీ కాలేదు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగిసి, ఏప్రిల్ 20న వాయిదా పడ్డాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి సమావేశాలను నిర్వహిస్తారు, వాయిదా వేస్తారు. శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబర్ చివరి వారంలో ప్రారంభమై క్రిస్మస్ పండుగకు ముందే ముగుస్తాయి.

## రామాలయ విరాళాల చోరీ కేసులో..
# ఛార్జ్‌షీట్ దాఖలుపై జాప్యమేల?

- బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం
- రాముడి పేరును అప్రతిష్టపాలు చేయొద్దని వ్యంగ్రాస్త్రాలు




**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంలో జాప్యంపై కాంగ్రెస్ ప్రశ్నించింది. అలాగే, 1971 నాటి బాలీవుడ్ పాట 'రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో' (రాముడి పేరును అప్రతిష్టపాలు చేయకండి)లోని సాహిత్యాన్ని ప్రస్తావిస్తూ బిజెపిపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఈ కేసులో పెద్ద చేపలను (ప్రధాన నిందితులను) కాపాడేందుకు ప్రయత్నం జరుగుతోందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. మొత్తం వ్యవస్థపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంలో దర్యాప్తు పూర్తి పారదర్శకంగా సాగేలా చూడాలని కాంగ్రెస్ తన డిమాండ్లను పునరుద్ఘాటించింది. అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగుచూశాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ షేర్ చేశారు. ఆలయ ప్రాంగణంలోని సిసిటివి ఫుటేజీని ఫోరెన్సిక్ పరిశీలన చేయగా 105 చోరీ ఘటనలు బయటపడ్డాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించినట్లు ఆ నివేదిక తెలిపింది. కాగా, ప్రాథమిక దర్యాప్తులో గతంలో 70 ఘటనలు మాత్రమే నమోదయ్యాయి. 'చందా చోరీ, ఆస్థా ధోకా (విరాళాల చోరీ, విశ్వాసానికి ద్రోహం). 'దేఖో ఓ బిజెపి వాలోం, తుమ్ యే కామ్ నా కరో, రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో...''1971లో వచ్చిన దేవ్ ఆనంద్ చిత్రం 'హరే రామ హరే కృష్ణ'లోని 'దేఖో ఓ దీవానోం తుమ్ యే కామ్ నా కరో, రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో' అనే పాటలోని సాహిత్యాన్ని రమేశ్ ఈ సందర్భంగా సామాజిక మామధ్యమంలో ప్రస్తావించారు. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు మొదలై మూడు నెలలు పూర్తయ్యేందుకు కేవలం మూడు రోజులే మిగిలి ఉన్నప్పటికీ, ఇప్పటికీ నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడం సిగ్గుచేటని రమేష్ వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 25 నాటికి ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోతే, దేశంలోనే అత్యంత 'సిగ్గుచేటైన విరాళాల చోరీ కేసు'లో చిన్న స్థాయి నిందితులు బెయిల్ పొందేందుకు మార్గం సుగమమవుతుందని ఆయన పేర్కొన్నారు. 'ప్రభావశీల వ్యక్తులను (పెద్ద చేపలను) కాపాడే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానం ఉన్నప్పుడు, అటువంటి సిట్ లేదా ప్రభుత్వ ఛార్జ్‌షీట్‌పై దేశ ప్రజలకు ఏ మాత్రం నమ్మకం ఉండదని మనం స్పష్టం చేయాలి. గతంలో ఇందులో ప్రస్తావించాల్సిన విషయం ఏమీ లేదని చెప్పినవారే, ఇప్పుడు తమ సొంత విచారణలో విరాళాల చోరీ ఘటనలు కేవలం సిసిటివిలోనే 70 సార్లు కాదు, 105 సార్లు నమోదయ్యాయని అంగీకరిస్తున్నారు, దీనిని వారు ఎంత ప్రయత్నించినా కాదనలేరు అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అర్థం చేసుకోవడం కష్టం కాదని రమేశ్ అన్నారు.

**అసలు దొంగలు, వారికి అండగా నిలిచిన వారి నుండి ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ వ్యవహారం వెనుక ఉన్న ఉద్దేశమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు.**

'అయోధ్యలోని శ్రీరామ మందిరంలో జరిగిన ప్రణాళికాబద్ధమైన విరాళాల చోరీకి సూత్రధారులుగా ఉన్నవారిని ఎవరు, ఎందుకు కాపాడుతున్నారు అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది' అని రమేష్ అన్నారు. ఈ తీవ్రమైన కేసులో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం 'విరాళాల చోరీ' నిందితులకు ఆయన అందిస్తున్న సహాయం గురించి తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అసలైన దోషులను కాపాడటానికి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగకుండా ఎవరు, ఎందుకు అడ్డుపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ట్రస్ట్‌ను ఇంకా ఎందుకు రద్దు చేయలేదని కూడా రమేశ్ నిలదీశారు. సిట్ ముసుగులో, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉన్న విరాళాల చోరీ కేసులోని నిందితులను కాపాడేందుకు బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తాము భావిస్తున్నామన్నారు. ఇప్పుడు ప్రశ్న కేవలం నిందితుల గురించే కాదు, ఈ ఘటనలన్నీ ఎవరి పర్యవేక్షణలో జరిగాయో వారి బాధ్యత గురించి కూడా అని ఆయన అన్నారు.

# మహిళలపై మరింత హింసాత్మక దాడులు

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆందోళన



**వయనాడ్ :** భారత్‌లో ప్రధాని మోదీ సర్కార్ హయాంలో మహిళలపై భయంకరమైన దాడులు రోజు రోజుకు పెరుగుతుండడమే కాకుండా అవి మరింత హింసాత్మకంగా మారుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఢిల్లీ, బిహార్‌లలో మహిళలపై ఇటీవల జరుగుతున్న లైంగిక దాడుల పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహిళలు వీధుల్లో సురక్షితంగా తిరిగేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మహిళలపై జరుగుతున్న నేరాలను భయంకరమైనవిగా అభివర్ణించిన వాద్రా, మహిళలకు పరిస్థితులు ఎప్పుడూ అసురక్షితంగానే ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మరింత తీవ్రమవుతోందన్నారు. 'ఇది చాలా భయంకరమైన విషయం. మహిళలపై నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. మహిళలకు భద్రత ఎప్పుడూ లోపించే ఉంది, పైగా వారిపై దాడులు మరింత హింసాత్మకంగా మారుతున్నాయి. వీధుల్లో మహిళల భద్రతను కల్పించలేనప్పుడు, గొప్ప పథకాలు, కార్యక్రమాల గురించి మాట్లాడటంలో అర్థం లేదని భావిస్తున్నాను అని ప్రియాంక మంగళవారం కేరళంలోని ఆమె పార్లమెంట్ నియోజకవర్గమైన వయనాడ్‌లో విలేకరులతో అన్నారు. గత కొన్ని వారాలుగా దేశ రాజధానిలో మైనర్ బాలికలపై వరుస లైంగిక దాడులు జరుగుతుండడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. 'సెప్టెంబర్ 10న స్వరూప్ నగర్‌లో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు; 16న స్టేషనరీ వస్తువులు కొనడానికి వెళ్లిన ఒక మైనర్ బాలికపై సదర్ బజార్‌లోని ఒక దుకాణంలో లైంగిక దాడి జరిగింది; అలాగే 21న రాజధానిలో వేర్వేరు ఘటనల్లో ఆరేళ్ల బాలిక 17 ఏళ్ల యువతిపై లైంగిక దాడులు జరిగాయి. వీటితో పాటు, బిహార్‌లోని జముయి ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళ్తున్న ఒక బాలిక, బాలుడిని కొందరు వ్యక్తులు రోడ్డు పక్కన వేధించారు' అని కొన్ని రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్న కాంగ్రెస్ ఎంపి, మహిళల భద్రత అనే అంశంపై ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం, మహిళలకు భద్రత కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనే దానిపై ఆలోచించాలని చెప్పారు. వయనాడ్ పర్యటనలో తన ప్రణాళికల గురించి మాట్లాడుతూ ఇది సుదీర్ఘ పర్యటన అని, వీలైనంత ఎక్కువ మందిని కలిసి వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా తగిన చర్యలు తీసుకోగలనని ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపి తెలిపారు.

## బహిరంగ ప్రకటనలు చేసే ముందు
# సిపిఐ వందేళ్ల చరిత్ర తెలుసుకోవాలి

అవినీతిపై తమిళమంత్రి ఆధవ్ అర్జున వ్యాఖ్యలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ మండిపాటు

**చెన్నై :** అవినీతిపై తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలను ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి ఎం. వీరపాండియన్ మంగళవారం తీవ్రంగా తప్పుబట్టారు. బహిరంగ ప్రకటనలు చేసే ముందు కమ్యూనిస్టు పార్టీకి ఉన్న వందేళ్ల చరిత్రను అధ్యయనం చేయాలని మంత్రికి సూచించారు. తన పార్టీకి ఉన్న స్వచ్ఛమైన చరిత్రను ప్రస్తావిస్తూ, గత 100 ఏళ్లలో భారత దేశంలో ఏ కమ్యూనిస్టు నాయకుడూ అవినీతి ఆరోపణలపై కోర్టులో దోషిగా తేలలేదని లేదా పోలీసు స్టేషన్‌లో అవినీతి కేసును ఎదుర్కోలేదని వీరపాండియన్ పేర్కొన్నారు. అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనున్న మధురాంతకంలో విలేకరులతో మాట్లాడిన వీరపాండియన్, పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ... ప్రస్తుత ప్రభుత్వానికి సిపిఐ మద్దతు ఇవ్వడం అనేది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ప్రజాస్వామ్య నిర్ణయమని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం పార్టీకి లేదని, తాము సామాన్య ప్రజల పక్షాన నిలబడతామని ఆయన అన్నారు. అదే సమయంలో, ప్రభుత్వం తన సూత్రాల నుండి పక్కదారి పడితే గళమెత్తడమో లేదా నిరసనలు తెలపడమో చేస్తామని స్పష్టం చేశారు. 'సమాజం అత్యంత గౌరవంగా భావించే బైబిల్, పురాణాల వంటి చారిత్రక, మతపరమైన, సాహిత్య గ్రంథాలలో కూడా ఇటువంటి స్వచ్ఛమైన చరిత్ర అరుదుగానో లేదా అసలు లేకపోవడమో జరుగుతుంది అని సిపిఐ నైతిక విలువలను ప్రస్తావిస్తూ వీరపాండియన్ వ్యాఖ్యానించారు. గత డిఎంకె పాలనలో జరిగిన అవినీతిపై వామపక్ష పార్టీలు మాట్లాడాలని ప్రజా పనులు, క్రీడల శాఖ మంత్రి కోరిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత డివికె ప్రభుత్వంతో పార్టీ సంబంధం గురించి మాట్లాడుతూ, బయటి నుండి మద్దతు ఇవ్వాలనే నిర్ణయం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, రాష్ట్రంలో గవర్నర్ పాలనను నివారించడానికి ప్రజాస్వామ్యబద్ధంగా తీసుకున్నామని వీరపాండియన్ స్పష్టం చేశారు. రాజకీయ అస్థిరతపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. ప్రభుత్వాన్ని కూల్చివేసే ఉద్దేశం వామపక్ష పార్టీలకు లేదన్నారు. 'మా ప్రాథమిక నిబద్ధత పేదలు, సామాన్య ప్రజల పట్ల మాత్రమే ఉంటుంది, ఏ ప్రభుత్వం పట్ల కాదు' అని వీరపాండియన్ అన్నారు. ప్రభుత్వం తన సూత్రాల నుండి పక్కదారి పడినా లేదా సంక్షోభాన్ని సృష్టించినా గళమెత్తడానికి లేదా నిరసనలు తెలపడానికి పార్టీ వెనుకాడదని ఆయన చెప్పారు.

## జముయిలో బాలికపై వేధింపుల ఘటన..
# ఎన్‌కౌంటర్‌లో నిందితులకు గాయాలు

**పాట్నా :** బిహార్‌లోని జముయిలో బాలిక, బాలిడిపై కొందరు దుండగులు వేధింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వారిద్దరూ గాయపడ్డారని ఒక అధికారి తెలిపారు. దీంతో, సెప్టెంబర్ 19 నాటి ఈ ఘటనకు సంబంధించి అదుపులోకి తీసుకున్న వారి మొత్తం సంఖ్య ఐదుకు చేరింది. ముంగేర్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) రాకేష్ కుమార్ మాట్లాడుతూ, నిందితులలో ఒకరైన నందన్ యాదవ్ కాలికి బుల్లెట్ గాయం తగిలిందని తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి సోమవారం నుంచే పోలీసులు దాడులు నిర్వహిస్తుండగా, తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించిన మరో నిందితుడు హరిరామ్ యాదవ్ మోకాలి ఎముక విరిగిందని ఆయన చెప్పారు. 'నందన్, హరిరామ్ ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. అంతకుముందు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నాము; వారి విషయంలో జువెనైల్ జస్టిస్ బోర్డు చర్యలు తీసుకుంటుంది' అని జముయిలో ఉన్న డిఐజి ఫోన్ ద్వారా పిటిఐకి తెలిపారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుండి ఆయన అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 'హరిరామ్, నందన్ కోలుకున్న తర్వాత వారిని విచారించి, మరికొందరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. వీడియో క్లిప్ ఆధారంగా చూస్తే, ఈ ఘటనలో కచ్చితంగా ఎంతమంది పాల్గొన్నారనేది స్పష్టంగా తెలియలేదు. అయితే, ప్రధాన నిందితులు పట్టుబడ్డారని మనం కచ్చితంగా చెప్పవచ్చు. వాస్తవానికి, ఆ వీడియో క్లిప్‌లో ముఖానికి స్కార్ఫ్ చుట్టుకుని గుంపుకు నాయకత్వం వహిస్తున్నట్లు కనిపించింది హరిరామే' అని ఆయన అన్నారు. ఒకే కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్నట్లు చెబుతున్న ఆ బాలిక, బాలుడిని ఒక గ్రూపు దారిలో అడ్డగించి వేధించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌లలో, ఆ బాలికను అసభ్యంగా తాకడం కనిపించింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనప్పటికీ, నిందితులలో ఒకరు తీసినట్లు భావిస్తున్న వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సోమవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

# రైతులపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ప్రయోగం

- తక్షణమే ధాన్యం సేకరించాలని పంజాబ్‌లో రోడ్డెక్కిన అన్నదాతలు
- షాహాబాద్‌లో పరిస్థితి ఉద్రిక్తం: పోలీసుల అదుపులో రైతులు



**షాహాబాద్ :** ధాన్యం సేకరణపై పంజాబ్‌లో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలలో సేకరణను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం షాహాబాద్ వద్ద ఢిల్లీ–చండీగఢ్ జిటి రోడ్డును దిగ్బంధించారు. భారతీయ కిసాన్ యూనియన్ (చారుని)కు చెందిన నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ఉపయోగించారు. పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బికెయు (చారుని) అధ్యక్షుడు గుర్నామ్ సింగ్ చారుని ఆరోపించారు. సాధారణంగా రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ అక్టోబర్ 1న ప్రారంభమవుతుంది. అయితే, గత సంవత్సరం సేకరణ సెప్టెంబర్ 22న మొదలైంది. కాగా ఈ ఏడాది కూడా తక్షణమే చేపట్టాలని జిటి రోడ్డుకు సమీపంలో ఉన్న షహీద్ ఉధమ్ సింగ్ మెమోరియల్ వద్ద ఉదయం నుంచి వందలాది మంది రైతులు సమావేశమయ్యారు. బికెయు (చారుని) నాయకుడు గుర్నామ్ సింగ్ చారుని, కురుక్షేత్ర డిప్యూటీ కమిషనర్ విశ్రామ్ కుమార్ మీనాల మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం జరిగింది. అయితే, చర్చలు విఫలమవడంతో నిరసనకారులు జిటి రోడ్డు వైపు దూసుకెళ్లారని బికెయు (చారుని) నాయకులు పేర్కొన్నారు. నిరసనకారులు హైవేకి చేరుకోకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు, కానీ వారు వాటిని ఛేదించుకుని జిటి రోడ్డులోకి ప్రవేశించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు మొదట వాటర్ కెనాన్లను ఉపయోగించారు. రైతులు అక్కడినుంచి కదలడానికి నిరాకరించడంతో, టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. రైతులు తమ నిరసనను కొనసాగించడంతో షాహాబాద్‌లో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. వెంటనే ధాన్యం సేకరణను ప్రారంభించాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి44పై సాధారణ ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు పోలీసులు తర్వాత తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి వరి సేకరణను ప్రారంభించాలని రైతులు ఇంతకు ముందు హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

# తమిళనాడులో 'అల్పాహారం' విస్తరణ

ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సిఎం విజయ్



**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మంగళవారం పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం విస్తరించారు. తిరువన్మియూర్‌లోని గాంధీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో విజయ్ ఈ పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం, ఆయన తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. దీనివల్ల 15,454 ప్రభుత్వ, ప్రభుత్వసహాయక పాఠశాలల్లోని 6 నుండి 8వ తరగతి వరకు చదువుతున్న సుమారు 15.30 లక్షల మంది అదనపు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కె. కామరాజ్ గౌరవార్థం 'పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకం'గా పిలువబడే ఈ పథకం విస్తరణ, 6 నుండి 8వ తరగతి విద్యార్థులను కవర్ చేస్తుంది. ఇది విద్యార్థుల పోషకాహార విషయంలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తూ, వారు ఆరోగ్యకరమైన రీతిలో తమ రోజును ప్రారంభించేలా చేస్తుంది. ఈ విస్తరణకు మద్దతుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ. 217.63 కోట్లు కేటాయించారు. దీంతో ఈ కార్యక్రమానికి మొత్తం బడ్జెట్ రూ. 724 కోట్లకు చేరింది. వాస్తవానికి ఈ పథకాన్ని ఈ నెల 17న ప్రారంభించాలని అనుకున్నప్పటికీ, పెట్టుబడుల సేకరణ కోసం విజయ్ లండన్‌కు వెళ్లాల్సి రావడంతో దీనిని వాయిదా వేశారు. మధురాంతకం, ధరాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, చెంగల్‌పట్టు, తిరుప్పూర్ జిల్లాల్లో ఈ పథకం అమలు కాదు.

# నేటి నుంచి జనరల్ అసెంబ్లీ కీలక సమావేశాలు

- యుద్ధం, అదుపుతప్పిన ఎఐ, ఎల్‌నినో ఎజెండా
- నాలుగు ఖండాల నాయకులతో చర్చలకు ట్రంప్ సమాయత్తం
- హోర్ముజ్ అడ్డంకులు తొలగించేందుకు ఫ్రాన్స్ తీర్మాన యత్నం
- జిన్‌పింగ్, పుతిన్, మోదీ గైర్హాజరు



**న్యూయార్క్:** న్యూయార్క్‌లో ప్రపంచ దేశాల నాయకుల సందడి ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ వార్షిక సమావేశాలలో సెప్టెంబరు 23 నుండి వారం రోజులపాటు కీలక దేశాల నాయకులు ప్రధాన ప్రసంగాలు చేయడానికి రంగం సిద్ధం కావడంతో ప్రపంచ మీడియా దృష్టి అటువైపే మళ్ళింది.పశ్చిమాసియా, యూరప్‌లో యుద్ధాలు,అదుపు తప్పిన కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న భయాలు,వాతావరణ మార్పులు, ఎల్‌నినో, ఉగ్రవాదం, ఐక్యరాజ్యసమితి భవిష్యత్తు, సంస్కరణలు వంటి వన్నీ ప్రధాన ఎజెండాగా ఈ సమావేశాల్లో వాడీ వేడీగా చర్చలు సాగనున్నాయి.అదేవిధంగా హోర్ముజ్ జలసంధిని తెరపించేందుకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు వీలుగా భద్రతామండలి తీర్మానం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఒక ముసాయిదాను తయారు చేస్తున్నట్లు సంబంధిత దౌత్యవర్గాలు పేర్కొన్నాయి. న్యూయార్క్‌తో పాటు ఆ పరిసరాల్లో భారీ భద్రతను మోహరించారు. 130 దేశాలకు చెందిన ప్రముఖ నాయకులు, ప్రభుత్వాధినేతలు, డజన్లసంఖ్యలో మంత్రులు ఈ సమావేశాలలో తమ తమ నిర్దేశిత సమయాలలో ప్రసంగాలకు సిద్ధమయ్యారు. జెలెన్‌స్కీ(ఉక్రేన్),పెజెష్కియన్(ఇరాన్) బుధవారం సమావేశంలో ప్రసంగిస్తారు.

కాగా ఈ సందర్భంగా ట్రంప్ నాలుగు ఖండాల నాయకులతో విస్తారంగా చర్చలు జరపనున్నారు.సమితి సమావేశంలో ప్రసంగించడంతోపాటు 11 ప్రధాన దేశాల నాయకులతో కీలక సమావేశాలు,ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారు.గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునే తీర్మానంపై సంతకాలు జరగడం ఒక ప్రముఖ ఘట్టం. బ్రిటన్, వెనజులా, ఉక్రేన్, డెన్మార్క్, గ్రీన్‌లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,సౌదీఅరేబియా, ఒమన్, బహ్రైన్, కువైట్, ఖతార్ దేశాల నాయులతో ట్రంప్ ముఖాముఖీ సమావేశాలు నిర్వహిస్తారు. విందు సమావేశాల్లో డజన్ల సంఖ్యలో నాయకులతో ఆయన ముఖాముఖీ సంభాషణలు చేస్తారు. ముఖ్యంగా బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఆండీ బర్న్‌హామ్‌తో {అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్,ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ జనరల్ అసెంబ్లీలో ప్రముఖంగా ప్రసంగించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మూడు రోజులు అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో సంభాషణలు చేస్తున్నప్పటికీ ఆయన కూడా జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంలేదు. కాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ సమావేశాల్లో పాల్గొనకుండా దూరంగా ఉన్నారు. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీలకు మాత్రమే న్యూయార్క్ వెళ్ళడానికి అమెరికా వీసాలు మంజూరు చేసింది. వారి వెంట వెళ్ళాల్సిన ఉన్నతస్థాయి అధికార బృందాలకు వీసాల అనుమతి ఇచ్చేందుకు అమెరికా తిరస్కరించింది.ఇదిలా ఉండగా, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంటు తలపై మోసుకు తిరుగుతున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కూడా న్యూయార్క్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. న్యూయార్క్ అధిపతి మమ్దానీ ఆయన రాకను తిరస్కరించినప్పటికీ, ఆయనను అరెస్టు చేసే అధికారాలు మమ్దానీ చేతుల్లో లేవు. దీంతో మమ్దానీ నిస్సహాయంగా ఉండిపోయారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ వరుసగా రెండో సంవత్సరం కూడా జనరల్ అసెంబ్లీ సమావేశాలకు వెళ్ళడం లేదు. ఐతే ఆయన దృశ్యమాధ్యమ విధానం ద్వారా జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తారు.ఈ సమావేశాల సందర్భంగా ట్రంప్‌తో అనేకమంది ప్రపంచ నాయకులు విడివిడిగా ద్వైపాక్షిక ముఖాముఖీ సంభాషణలకు సిద్ధమయ్యారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ట్రంప్‌తో ముఖాముఖీ చర్చలు చేయనున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పదవీకాలం డిసెంబరు 31వ తేదీతో ముగియనున్నది. ఈ సారి ఒక మహిళకు ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టే అవకాశాలు దిట్టంగా కనిపిస్తున్నాయి.తదుపరి వారసులెవరో తెలియని పరిస్థితుల్లో ఈ సమావేశాలకు మరింత ప్రాధాన్యత వచ్చింది.ఐతే ట్రంప్ వైఖరిని చూసినప్పుడు ఆయన ఈ ప్రపంచ సంస్థనుండి వైదొలగుతారని అందరూ ఆ మధ్య భావించారు. కానీ ఆయన అలాంటి ప్రకటన చేయలేదు. గడచిన 12 నెలలుగా ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నది. దీనివల్ల శాంతి పరిరక్షణ కార్యకలాపాలు,మానవతా సహాయంలో కూడా ఈ సంస్థ భారీగా కోతలు విధించాల్సివచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్యను కూడా కుదించుకుంది. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావాలని భారత్—చైనా దేశాలు పదే పదే ఎలుగెత్తి చాటుతున్నాయి.ఐక్యరాజ్యసమితి వ్యవహారాలను నిశితంగా పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుడు రిచర్డ్‌గోవాన్ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయసంస్థ అంతులేని శాశ్వత సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.పశ్చిమాసియాలో యుద్ధ నివారణ,ఉక్రేన్ యుద్ధ సమస్య పరిష్కార చర్యలు,ప్రపంచశాంతి సంరక్షణ,ఇజ్రాయెల్—పాలస్తీనా సమస్య పరిష్కారం వంటి విషయాలలో ఈ అంతర్జాతీయ సంస్థను పూర్తిగా పక్కకు గెంటేశారని, అది తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించలేకపోయిందని అన్నారు.

## వారం రోజుల్లో హోర్ముజ్ తెరుస్తాం: ఇరాన్



**టెహ్రాన్:** అమెరికా సేనలు వెనక్కి తగ్గితే వారం రోజుల్లో హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా గనుక పశ్చిమాసియాలో సైనిక ఒత్తిడి తగ్గించే చర్యలు తీసుకుంటే, సేనలను తగ్గించుకుని వెనక్కి వెళ్ళిపోతే జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీనియర్ ఇరానియన్ అధికారి ఒకరు మంగళవారం క్యోడో న్యూస్ ఏజెన్సీకి చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నవేళ ఇరాన్ నుండి ఈ ప్రకటన వెలువడింది.తాము జలసంధి తెరవాలంటే ముందుగా అమెరికా చొరవ తీసుకోవాలని ఆ సీనియర్ అధికారి కోరారు. "మేం సిద్ధంగా ఉన్నాం,కానీ అమెరికా మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించాలి, ముందడుగు వేయాలి,చొరవ చూపించి సమస్య పరిష్కారానికి సీరియస్‌గా దృష్టిపెట్టాలి,దౌత్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి" అని ఆయన కోరారు.హౌతీ తిరుగుబాటు సైన్యాలు పేట్రేగిపోయే ముందుకు ఉరుకుతున్న తరుణంలో ఇరాన్—అమెరికా మధ్య మరోసారి దాడులు భీకరంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నాయని వార్తలు బలంగా వినిపిస్తున్న తరుణంలో, మరోవైపు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై సెంట్‌కామ్ దిగ్బంధనం అమలు కొనసాగుతుండటం,జనరల్ అసెంబ్లీ వేదికపై ఇరాన్ వాదనలు వినిపించేందుకు ఆ దేశ నాయకులు న్యూయార్క్ బయలుదేరుతున్న పరిణామాలమధ్య ఇరాన్ సీనియర్ అధికారి ద్వారా ఈ ప్రకటన బయటకు వచ్చింది. న్యూయార్క్ సమావేశాల్లో అమెరికా—ఇరాన్‌లకు చర్చల్లో మధ్యవర్తులుగా ఉన్న దేశాలతో ముమ్మర చర్చలు జరపాలని కూడా ఇరాన్ భావిస్తోంది. అమెరికా చొరవ చూపిస్తే జలసంధి తెరవాలన్న ప్రతిపాదనకు సుప్రీంనేత మొజ్తాబా ఖమేనీ,సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా సుముఖంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొంది.

### న్యూయార్క్‌లో అడుగుపెట్టిన పెజెష్కియన్,అబ్బాస్ అరాఘ్చీ

ఇరాన్—అమెరికా మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మొదటిసారి ఇరాన్‌కు చెందిన అత్యున్నతస్థాయి నాయకులు ఇద్దరు అమెరికా కీలక అంతర్జాతీయ నగరం న్యూయార్క్‌లో కాలుమోపారు. తొలిలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ముందుగానే న్యూయార్క్ చేరుకున్నారు. ఆయన వెంట ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తర్వాత న్యూయార్క్‌లో దిగారు. సమకాలీన ప్రపంచ పరిస్థితులపై ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ వైఖరిని తెలియజేయడానికే తాము వచ్చామని వారు చెప్పారు.న్యూయార్క్ చేరుకున్న తర్వాత అబ్బాస్ అరాఘ్చీ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్‌తో ఫోన్‌లో సంభాషించారు. జనరల్ అసెంబ్లీ అజెండాపై ఆయనతో మాట్లాడారు.ఇరాన్ ప్రజల చట్టబద్ద హక్కులు,ప్రయోజనాల పరిరక్షణకోసం ఈ ప్రధాన అంతర్జాతీయ వేదికను ఉపయోగించుకోవడం తమ లక్ష్యమని ఇరాన్ జర్నలిస్టులకు అరాఘ్చీ చెప్పారు.ఈ సమావేశాల్లో పాల్గొనకుండా ఇరాన్ అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందానికి ప్రవేశాన్ని అమెరికా వీసా నిబంధనలో నిషేధించింది. కాగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ అమెరికా బయలుదేరేముందు మాట్లాడుతూ, జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రపంచ సమ్మక్కాన్ని నిలబెట్టి, యుద్ధాలు, రక్తపాతాన్ని ఆపాలనుకున్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ వేదికపై ఇరాన్ వైఖరిని గట్టిగా సమర్థించుకుంటామని చెప్పారు.దురాక్రమణదారులవల్ల ఇరాన్ ఎంతటి దుస్థితి ఎదుర్కొంటున్నదో ఈ ప్రపంచవేదికపై అందరికీ తెలియజేస్తామన్నారు. అన్యాయాలు,అక్రమాలు ఎదురైనప్పటికీ ఇరాన్ ప్రజలు పట్టువదలకుండా ఐక్యంగా నిలబడ్డారని, మా శత్రువుకు గట్టి బుద్ధి చెబుతామని అన్నారు.మేం గర్వంగా తలెత్తుకుని ఈ యుద్ధం నుండి బయటపడ్డామని,మా వైఖరిని ప్రపంచానికి చాటి చెబుతామని అన్నారు.

## తెరమీదకి వైట్‌హౌస్ 24/7 'ట్రంప్ టీవీ'



**వాషింగ్టన్:** అమెరికా మీడియా(వైట్‌హౌస్ ప్రెస్‌పూల్ సంస్థ)తో డోనాల్డ్ ట్రంప్ వివాదం ముదిరింది.ఆయన వార్తల కవరేజీని అమెరికా టెలివిజన్ నెట్‌వర్కు బహిష్కరించింది.ఆ తర్వాత కొద్దిసేపటికే వైట్‌హౌస్ తన సొంత స్ట్రీమింగ్ ఛానల్ అయిన "ట్రంప్ టీవీ"ని వైట్‌హౌస్ తెరమీదకు తెచ్చింది. 24/7 విరామం లేకుండా ట్రంప్ కార్యక్రమాలను ప్రసారం చేయడం ప్రారంభించింది. సిఎన్‌ఎన్,ఎంఎస్ నౌ,పొలిటికో మీడియా సంస్థలను వైట్‌హౌస్ నుండి బహిష్కరిస్తున్నట్లు ట్రంప్ మూడు రోజులక్రితం ప్రకటించారు. ఈ మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, అసత్య వార్తలతో తమ ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయని, అలాంటి సంస్థలను నిషేధించే అధికారం తనకు ఉందని ట్రంప్ చెప్పారు. ఐతే వైట్‌హౌస్ కవరేజీ పరిధి నుండి మీడియా సంస్థలను నిషేధించే చట్టబద్ధమైన హక్కులు దేశాధ్యక్షుడికి లేవని ప్రకటిస్తూ, సిఎన్‌ఎన్,పొలిటికో,ఎంఎస్ నౌ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సోమవారం సన్నాహాలు చేశాయి. ఈ మూడు మీడియాసంస్థలను వైట్‌హౌస్ ప్రాంగణంలో ప్రవేశాన్ని నిషేధించడంతో దీనికి ప్రతిస్పందనగా అమెరికా మీడియా నెట్‌వర్కులు ట్రంప్ కవరేజీని ఉమ్మడిగా నిలిపివేశా యి. పత్రికలు ఎలాంటి వార్తలు ప్రచురించాలో నిర్దేశించే అధికారం ప్రభుత్వానికి లేదని సిఎన్‌ఎన్,పొలిటికో,ఎంఎస్ నౌ సంస్థలు ప్రకటించాయి.అనేక ఇతర ప్ర సార సంస్థలు కూడా ట్రంప్‌తో ఉమ్మడి ప్రసార కార్యక్రమాలలో పాల్గొనబోమని ప్రకటించి బహిష్కరించాయి.ఈ కారణంగా డోనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కడం గానీ,న్యూయార్క్‌లో ఆయన కార్యక్రమాలనుగానీ నెట్‌వర్క్ టీవీ ప్రసారం చేయడం నిలిపివేశాయి.

వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడి కార్యకలాపాలను ప్రసారం చేయడంలో ఖర్చులు తగ్గించుకోవడానికి,ప్రజలకు సులభంగా సమాచారం అందించడానికి మీడియా ఒక నెట్‌వర్కు ప్రెస్‌పూల్‌గా ఏర్పడింది. అంటే అధ్యక్షుడు ఎక్కడ ఉన్నా,ఏం చేస్తున్నా,సెలవుల్లో ఉన్నా,విమానంలో ఉన్నా ఆయనను అనుసరించి వార్తలను ఏకీకృతం చేయడానికి ఈ ప్రెస్‌పూల్ ఏర్పడింది. దీనిద్వారా కంటెంట్‌ను టెలివిజన్ నెట్‌వర్కులు పంచుకుంటాయి. ఈ ప్రెస్‌పూల్‌లో సిఎన్‌ఎన్,ఎబిసి, సిబిఎస్,ఫాక్స్‌న్యూస్,ఎన్‌బిసిలు సభ్యులుగా ఉన్నాయి. ఈ సంస్థలతోనే ఇప్పుడు ట్రంప్‌కు వివాదం తలెత్తింది. కవరేజీ సందర్భంగా టీవీ మీడియా ఆక్రమించే స్థలాన్ని తగ్గించుకోవడం,ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా కంటెంట్‌ను పంచుకోవడం దీని వెనుక ఉన్న ఉద్దేశం.ప్రస్తుతం వైట్‌హౌస్‌లో మీడియా టీవీ బృందాలను నిర్వహించడానికి సహాయపడే పాత్రలో ఫాక్స్‌న్యూస్ రొటేటింగ్ బాధ్యతలు నిర్వహిస్తోంది. ఫాక్స్‌న్యూస్ న్యూస్ చీఫ్ బ్యూరో బ్రయాన్ బ్రౌటన్ ద్వారా బిబిసికి అందిన మెయిల్ సమాచారంలో ఈ పూల్ ద్వారా ట్రంప్‌కు సంబంధించిన కార్యక్రమాలను ఈరోజు నుండీ కవర్ చేయదు అని రాశారు.

### ప్రెస్‌పూల్‌తో ముదిరిన వివాదం: కవరేజీ బహిష్కరణ
### ఐక్యరాజ్యసమితి ప్రసారాలు నిలిపివేసిన నెట్‌వర్క్ పూల్

**నేను పెద్దగా ఆందోళన చెందలేదు: ట్రంప్**

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా వైట్‌హౌస్ సౌత్‌లాన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెరైన్ వన్ హెలిపాడ్ ప్రారంభోత్సవం,రిబ్బన్ కటింగ్ కార్యక్రమాలలో ట్రంప్ పాల్గొన్నారు. ఉమ్మడి మీడియా నెట్‌వర్కు వీటిని ప్రసారం చేయలేదు.ఈ కార్యక్రమాన్ని వైట్‌హౌస్ వెబ్‌సైటులో ప్రత్యక్ష ప్రసారం చేసినప్పటికీ, ఆయన ప్రసంగం,వాయిస్ వినిపించలేదు.న్యూయార్క్ మేయర్ మమ్దానీతో సమావేశం తర్వాత ట్రంప్ టీవీలో కనిపించారు. మీడియా సభ్యులందరికీ పత్రికా గోష్ఠి నిమిత్తం స్వాగతం పలుకుతున్నట్లు మమ్దానీ తర్వాత అధ్యక్షుడు ట్రంప్‌కు తెలియజేశారు.దీనిపై ట్రంప్ వ్యాఖ్యానిస్తూ, "ఇది చాలా బాగుంది, ఆసక్తికరంగా ఉంది, ఎందుకంటే మీడియా సభ్యులందరూ నన్ను బహిష్కరిస్తామని చెప్పారు,కానీ వారు నన్ను ఎప్పుడూ బహిష్కరించలేదు.అందువల్ల నేను ఎప్పుడూ ఈ విషయం గురించి ఆందోళన చెందలేదు, మరి ఇప్పుడు ఈ ప్రెస్ కవరేజీని చూడండి" అన్నారు. అసలు విషయం ఏమిటంటే మమ్దానీతో కలిసి ట్రంప్ ఉన్నప్పుడు కవరేజీ విషయంలో ఎలాంటి సమస్యలూ తలెత్తలేదు.

## ఎసిబి కొరడా
(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అధికారులు.. మంగళవారం ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర సంబంధిత వ్యక్తులకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డాక్యుమెంట్ విలువ ప్రకారం సుమారు రూ.6.13 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఎసిబి వివరాల ప్రకారం.. నోరి లక్ష్మీ భాస్కర్ (56) నిమ్స్‌లో అదనపు వైద్య సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఎర్రగడ్డలోని కల్పతరు అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న ఆయనపై అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు కేసు నమోదు చేశారు. సోదాల్లో కుకట్‌పల్లిలోని హైరిజ్ గేటెడ్ కమ్యూనిటీలో ఒక 4బెడ్‌రూమ్ ఫ్లాట్, మరో రెండు ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, మణికొండ, పేట్‌బషీరాబాద్, కుకట్‌పల్లిలో ఐదు డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. యాదాద్రి, నందిగామ, షామీర్‌పేటతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ ఉన్నట్లు ఎసిబి వెల్లడించింది. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41 లక్షలు, పోస్టాఫీసు డిపాజిట్లలో రూ.12 లక్షలు, ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్లలో రూ.29.55 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. మూడు కార్లు నాలుగు బైక్‌లు ఉన్నట్లు అధికారుల గుర్తించారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కూడా గుర్తించారు. ఈ మొత్తం స్థిర, చరాస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.6.13 కోట్లుగా ఎసిబి ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే వీటి మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని ఎసిబి స్పష్టం చేసింది.ఈ మేరకు ఆయన్ని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### మరో రూ.2.63 కోట్ల లావాదేవీలపై ఆరా

సోదాల సందర్భంగా మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు ఎసిబి పేర్కొంది. వివాదంలో ఉన్న ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేసేందుకు రూ.1.30 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు గుర్తించారు. అంతేకాకుండా వివిధ వ్యక్తులకు రూ.1.33 కోట్లను చేతి అప్పులుగా ఇచ్చినట్లు కూడా అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు. నోరి లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన మరిన్ని ఆస్తులపై ఎసిబి అధికారులు ప్రస్తుతం అదనపు ధ్రువీకరణ చేపడుతున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎసిబి తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాల ఎసిబి ప్రజలకు సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

## నీరు ఇవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం కలిశారు. జూరాలకు నీటి విడుదల, కర్ణాటక ప్రభుత్వంతో జరపాల్సిన సంప్రదింపులపై ముఖ్యమంత్రితో వారు చర్చించారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాల్సిన అవసరంపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. జూరాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడం, అ వెంటనే ఈ అంశంపై సిఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సిఎంతో సమావేశం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మంగళవారం సాయంత్రం బెంగళూరు వెళ్లింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో సమావేశమై ఆల్మట్టి—నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ తరఫున విజ్ఞప్తి చేయనున్నారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాలు తగ్గిపోవడంతో ప్రాజెక్టు పరిధిలోని నీటి అవసరాలపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా సాగునీటి అవసరాలు, తాగునీటి అవసరాలు, దిగువ ప్రాంతాల్లోని రైతుల పరిస్థితిని కర్ణాటక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

### ఆల్మట్టి—నారాయణపూర్ నుంచి నీటి విడుదలపై చర్చ

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల జూరాల నీటి లభ్యతపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ మం త్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ప్రభుత్వంతో చ ర్చలు జరిపి జూరాలకు నీటి విడుదలకు అనుకూల నిర్ణయం తీసుకునేలా ప్రయత్నించనుంది. ఈ సమావేశంలో నీటి లభ్యత, ప్రస్తుత పరిస్థితులు, తెలంగాణ అవసరాలు తదితర అంశాలను వివరించనున్నట్లు సమాచారం.

### రైతుల అవసరాలపై దృష్టి

జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగు నీటి అవసరాలతో పాటు తాగునీటి అవసరాలు కూడా కీలకంగా ఉన్నందున కర్ణాటకతో జరిగే చర్చల్లో ఈ అంశాలను తెలంగాణ బృందం ప్రస్తావించనుంది. నీటి విడుదలపై ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం సాధించడం ద్వారా దిగువ ప్రాంతాలకు నీటి లభ్యతను మెరుగుపర్చే అంశంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

## అగ్ని ప్రమాదం
(మొదటి పేజీ తరువాయి)

సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. మిగిలిన 24 మంది పిల్లల్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అధికారులు, వైద్యులు తెలిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఎసి పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్‌ఎన్‌సియు వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్‌పి అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు. 'నేను ఒక పేషెంట్‌ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్ అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి' అని ప్రత్యక్ష సాక్షి సంతోశ్ తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సిఎం ఆదేశించారు.



### ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ విభాగంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన ఆయన, ప్రమాద స్థలాన్ని పరిశీలించి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్, రిమ్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఘటనలో ముగ్గురు శిశువులు మృతి చెందడం బాధాకరమన్నారు. రిమ్స్‌లో ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అదనంగా 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేసి, రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు... (మొదటి పేజీ తరువాయి)

నిర్మించి ఉంటే వర్షాభావ సమయంలో వాటిని రైతులకు అందించగలిగేవారమన్నారు.సుమారు 70 టిఎంసిల నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జూరాల బదులు శ్రీశైలం నుంచి ప్రాజెక్టును చేపట్టడంతో నీటిని అధిక ఎత్తుకు ఎత్తిపోసే పరిస్థితి ఏర్పడి, నిర్మాణ వ్యయం, విద్యుత్ వినియోగం, నిర్వహణ భారం పెరిగిందని మంత్రి విమర్శించారు. తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టును మార్చడం వెనుక ప్రజాప్రయోజనం లేదని ఆరోపించారు. పాలమూరు—రంగారెడ్డి ప్రాజెక్టును రూ.28 వేల కోట్లతో పూర్తి చేశామని బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఉత్తమ్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర జల సంఘానికి సమర్పించిన డీపీఆర్ విలువ సుమారు రూ.55 వేల కోట్లు ఉందన్నారు. పూర్తి స్థాయి కాలువలు, భూసేకరణ, అనుబంధ పనులు కలిపితే మొత్తం వ్యయం రూ.70 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్ల వరకు ఉండొచ్చని తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా మూడో వంతు పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. 2014లోనే కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని గుర్తుచేసిన ఉత్తమ్.. 2023 డిసెంబర్ వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఒక్క పెండింగ్ ప్రాజెక్టునూ సంపూర్ణంగా పూర్తి చేయలేదని ఆరోపించారు.ఎస్‌ఎల్‌బిసి సొరంగాన్ని గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. జూన్ 2028 నాటికి సొరంగాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇది పూర్తయితే శ్రీశైలం జలాశయంలో పోతిరెడ్డిపాడు కంటే తక్కువ నీటిమట్టం నుంచే తెలంగాణకు నీటిని తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు సరిపోతాయంటూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం నాటి ఎపి ప్రభుత్వంతో లిఖితపూర్వకంగా అంగీకరించిందని తెలంగాణకు ద్రోహం చేసిందన్నారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం వంటి పరిణామాలు కూడా బీఆర్‌ఎస్ పాలనలోనే చోటుచేసుకున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా జలాలను 280.7 టిఎంసీల మేర వినియోగించామని ఉత్తమ్ తెలిపారు. నీటి వినియోగంలో తమ ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు.

### కర్ణాటకను నీరు విడుదల చేయాలని కోరాం:

ప్రస్తుత నీటి కొరత నేపథ్యంలో రైతుల పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి కొంత నీటిని విడుదల చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. నారాయణపూర్ జలాశయం నుంచి నీరు విడుదలైతే ఎగువ కృష్ణా ద్వారా జూరాలకు అదనపు ప్రవాహాలు చేరే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సాగుతో పాటు రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు సరిపడేలా జాగ్రత్తగా వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితి తెలంగాణలో కృష్ణా ఎగువ ప్రాంతంలో మరిన్ని నీటి నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని మంత్రి అన్నారు. వరదల సమయంలో నీటిని నిల్వ చేసి, వర్షాభావ సమయంలో రైతులకు అందించేలా రిజర్వాయర్లు, ఇతర నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు.

## అణిచివేత ధోరణి వద్దు
(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. సమావేశంలో సిఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీ కాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్‌సి కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా అయిదేండ్లలో ఎస్‌సి, ఎస్‌టిలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల మీటింగ్‌లు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని సిఎం అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను సిఎం ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటినుంచో సొంత బిడ్డల్లా ఆదరించిందని, అందుకే పల్లెపల్లెనా ఇప్పటికీ ఇందిరమ్మను తలుచుకుంటున్నారని చెప్పారు. పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సి జనాభా దాదాపు 16 శాతం ఉంటే, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్‌సిలే ఉన్నారన్నారు. ఎస్‌టిల జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని సిఎం వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని, విద్యతోనే సమాజంలో అసమానతలకు, అణిచివేత రుగ్మతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 'ఈ ప్రభుత్వం ప్రజలది. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుంది' అని ముఖ్యమంత్రి అన్నారు.

# ఏషియన్ గేమ్స్‌లో ఇండియాకు తొలి స్వర్ణం

## ఫైనల్‌లో శ్రీలంకపై ఘనవిజయం



ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త సృష్టించింది. మహిళల టి–20 క్రికెట్ పోటీల్లో భారత జట్టు ఘన విజయాన్ని సాధించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. బుధవారం నిషిన్లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్ మైదానం వేదికగా జరిగిన పోరులో శ్రీలంక ను 147 పరుగుల తేడాతో చిత్తు చేసి భారత మహిళలు ఈ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది మొదటి స్వర్ణ పతకం కావడం విశేషం. గతేడాది ఆసియా క్రీడల ఫైనల్లోనూ శ్రీలంకపైనే గెలిచి పసిడి సాధించిన టీమిండియా ఇప్పుడు వరుసగా రెండోసారి ఛాంపియన్గా నిలిచి ఆసియాలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కొండంత స్కోరుకు గట్టి పునాది వేశారు. స్మృతి మంధాన కేవలం 45 బంతుల్లో 7 సిక్సర్లు, 5 ఫోర్లతో 79 పరుగులు చేసి విజృంభించగా.. షెఫాలీ వర్మ 29 బంతుల్లో 48 పరుగులు సాధించింది. చివరిలో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో నాటౌట్ గా 49 పరుగులు చేసి జట్టు స్కోరును 200 దాటించింది. అనంతరం 217 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు ఆరంభం నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 21 బంతుల్లో 29 పరుగులు చేసి టాప్ స్కోర్‌గా నిలవగా.. మిగిలిన బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. దీంతో లంక జట్టు 15.4 ఓవర్లకే 69 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో శ్రీలంక దారుణ ఓటమిని మూటగట్టుకుంది. దీంతో లంక జట్టు రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు ఆసియా క్రీడల్లో కాంస్య పతక పోరులో బంగ్లాదేశ్‌ను 31 పరుగుల తేడాతో ఓడించిన పాకిస్తాన్ కాంస్య పతకం సాధించింది. టోర్నీ అంతటా ఆధిపత్యం చెలాయించిన భారత్ క్వార్టర్ ఫైనల్లో జపాన్‌ను, సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను, ఫైనల్లో లంకను చిత్తు చేసి ఆసియా క్రీడల్లో భారత రంగాన్ని పసిడితో మెరిపించింది.

# 2 పరుగులే తేడా..పరువు కాపాడుకున్న భారత్


## జపాన్‌తో చరిత్రాత్మక టి–20లో విజయం




ఆసియా క్రీడల నడుమ దౌత్య బంధానికి ప్రతీకగా జరిగిన చరిత్రాత్మక టి–20 మ్యాచ్‌లో జపాన్‌పై టీమిండియా విజయంతో మురిసింది. భారత్, జపాన్ 75 ఏళ్ల ఆత్మీయతకు సాక్షిగా నిలిచిన ఈ ఏకైక మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఏదో అలా గెలుపొందింది. ఇరవై ఓవర్ల ఆట అనుకున్నప్పటికీ.. వర్షం కారణంగా ఐదు ఓవర్లే సాధ్యపడగా రెండు పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది మెన్ ఇన్ బ్లూ. పద్దెనిమిదో ఆసియా క్రీడలు కొనసాగుతున్న వేళ.. భారత్, జపాన్ ఏకైక టి20 ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇరుదేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు ప్రతీకగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారతజట్టు రెండు పరుగుల తేడాతో విక్టరీ కొట్టింది. కంటోలోని సనోలో ఉన్న సనో ఇంటర్నేషనల్ క్రికెట్ మైదానంలో మంగళవారం పూర్తి ఓవర్ల ఆటకు వర్షం అడ్డుపడింది. తడి ఔట్‌ఫీల్డ్ కారణంగా అంపైర్లు, రిఫరీ 5ఓవర్లు ఆడించారంతే. ఇంకేముంది జపాన్ బౌలర్లను మనోళ్లు బెంబేలెత్తిస్తారనుకుంటే.. అఫ్గనిస్తాన్‌పై ఆఖరి టి–20లో మెరుపు సెంచరీ బాదిన ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటయ్యాడు. **అయ్యర్ ఒక్కడే...**మరో ఓపెనర్ సంజూ శాంసన్(9)ను ఇబ్రహీం తకహాశీ వెనక్కి పంపాడు. అనంతరం.. ఇషాన్ కిషన్(3) సైతం తేలిపోయినా.. అయ్యర్(16) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ప్రత్యర్థికి 32 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ఆపై వాషింగ్టన్ సుందర్(2–13) విజృంభణతో జపాన్ బ్యాటర్లు క్రీజులో నిలవలేదు. ఓపెనర్ పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఫలితంగా ఆతిథ్య జట్టు ఐదు ఓవర్లలో4 వికెట్ల నష్టానికి 32 పరుగులకే పరిమితమైంది. అయితే.. ఈ మ్యాచ్‌లో జపాన్‌లో క్రికెట్ విస్తరణకు కీలక అడుగు పడినట్టైంది. ఇరుదేశాల ద్వైపాక్షిక బంధానికి గుర్తుగా నిర్వహించిన ఈ మ్యాచ్‌పై జపనీయులు ఆసక్తి కనబరిచారు. దాంతో.. రాబోయే రోజుల్లో జపాన్ క్రికెట్‌కు మహర్దశ వచ్చే అవకాశ ముందంటున్నారు విశ్లేషకులు.

## మహిళ

# లింగ సమానత్వంలో వెనుకబడిన భారత్



ప్రపంచ దేశాల్లో లింగ సమానత్వాన్ని పాటిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఇంకా వెనుకబడే ఉంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2026' ప్రకారం, 145 దేశాలు లేదా ఆర్థిక వ్యవస్థల్లో భారత్ 131వ స్థానంలో ఉంది. 2006లో ఈ సూచీ ప్రారంభమైనప్పటి నుంచి భారత్ స్కోరు 4.3 శాతం పాయింట్లు పెరిగినప్పటికీ, ప్రపంచ సగటు 69.2 శాతంతో పోలిస్తే భారత్ ఇంకా వెనుకబడిఉంది. ఆర్థిక భాగస్వామ్యం, విద్య, ఆరోగ్యం, రాజకీయ సాధికారత అనే నాలుగు రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా ఉన్నారా? లేరా? అనే విషయాన్ని అధ్యయనం చేస్తుంది. భారత్‌లో విద్య, ఆరోగ్యం రంగాలు ప్రధానంగా మెరుగ్గా కనిపిస్తున్నాయి. విద్యా సాధనలో భారత్ 96.6 శాతం సమానత్వాన్ని సాధించింది. మాధ్యమిక, ఉన్నత విద్యలో బాలురు, బాలికల నమోదు విషయంలో భారత్ దాదాపు పూర్తి సమానత్వానికి చేరుకుంది. ఆరోగ్యం, జీవన భద్రత విభాగంలో స్కోరు 95.6 శాతంగా ఉంది. అయితే ఈ రెండు రంగాల్లో సాధించిన పురోగతి మహిళలకు సమానమైన ఆర్థిక అవకాశాలుగా, నాయకత్వ స్థానాలుగా మారడం లేదు. అత్యంత స్పష్టమైన బలహీనత ఆర్థిక భాగస్వామ్యంలో కనిపిస్తుంది. ఈవిభాగంలో భారత్ స్కోరు 41.2 శాతం మాత్రమే. వృత్తిపరమైన, సాంకేతిక ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో ఉన్న స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపై 49.9 శాతానికి చేరుకున్నప్పటికీ, సీనియర్ అధికారులు, మేనేజర్ల స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం కేవలం 13.1 శాతంగా ఉంది. అంటే విద్య, నైపుణ్యం పొందుతున్న మహిళలు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించిన తర్వాత ఉన్నతస్థాయి నిర్ణయాధికార స్థానాలకు చేరుకోవడంలో పెద్ద అంతరం కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 2026లో లింగ అంతరంలో 69.2 శాతం మాత్రమే పూడింది. గత ఏడాదితో పోలిస్తే మెరుగుదల 0.4 శాతం పాయింట్లు మాత్రమే. ప్రస్తుత వేగం కొనసాగితే ప్రపంచం పూర్తి లింగ సమానత్వానికి చేరుకోవడానికి సుమారు 120 సంవత్సరాలు పడుతుందని డబ్ల్యుఇఎఫ్ అంచనా వేసింది. ఐస్లాండ్ 93 శాతం సమానత్వంతో వరుసగా 17వఏడాది మొదటిస్థానంలో ఉంది. ఫిన్లాండ్, నార్వే తరువాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవానికి సూచీలో ఉపయోగించిన నిర్దిష్ట ప్రమాణాల్లో మహిళలు, పురుషుల మధ్య ఎంతఅంతరం ఉందో మాత్రమే కొలుస్తుంది. అయితే, ఈ సూచీలోని అంకెలు వివిధ దేశాలు మహిళల పట్ల అనుసరిస్తున్న తీరును స్పష్టం చేస్తాయి. కాగా, రాజకీయ సాధికారత విభాగంలో భారత్‌కు 24.5 శాతం స్కోరు వచ్చింది. ఈ విభాగంలో భారత్ మొత్తం ర్యాంకు 67. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యానికి సంబంధించిన సూచీలో లింగ అంతరం 16.1 శాతం మాత్రమే భర్తీ అయింది. మంత్రివర్గ స్థాయిలో ఈస్కోరు 5.9 శాతం. 2019లో నమోదైన 30శాతం గరిష్ఠ స్థాయి నుంచి ఇది గణనీయంగా తగ్గింది. కాబట్టి విద్యలో దాదాపు సమానత్వం సాధించినప్పటికీ, రాజకీయ నిర్ణయ ప్రక్రియలో మహిళల ప్రాతినిధ్యం అదేస్థాయిలో పెరగలేదని గణాంకాలు సూచిస్తున్నాయి. మహిళలు విద్య పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాల్లోకి ప్రవేశించడం, ఉద్యోగాలను కొనసాగించడం, నాయకత్వ స్థానాలకు ఎదగడం కీలకం. కుటుంబ సంరక్షణ, పిల్లల పెంపకం, ఇంటి పనుల భారం ఎక్కువగా మహిళలపైనే పడటం దీనికి ఒక ముఖ్యమైన అడ్డంకి. ఉద్యోగం నుంచి కొంతకాలం విరా మం తీసుకున్న తర్వాత తిరిగి కెరీర్లోకి రావడంలో మహిళలు ఎదుర్కొనే నష్టం కూడా వారి దీర్ఘకాలిక ఆదాయం, పదోన్నతులపై ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో భద్రత, ప్రజా రవాణా, డిజిటల్ సాంకేతికతకు ప్రాప్యత వంటి అంశాలు కూడా మహిళల ఆర్థిక అవకాశాలను నిర్ణయిస్తాయి. గ్రామీణ మహిళలకు స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ ఆర్థిక సేవలు అందుబాటులో లేకపోతే కొత్త ఆర్థిక వ్యవస్థలో వారి భాగస్వామ్యం పరిమితమవుతుంది. పిల్లల సంరక్షణ కేంద్రాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక మౌలిక సదుపాయా లు మహిళలపై పడే చెల్లింపులేని శ్రమను తగ్గించగలవు. అందువల్ల లింగ సమానత్వాన్ని కేవలం మహిళల సంక్షేమ అంశంగా చూడటం సరిపోదు. విద్యలో సాధించిన పురోగతిని ఉపాధి, ఆదాయం, ఆస్తిహక్కులు, నాయకత్వం, సాంకేతిక నైపుణ్యాలు, రాజకీయప్రాతినిధ్యంతో అనుసంధానించాలి. గతంలో కంటే ఇప్పుడు చదువుకుంటున్న మహిళల సంఖ్య ఎంతఅనే విషయం కంటే, వారు ఆ విద్యను ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారం, నాయకత్వంగా ఎంతవరకు మార్చుకోగలుగుతున్నారన్నదే కీలకం. ఈ కోణంలో ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# భారత మహిళల్లో కేన్సర్ సమస్య



దేశంలోని మహిళల్లో రొమ్ము (బ్రెస్ట్), గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్) కేన్సర్లు ప్రధాన ఆరోగ్య సమస్యలుగా కొనసాగుతున్నాయి. అందుబాటులో ఉన్న జాతీయగణాంకాల ప్రకారం 2021 నుంచి 2025 మధ్య రొమ్ము కేన్సర్ కేసులు సుమారు 2.13 లక్షల నుంచి 2.4లక్షలకు, సర్వైకల్ కేన్సర్ కేసులు 77వేల నుంచి 79 వేలకు పెరిగాయి. మహిళల్లో నమోదయ్యే మొత్తం కేన్సర్లలో ఈ రెండు రకాల క్యాన్సర్లు దాదాపు 40 శాతం వరకు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే కేసులు పెరగడం కంటే ముందుగా గుర్తించకపోవడమే ఆందోళన కలిగించే అంశం. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ 5 ప్రకారం భారత్‌లో రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్న మహిళలు 1 శాతానికి కూడా చేరలేదు. సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ కూడా 2శాతంలోపే ఉంది. గ్రామీణ ప్రాంతాలు, తక్కువ ఆదాయ వర్గాల్లో పరిస్థితి మరింత వెనుకబడి ఉంది. పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందులు, ఖర్చు, అవగాహన లేకపోవడం, కేన్సర్‌పై నెలకొన్న అనేకానేక అపోహలు ఈఆలస్యానికి కారణమవుతున్నాయి. సర్వైకల్ కేన్సర్ విషయంలో పరిస్థితిని చాలా వరకు మార్చగల అవకాశాలు ఉన్నాయి. హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పివి) టీకా, పాప్స్మియర్ లేదా హెచ్‌పివి పరీక్షలతో ఈ కేన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చు, నివారించవచ్చు. రొమ్ము కేన్సర్లు కూడా ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అందువల్ల లక్షణాలు కనిపించే వరకు ఎదురు చూడకుండా వయసుకు, ప్రమాద కారకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ చేయించుకోవడం కీలకం. కేన్సర్ గురించి భయం తగ్గి, ముందస్తు పరీక్షలపై నమ్మకం పెరిగితే మరెన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది.



# అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక డిమాండ్

**ప్రజాపక్షం/జనగామ:** పేదలు, దళితులు, అణగారిన వర్గాలకు ప్రభుత్వం కెటాయించిన అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా సమావేశం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పైసా రాములు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అనిల్ కుమార్ మాట్లాడుతూ భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయడం సామాజిక న్యాయంలో కీలకమైన అంశమన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు భూములు కెటాయించినప్పటికి అనేక మంది అసైన్డ్ భూముల లబ్దిదారులు ఇప్పటికీ పూర్తిస్థాయి హక్కులు, భద్రత లేకుండా జీవిస్తున్నారన్నారు. భూమి కోల్పోయిన అసలు లబ్దిదారులకు ప్రత్యామ్నాయ భూమి లేదా న్యాయబద్ధమైన పరిహారం కల్పించాలని కోరారు. భూమి లేని పేదలకు భూమి ఇవ్వడం మాత్రమే కాదు, ఇచ్చిన భూమిని రక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యత అన్నారు. అసైన్డ్ భూములపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని, పారదర్శకమైన శ్వేతపత్రం విడుదల చేసి, అర్హులైన లబ్ధిదారులకు భూమిపై పూర్తి భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో జీవన్ కుమార్, యాలాద్రి, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసిలో భారీ చేరికలు




**ప్రజాపక్షం/పాల్వంచ :** పారిశుధ్య కార్మికులు లేకపోతే మానవ జీవన మనుగడకు ఇబ్బంది అని రైతుసంఘం జాతీయ నాయకులు ముత్యాల విశ్వనాథం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. మండల పరిధి 36 పంచాయితీలలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు మంగళవారం స్థానికంగా కార్యక్రమంలో సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియుసిలో చేరారు. వారికి నాయకులు కండువాలు కప్పి సంఘంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని దీనావస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి నేతృత్వంలో వారి హక్కుల కోసం అవిశ్రాంతంగా ఉద్యమిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,500 ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, అధికారులు, పాలక వర్గాల వేధింపులను నిలిపివేయాలని, ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని, ఆరోగ్య రీత్యా వెళ్ళిన వారికి వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ, మండల కార్యదర్శి ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, చంచలపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కొల్లగొడుతున్న కేంద్ర సర్కార్



## ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/వరంగల్ :** కార్మికుల హక్కులను కేంద్రంలోని బిజెపి సర్కార్ కొల్లగొడుతున్నదని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆరోపించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐటియుసి స్లాబ్ లిఫ్ట్ మిల్లర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, ఐఎన్‌టియుసి స్లాబ్ లిఫ్ట్ మిల్లర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కానుగంటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోదీకి కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం తెలియదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. పాలకులు కార్మికులను కాదని యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నాయని, శ్రమకు తగిన వేతనం ఇప్పించడంలో విఫలమవుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, దీంతో కార్మికులు మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశలు, ఎండి యాకుబ్, మిల్లర్ నాయకులు మంగళ నరసింహం, బైర్పాటి నరసింహ, హస్తం పోషాలు, చొప్పరి రాజు, గంధం రాజు, గంధం విష్ణు, గంధం మహేష్, తూర్పాటి రామకృష్ణ, గంధం రేవంత్, కళ్యాణం, కార్తీక్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి మంత్రి ఉన్నారు.. విద్యకు ఎందుకు లేరు?



## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్న

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణ ప్రభుత్వంలో మద్యానికి మంత్రి ఉన్నారు కానీ విద్యారంగానికి ప్రత్యేక మంత్రి ఎందుకు లేరని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టిఎన్‌జిఒ భవన్‌లో నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ మెదక్ జిల్లా 20వ మహాసభకు మణికంఠరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమం చేపడతామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. సభలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు, జిల్లా కార్యదర్శి దినకర్, జిల్లా నిర్మాణ బాధ్యులు ఖలీక్, రాష్ట్ర గర్ల్స్ వింగ్ కోకన్వీనర్ కండె విజేత, నాయకులు మచ్చ రమేష్, పాపయ్య, తేజ, శివ, సంజన, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారానికి పోరాడుదాం

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** బహుజనుల బతుకులు బాగుపడడానికి సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని, బహుజన ప్రజాస్వామిక విప్లవమే బహుజనులకు రాజ్యాధికారాన్ని కల్పించగలదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా బాధ్యులు తోట భిక్షపతి అన్నారు. మంగళవారం బాలసముద్రంలో సిపిఐ కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్రె బిక్షపతి, తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ జన గణనలో కుల గణన చేసి జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని, చట్టసభలలో స్థానికసంస్థలలో బిసి జనాభా ఆధారం గా సీట్ల కేటాయింపు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ సంఘాన్ని నిర్మాణం చేసుకొనుటకు సభ్యత్వం నిర్వహించి మండల, జిల్లా మహాసభలు జరుపుకుని నవంబర్‌లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభ కు సన్నద్ధం కావాలని కోరారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి ఎన్ఎ.స్టాలిన్, నాయకులు నాంపల్లి లక్ష్మయ్య, గోపరాజు కుమారస్వామి, కంచెర్ల కుమారస్వామి, అలకుంట యాకయ్య, పొనుగోటి రాముగోపాల్‌చారి, పూజారి అమృతయ్య, బైరి భాస్కర్ ఎం. చంద్రశేఖర్, తాటికంటి మమత, గుంటీ రజిత, జెట్టి కృష్ణ, పెనుకుల మధు, తురుక శోభన్, కొత్తపల్లి శ్రీకాంత్, గాండ్ల కవిత తదితరులు పాల్గొన్నారు.




# హక్కుల సాధనకు ఏకం కావాలి



## బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** సకల రంగాల్లో బిసిల వాటా సాధించడానికి రాజకీయాలకతీతంగా బిసిలంతా ఏకం కావాలనీ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఖిలా వరంగల్ మండల మహాసభ మార్కండేయ నగర్ బర్థన్ హాల్‌లో నల్లతీగల కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి, సహాయకార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సువర్ణలతో కలిసి ముఖ్యఅతిథిగా తాటిపాముల వెంకట్రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో 60 శాతం ఉన్న బిసిల వాటా బిసిలకు ఇవ్వడానికి జనాభా లెక్కలతో పాటు బిసి కులాల వారిగా జనాభా లెక్కలు తీసి సకలరంగాల్లో బిసిల వాటా బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిసిల ఐక్యత సమీకరణ హక్కుల సాధనే లక్ష్యంగా అక్టోబర్ 15 న వరంగల్ జిల్లా మహాసభలు , నవంబర్ 21,22 తేదీలలో రంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా బిసిలంతా ఏకం చేయడానికి బిసి హక్కుల సాధన సమితి చేపట్టబోయే ఉద్యమాలకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. అనంతరం 20 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మౌటం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఓడపెల్లి శ్రీనివాస్, బాషెట్టి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా సల్లూరి నరేందర్, సహాయ కార్యదర్శిగా నులతీగల కుమార్, తీగల రాజేందర్, రత్నాల రంజిత్, కోశాధికారిగా కందగట్ల దివ్య, సభ్యులుగా రమేష్ గౌడ్, తోట మల్లన్న, తోట రాజు, పద్మ రజని, వంశీ కుమార్, రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎండి అక్బర్, సుంకరి ,భవాని, దోమల కుమార్ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిన ఎంఎల్‌హెచ్‌పి పోస్టులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూర్యాపేట నందు జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం నందు కాంట్రాక్ట్ పద్ధతిన పని చేయుటకుగాను 28 ఎంఎల్‌హెచ్‌పి పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తేది.24.09.2026 నుండి తేది.30.09.2026 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు పని దినాల్లో జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https://suryapet.telangana.gov.in సందర్శించాలని కోరారు.

## మూసీ నీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మూసీ నీటిని విడుదల చేయాలని సూర్యాపేట మండల పరిధిలోని తాళ్లకాంపాడు, పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మూసి ప్రాజెక్టు పరిధిలో 36, 37, 38, 40 తూముల కింద సుమారు 300 ఎకరాల వరి పొలాలను సాగు చేశామన్నారు. కానీ మూసీ నీరు రాక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక ఎల్‌నినో ప్రభావంతో కుంటల్లో, చెరువుల్లో నీళ్లు లేక తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మూసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లఖమ్మంపహాడ్, సింగిరెడ్డిపాలెం గ్రామాల రైతులు ఎలక సైదులు, కాసర్ల లింగారెడ్డి, బి.సీతారాములు, యానాల సత్యం, పేర్ల లింగయ్య, జి.యలమంచయ్య, కె.నరసయ్య పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్లు రాక.. మేళ్లచెరువులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు చెక్‌పోస్టు బజార్ పరిసర ప్రాంతాలలో గత నాలుగైదు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులో కేవలం ఒక్కరోజు మాత్రమే నీరు వస్తుందని, మిగతా రోజుల్లో చుక్కనీరు కూడా రావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై కిష్టాపురం గ్రిడ్ ఎఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా పైపుల లీకేజీల సాకులతో సమాధానాన్ని దాటవేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎల్‌నినో కారణంగా ఇప్పటికే భూగర్భజలాలు, బోర్లు, బావులు ఎండిపోయే పరిస్థితులు వచ్చాయని, తాగునీటి సమస్య ఎక్కడ కూడా రాకుండా చూడాలని కలెక్టర్ అదేశాలను ఇస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం




● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మొగుదాల సత్తయ్యకు రూ.27 వేలు, గోధుమ గడ్డ లలిత రూ.21,000 , బొలగాని శేఖర్‌కు రూ.60 వేల చెక్కులను అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ ద్వారా మంజూరైన రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఎవరు ఇబ్బంది పడకూడదని అవసరమైతే వారికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## 'విబి–జి రామ్‌జి' వ్యవసాయానికి అనుసంధానంతో రైతులకు మేలు

● విబి–జిరామ్ జి రాష్ట్ర స్పెషల్ కమిషనర్ లక్ష్మి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** వ్యవసాయ రంగానికి వి బి జి రామ్ జి పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులకు, వ్యవసాయానికి లబ్ది చేకూరుతుందని వి బి జి రామ్ జి స్పెషల్ కమిషనర్ లక్ష్మి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని చిన్న లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో డిప్యూటి కమిషనర్, జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్న రాష్ట్ర కమిషనర్ లక్ష్మి మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకం కింద ఎలాంటి పనులు జరుగుతున్నాయో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. 164 కుటుంబాల నుండి ప్రతిరోజు పనులు చేస్తున్న కూలీల అందరి పక్షాన గ్రామ పంచాయతీ 2027–28 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.86.74 లక్షల లేబర్ బడ్జెట్‌ను ప్రకటించారని తెలిపారు. స్పెషల్ కమీషనర్, డిప్యూటీ కమిషనర్ సరిత సంబంధిత అధికారుల సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గ్రామంలో పర్యటించి సమస్యలు నేరుగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సరిత, డిఆర్డిఏ నాగిరెడ్డి, జెడ్పీ సీఈవో శోభారాణి, డిపిఓ శ్రీనివాస్ రెడ్డి, డిఎల్‌పిఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంపిడిఓ గీతారెడ్డి, ఏపీడి నవీన్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఈసీలు యశోద, రాజశేఖర్, సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్ ముడావత్ పార్వతీ చిన్న నాయక్, వార్డు మెంబర్లు సరిత నవీన్ రెడ్డి, బోల్లు నరసింహ, మహేష్ యాదవ్, ఓర్సు రాములు, మోత్కుపల్లి రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల జీవితాలను మార్చేది గురువులే

● నల్లగొండలో 9 శాతం పెరిగిన విద్యార్థుల నమోదు

● ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు ప్రత్యేక కార్యాచరణ : మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ/నల్లగొండ టౌన్:** విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, వారికి సరైన దిశానిర్దేశం చేసేది గురువులేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నమోదు శాతం 10 శాతం తగ్గగా, నల్లగొండ జిల్లాలో మాత్రం 9 శాతం పెరగడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మెరుగైన విద్యను అందిస్తున్నప్పటికీ చాలామంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్తున్నారని, ప్రైవేట్ పాఠశాలల్లో బట్టీ విధానం, ఇంగ్లిష్ మీడియం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయని అన్నారు. పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అన్నారు. మధ్యలోనే బడి మానేసే విద్యార్థుల వివరాలను సేకరించి, వారు చదువు ఎందుకు మానేస్తున్నారనే కారణాలను విశ్లేషించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో పుస్తకాల ద్వారా మాత్రమే విద్యాబోధన జరిగేదని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ ద్వారా విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ విద్యార్థులు చెడు మార్గాలకు వెళ్లే పరిస్థితులు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించి, సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ గుమ్మల జానకి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**కార్పొరేషన్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

కార్పొరేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే కాక



బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్ పరిశుభ్రత కోసం కోటి 1 లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు స్వీపింగ్ మెషిన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నల్గొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన కార్పొరేషన్ ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా 24 గంటల తాగునీరు అందించేందుకు 83 కోట్లతో టెండర్లు పిలిచామన్నారు. ఎస్‌డిఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, మిగిలిన డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్టీపీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ, ఆర్అండ్‌బి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## అభివృద్ధే లక్ష్యంగా సిసి రోడ్లు పూర్తి

● ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గంలోని రైతాంగం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం డిండి మండలం ఎర్రారం, దేవరకొండ మండలం కాసారం గ్రామాలకు చెందిన రైతులకు రూ. 23,485 విలువైన సూక్ష్మ సద్య పరికరాలు(స్ప్రింక్లర్లు) రైతులకు ఎమ్మెల్యే బాలునాయక్ పంపిణీ చేశారు. ఈసందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తక్కువ నీటితో మెరుగైన పంట దిగుబడులు సాధించేందుకు సూక్ష్మ సేద్య పద్ధతులు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని 10వ వార్డులో రూ.58లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించారు. 10వ వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఏయే ప్రాంతాల్లో సిసి రోడ్లు అవసరమున్నాయి, ఎక్కడ డ్రైనేజి సమస్యలు ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, తాగునీటి సమస్యలపై అప్రమత్తం

● అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో విద్యుత్తు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.అదే విధంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని, అధికారులు వాటిని సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కోరారు. ప్రజలకు అందుబా




టులో ఉండే పరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని అన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో జి.సి.మున్నయ్య, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం**

పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా జీవించడానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని అన్నారు. శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజ లవణాలు తదితర పోషకాలు తగిన మోతాదులో లభించే సమతుల్య ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, సీడీపీఓ సక్కుబాయి, సూపర్‌వైజర్ యశోద, మండల స్థాయి సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ప్రజా ప్రభుత్వం

● కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/మునగాల/నడిగూడెం :** పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో పంక్షన్ హాల్‌లో అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి నాణ్యత కలిగిన సన్న బియ్యం అందంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం భారీ స్థాయిలో స్మార్ట్‌రేషన్‌కార్డులను జారీ చేసిందన్నారు. మునగాల మండలంలో 14,805 కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసర్ల కోటయ్య, నాయకులు కాలే సామ్యేలు, ఓరుగంటి రవి, ఇనుగుర్తి వీరచారి, పాషా, మాదాసు నాగయ్య, రణబోతు వీరారెడ్డి, చెగొండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మెరుగైన సన్నబియ్యం పంపిణీ ప్రభుత్వ లక్ష్యం**

అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు.



మంగళవారం మండల కేంద్రంలో కొల్లు కోటయ్య పంక్షన్‌హాల్‌లో స్మార్ట్ రేషన్‌కార్డులను పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మంచి నాణ్యత కలిగిన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ భారీస్థాయిలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తుందన్నారు. మండలంలో 10,221 స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరపతమ్మ సుధీర్, మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, నాయకులు గుండు శ్రీనివాస్, బుత్కూరి వెంకటరెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలకు ప్రపంచంలోనే యూనిక్ ఐడెంటిటీ

● తమిళనాడు స్టేట్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ టిఎన్.వెంకటేష్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలు ప్రపంచంలోనే యూనిక్ ఐడెంటిటితో ప్రఖ్యాతి గాంచి మగువల, వినియోగదారుల మనసు దోచుకుంటున్నాయని తమిళనాడు స్టేట్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరి టిఎన్ వెంకటేష్ కొనియాడారు. సోమవారం ఆయన పోచంపల్లిని సందర్శించి క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎక్స్‌పోజర్ ఆఫ్ తెలంగాణలో భాగంగా నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను పర్యటించినట్లు సోమవారం పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ కార్మికుల స్థితిగతులను తెలుసుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. టూరిజం పార్కు, సహకార సంఘం, పలు మగ్గాలు నేసే కార్మికుల ఇళ్లకు వెళ్ళి చీరలు నేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. పరిశ్రమ అభివృద్ధి కోసం వ్యాపారాల్లో లాభాలు కార్మికుల జీవన ప్రమాణాలు మారుతున్న కాలానికి తగ్గట్టుగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్‌లతో చేనేత వస్త్రాల తయారీకి కావలసిన ప్రభుత్వాలు అందివ్వాల్సిన సహకారాలను ఢిల్లీలో మాట్లాడుతానని హామి ఇచ్చారు. సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్ జిల్లా ఎడి శ్రీనివాస్ రావు సంఘం సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు



● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజపక్షం/భూదాన్ పోచంపల్లి:** భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు రైతులకు ఇబ్బంది గురిచేస్తే సమస్యకు పరిష్కారం చూపకుండా మరింత జటిలం చేస్తే సహించేది లేదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవ్వరూ పనిచేసినా వేటు తప్పదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు. పిఎసిఎస్ పోచంపల్లి అధ్యక్షులు పాక మల్లేష్ అధ్యక్షతన పట్టణంలోని జిబిఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన అర్థ వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కుమారుడు శ్రీరాం రెడ్డితో కలిసి ఈ సందర్భంగా సభకు హాజరైన ప్రముఖులను రైతులను పార్టి అభిమానులనూ తమ ప్రభుత్వ పనితీరుకు ఇదే నిదర్శమని చూసి సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా నియమించబడిన చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్ రెడ్డి, పాలకవర్గానికి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు జూలూరు పిఎసిఎస్ చైర్మన్ కళ్ళెం రాఘవ రెడ్డి వలిగొండ, బీబీనగర్ ,భువనగిరి పిఎసిఎస్ చైర్మన్‌లు గరిసే రవి, పొట్టోళ్ల శ్యాం గౌడ్, పక్కీరు కొండల్ రెడ్డి, చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు వంగూరి పాండు, మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, బీబీనగర్ సూరకంటి సత్తిరెడ్డి, జూలూర్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ మక్తాల రమేష్ గౌడ్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నర్సింహ్మారెడ్డి, అంబరీష్ రెడ్డి భూపాల్ రెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాసుల అంజయ్య గౌడ్, మన్నే వెంకట్ రెడ్డి, కౌన్సిలర్స్ కో ఆప్షన్ మెంబర్స్ మద్ది మధుసూదన్ రెడ్డి సయ్యద్ ఎజాస్, పిఎసిఎస్ డైరెక్టర్లు, సిఈవో బాల్‌రెడ్డి జక్కుల శేఖర్ యాదవ్ రైతులు పార్టి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన సింగారి పద్మ (45) మంగళవారం పిడుగుపాటుకు గురై మరణించింది. మృతురాలికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

## రైతాంగానికి విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం విఫలం

● విద్యుత్ డివిజనల్ ఆఫీస్ ఎదుట బిఆర్ఎస్ ధర్నా

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** అబద్దపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదు.కేసిఆర్ ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ 24గంటలు అందించారు. కానీ రేవంత్‌రెడ్డి సిఎం అయిన తర్వాత మరుక్షణం నుండి కరెంట్ కోతలు మొదలైయ్యాయని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. కరెంట్ కోతలను నిరసిస్తూ మంగళవారం చౌటుప్పల్ డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ కార్యకర్తలు, రైతులతో కలిసి ధర్నా చేశారు. విద్యుత్ ఆఫీస్‌కు తాళం వేయాలని కార్యకర్తలకు చెప్పడంతో ఒక్కసారిగా కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డిఈ మల్లికార్జున్ ఆఫీస్ నుండి బయటకు రావడంతో లాక్ బుక్ చూపించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోరగా డిఈ చూపించకపోవడంతో కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో జరిగిన విద్యుత్ ఉత్పత్తి ప్రస్తుతం జరుగుతుంది. అయిన ఎందుకు రైతాంగానికి నాణ్యమైన కరెంట్ 24 గంటలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గతంలో ఎంపిగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాక్ బుక్ చూశారు



కదా మరి ఇప్పుడు ఎందుకు లాక్ బుక్‌లు చూడడం లేదని అన్నారు. వరి పంటలు కరెంట్ లేక ఎండిపోతుంటే రైతులు అరిగోస పడుతున్న కూడా ప్రభుత్వం కరెంట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గిర్కంటి నిరంజన్‌గౌడ్,మాజీ జెడ్పీటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు సుర్వి మల్లేశం,నాయకులు బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ బిక్షం, కొత్త పర్వతాలు, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, సావిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, తాడూరి పరమేష్, బోరెం ప్రకాష్‌రెడ్డి, సుర్కంటి శ్రీధర్‌రెడ్డి, చిన్నం బాలరాజు, సుర్కంటి శంకర్‌రెడ్డి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ కొయ్యడ శేఖర్, జెజె రెడ్డి, అల్మాసిపేట కిష్టయ్య, పగిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రదేశాల సందర్శనతో చారిత్రక, సాంస్కృతిక విజ్ఞానం

● అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణలోని ముఖ్యంగా నల్లగొండ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల విద్యార్థులకు చారిత్రక, సాంృతిక విజ్ఞానం కలుగుతుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి యువ టూరిజం క్లబ్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లా పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో నగర మేయర్ బుర్రి చైతన్య రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, అడిషనల్ ఎస్‌పిజి.రమేష్, డీఐఈవో దసరా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి, డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, కార్పొరేటర్ సమద్, ఎండీ ఇంతియాజ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండీ అక్బర్ అలీ, న్యాయ నిర్ణేతలుగా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్, డాక్టర్ ఎండీ హసీనా, నర్సింగ్ కోటయ్య, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందోల్‌లో మంత్రి దామోదర పర్యటన



ప్రజాపక్షం/ జోగిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో బాగంగా మొదట అందోల్ మండలంలోని డాకూరు గ్రామంలోని సిఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం వట్‌పల్లి మండలం ఉసిరకపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నె నర్సింలు, ప్రథమ వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాదపడుపడుతున్న మాజీ జెడ్‌పిటిసి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల రాంరెడిని మంత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక అధికారులకు సూచించారు. అనతరం మర్వేల్లి గ్రామములో కార్యకర్తలతో సమావేశమైన మంత్రి, గ్రామంలో శ్రీ సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మంటపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట పిసిసి ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మండలపార్టీ అధ్యక్షుడు విశ్వాస్, మాజీ అధ్యక్షుడు రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ కచ్చుర్ రావు ,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి; నియోజకవర్గ ముఖ్య నాయకులు జగన్ మోహన్ రెడ్డి,సురేందర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్, మల్లయ్య, అల్లాదుర్గ మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు శేసారెడ్డి, పెద్దపట్ల వినయ్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## రౌడీషీటర్లపై నిఘా ఉంచాలి

డిఐజి అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా వ్యవహరిస్తూ బాధితులకు మెరుగైన సేవలు అందించాలని కాళేశ్వరం జోన్ 1 డిఐజి అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిసిటిఎన్ఎస్ ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతల తీరును సిఐని అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తు, నేరగాళ్ల వివరాల నిర్వహణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా అధికారులు సమన్వయంతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని డిఐజి అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పరిధిలోని పెద్దవాగు నిమజ్జన ప్రాంతం, శోభాయాత్ర మార్గాలను మంగళవారం జిల్లా ఎస్పి నికితా పంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. బందోబస్తుతో పాటు తాగునీరు, గజఈతగాళ్లు, విద్యుద్దీపాల సౌకర్యాలపై అధికారులను ఆరా తీశారు. భారీగా విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కాగజ్‌నగర్ డిఎస్‌పి, టౌన్, రూరల్ సిఐలు, పురపాలక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిగ్వా గ్రామస్తులకు తగిన సహాయం అందిస్తాం: కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ : కుభీర్ మండలం నిగ్వా గ్రామంలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు వీలైనంత తొందరగా సహాయం అందిస్తామని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టర్ మంగళవారం కుభీర్ మండలంలోని నిగ్వా గ్రామంలో గడ్డం వాగు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని చేశారు.వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయిన విషయాన్ని గుర్తించి, అన్ని రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు.ప్రాజెక్టు బాధితుల పునరావాసం కోసం కేటాయించాల్సి ఉన్న 26 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆయా సర్వే నంబర్ల భూములను పరిశీలించి, సాంకేతిక,రెవెన్యూ పరమైన చిక్కులను త్వరితగతిన పరిష్కరించి భూ పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తిచేసి లబ్ధిదారులకు భూములు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.భూ రికార్డుల పరిశీలన పూర్తికాగానే తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితుల ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్కడి స్థానికులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వెంటనే స్పందించిన కలెక్టర్,గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజా అవసరాలకు అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా బోర్‌వెల్స్ వేయించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక ఆలయంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహంతో జీవితం ఆగిపోతుంది




ప్రజాపక్షం/మావల: మైనారిటీ బాలికల గురుకులంలో ఎయిడ్ ఎన్‌జిఓ ఆధ్వర్యంలో బాల్ వివాహ ముక్త్ భారత్ అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలతో బాలికల ప్రగతి ఆగిపోతుందని, ఆపదలో ఉంటే 1098, 100 నంబర్లకు ఫోన్ చేయాలని డిసిపిఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సిడబ్ల్యుసి సభ్యుడు సమీర్ ఉల్లాఖాన్, ప్రిన్సిపాల్ ఫారిన్ సుల్తానా, ఎయిడ్ కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

# నిర్మల్‌లో షాపింగ్ మాల్స్ దందా!

యథేచ్ఛగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం
పట్టించుకోని మునిసిపల్, ట్రాఫిక్ అధికారులు!
అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం

ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ పట్టణంలో బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, నిర్వహణ తీవ్ర నిబంధనల ఉల్లంఘనలకు వేదికగా మారాయి. పట్టణ కేంద్రంలో నూతనంగా వెలసిన ప్రధాన షాపింగ్ మాల్స్ భవన నిర్మాణ నియమాలను పూర్తిగా బొందపెట్టి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తుండటంపై పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మల్ పట్టణంలో వాణిజ్య సముదాయాల జోరు పెరుగుతున్నప్పటికీ, అదే స్థాయిలో ప్రజల ప్రాణ భద్రతను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన వెలసిన ప్రముఖ వస్త్ర షాపింగ్ మాల్స్ వంటి పెద్ద వాణిజ్య సముదాయాలలో కస్టమర్ల కోసం ఎలాంటి పార్కింగ్ సౌకర్యాలు లేవు. భవన ప్లాన్ అనుమతుల సమయంలో బేస్‌మెంట్‌ను పార్కింగ్ స్థలంగా చూపి, నిర్మాణాలు పూర్తయ్యాక ఆ స్థలాలను కూడా వాణిజ్య అవసరాలకు



మరియు స్టోర్‌రూమ్‌లుగా మలిచేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మాల్స్‌కు వచ్చే వందలాది వాహనాలు ప్రధాన రహదారులపైనే నిలుస్తుండటంతో నిత్యం కిలోమీటర్ల మేర తీవ్ర ట్రాఫిక్ స్తంభించిపోతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. మరోవైపు భవనాల్లో అత్యవసర సమయంలో పొగ బయటకు వెళ్లేందుకు, గాలి వెలుతురు ప్రసరించేందుకు అవసరమైన వెంటిలేటర్లు, సరిపడా కిటికీలు కూడా లేవు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా నాలుగు వైపులా మూసివేసినట్లుగా ఉన్న ఈ భవనాలలో పండుగల వేళల్లో వేలాది మంది జనం ఉన్న సమయంలో ఏ చిన్న అగ్నిప్రమాదం జరిగినా ఊపిరాడక భారీ ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. కనీస ఫైర్ ఎన్‌ఓసి, అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోయినా వ్యాపారాలు సాగించడంపై పౌరులు భయాందోళన చెందుతున్నారు. అధికారుల కంటిముందే రోడ్లు దిగ్బంధమై, కనీస గాలి వెలుతురు లేని భవనాలపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగితాలపైనే లెక్కలు చూపి పౌరుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిస్థితిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ప్రత్యేక బృందాలతో నిష్పాక్షిక విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని నిర్మల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రవిబాబును 'ప్రజాపక్షం' వివరణ కోరగా స్పందించారు. పట్టణంలోని ప్రముఖ వస్త్ర షాపింగ్ మాల్స్ భవనాలకు మున్సిపాలిటీ నుండి పూర్తిస్థాయి ప్లాన్ అనుమతులు ఉన్నాయని తెలిపారు. అధికారుల బృందం పరిశీలన తర్వాతే అనుమతులు ఇచ్చామని, భవనాల్లో నిబంధనల ప్రకారమే వెంటిలేషన్, కిటికీల సౌకర్యాలు సరిపడా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

## రిమ్స్‌లో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

చిన్నారుల మరణానికి ప్రభుత్వానిదే బాధ్యత
ప్రాణం పోయాల్సిన ఆసుపత్రిలోనే ప్రాణాలు పోతున్నాయి
బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజాపక్షం/బోథ్ : సోమవారం రాత్రి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనలో బాధితులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు.ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులను కలిసి ఘటన వివరాలనుఅడిగితెలుసుకున్నారు.అగ్నిప్రమాదంలో ఇచ్చోడ కి చెందిన శిశువు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ప్రజలు భరోసాతో రిమ్స్ ఆసుపత్రికి వస్తారని, కానీ ప్రాణం పోయాల్సిన ఆసుపత్రిలోనే ప్రాణాలు పోతున్నాయని అన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే చిన్నారులప్రాణాలుపోయాయని అన్నారు. 3 ఏండ్లు గడిచినా రిమ్స్ ఆసుపత్రిని కనీసం మంత్రులు, అధికారులు సందర్శించకపోవడం సిగ్గు చేటన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో కనీససౌకర్యాలు కల్పించలేకపోతున్న ప్రభుత్వం తక్షణమే బాధితులకు క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని దానికి ప్రభుత్వమే



పూర్తి బాధ్యత వహించాలి. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.తక్షణమే ఈ ఘటనపై సమగ్ర విచారణజరిపి, బాధ్యతారాహిత్యంగా ఉన్న అధికారులు, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మరణించిన చిన్నారులకు ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## శాంతియుతంగా నిమజ్జనాలు

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/భైంసా : గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. భైంసాలో గణేష్ నిమజ్జనం సందర్భంగా మున్నూరు కాపు సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపు సంఘం, గణేష్ నగర్, గోపాల్ కృష్ణ మందిర్‌లో వినాయక నిమజ్జనాన్ని ప్రారంభించారు. ఎస్ పి జానకి షర్మిల మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు.మున్నూరు కాపు సంఘ భవనం లో 20,100 రూపాయల కు గణేష్ లడ్డు ను దక్కించుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి,మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్ లు,నాయకులు,సర్పంచ్ లు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధం

అల్పహారం ద్వారా 30 వేల మంది విద్యార్థులకు లబ్ధి
కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్: ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు అల్పాహారం అందించే సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో తెలంగాణ ప్రభుత్వం హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్ కిచెన్ ను, యంత్రాలను పరిశీలించి సామాగ్రి సామర్థ్యాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ త్వరలో జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంటస్వామి, ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయిందన్నారు. ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యా



ర్థులకు వర్తిస్తుందని, దీని ద్వారా పాఠశాలలో నాణ్యమైన చదువుతో పాటు పౌష్టిక అల్పహారం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 395 పాఠశాలలోని 30 వేల మంది విద్యార్థులకు వర్తిస్తుందన్నారు. ఈ పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని, తద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ రాజు, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మెదక్ కిచెన్ ప్లాంట్ మేనేజర్ పునీత్ త్రిపాఠి, హెచ్ కెఎం ట్రస్ట్ ఆర్గనైజర్ వీర, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ నవీన్, జిల్లా విద్యాశాఖ బ్రేక్ ఫాస్ట్ ఇన్చార్జ్ పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పుస్తక పఠనంతోనే సృజనాత్మకత పెంపు

కలెక్టర్ కె. హరిత

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : చిన్న వయస్సు నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతాయని కలెక్టర్ కె. హరిత అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 45 స్కూల్ కాంప్లెక్స్ విజేతలైన ప్రాథమిక స్థాయి విద్యార్థులకు జిల్లా స్థాయి కెబి రీడతాన్ పఠన పోటీలు మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్ ఆసిఫాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పఠనాన్ని విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం చేయాలని, పాఠశాలల్లో అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత నాలుగేళ్లుగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనకు ఈ కార్యక్రమం నిర్వ




హించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యువరాజు మర్మాట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాప్టే అనిల్ కుమార్, రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ రాష్ట్ర మేనేజర్ చారి, జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ప్రతినిధి మధు, ప్రిన్సిపల్ మహేశ్వర్, న్యాయనిర్ణేతలు శ్రీనివాస్, నాగేందర్, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్క్‌షాప్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ



ప్రజాపక్షం/మందమర్రి : వర్క్‌షాప్ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్ అధ్యక్షతన సోమవారం పిట్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శర్మను పిట్ కార్యదర్శిగా కొనసాగించాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో బ్రాంచ్ నాయకులు కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, తిరుపతి, ఎక్కేటి రాజేశ్వరరావు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ములకలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి పాల్గొన్నారు.

## ముప్పిరెడ్డిపల్లిలో వీధి కుక్కల స్వైరవిహారం

గుంపులుగా సంచరిస్తుండటంతో గ్రామస్తుల్లో ఆందోళన
పిల్లలు,వృద్ధులను బయటకు పంపేందుకు భయం

ప్రజాపక్షం/మనోహరాబాద్ : మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఒక్కసారిగా ప్రజల వెంటపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా తిరగాల్సి వస్తోందని తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు ఇళ్ల పరిసరాల్లో కూడా కుక్కలు తిరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పే



ర్కొన్నారు. కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల సంచారాన్ని నియంత్రించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుని గ్రామస్తులకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు గ్రామంలో పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు చేపడితే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/ రాంచంద్రాపురం : నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలోరూ. 25 లక్షలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈదుల నాగులపల్లి లో కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం తన సొంత నిదుల నుంచి రూ. 3 లక్షలు అందించి



నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డిఇ కృష్ణవేణి, ఏఈఫైజాన్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవేందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, రవీందర్‌రెడ్డి కొమరయ్య, శ్రీకాంత్, నాగరాజు, శ్రీశైలం, నాయకులు రమేష్, చెన్నారెడ్డి ,సాయిచరణ్‌గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 572 మంది బైండోవర్

సిపి సాయి చైతన్య

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : వినాయక నిమజ్జనం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశమున్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి, జిల్లావ్యాప్తంగా 572 మందిని బైండోవర్ చేసినట్టు నిజామాబాధ్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ నుండి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని, వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు బైండోవర్ చేయబడిన వ్యక్తులను సంబంధిత మండల రెవెన్యూ అధికారుల ఎదుట హాజరుపరిచి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. డివిజన్‌లో భారీగా బైండోవర్ సంఖ్య నిజామాబాద్ డివిజన్ వ్యాప్తంగా 280 మందిని, ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 175 మందిని బైండోవర్, బోధన్ డివిజన్ వ్యాప్తంగా 117 మందిని బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్ళు, సున్నితమైన ప్రాంతాలు మరియు రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. అలాగే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరు శాంతియుతంగా, క్రమశిక్షణతో పరస్పర సహకారంతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## సంగారెడ్డిలో కత్తిపోట్ల కలకలం

ప్రజాపక్షం/ సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి కత్తి పోట్లకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున వివరాలు సేకరించారు. పట్టణ సిఐ రామనాయుడు తెలిపిన వివరాల ప్రకారం నాల్ సాబ్ గడ్డ ప్రాంతానికి చెందిన ఫాసల్ (45) బిలాల్ (38) రహీం(35) సోమవారం రాత్రి సితార థియేటర్ ఎదురుగా ఉన్న జలాల్ బాగ్ గ్రౌండ్‌లో కలిసి మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురి మధ్య కొన్ని విషయాల్లో గొడవ జరిగింది. దీంతో రహీం తన వద్ద ఉన్న కత్తితో పాసిల్ పై దాడి చేశాడు. కత్తిపోట్లకు తీవ్రంగా గాయపడిన పాసిల్ అక్కడిక్కడే మృతి చెందాడు. అనంతరం పక్కనే ఉన్న బిలాల్ పై కూడా రహీం దాడి చేయడంతో అతడి తొడ బాగంలో గాయాలయ్యాయి. గాయపడిన బిలాల్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన అనంతరం నిందితుడు రహీం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### ఇదే గ్రౌండ్‌లో గతంలోనూ హత్య


ఈ ఘటన జరిగిన జలాల్‌బాగ్ గ్రౌండ్‌పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇదే గ్రౌండ్‌లో ఓహత్య జరిగినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో గ్రౌండ్ పరిసరాల్లో భద్రతపై ప్రశ్నలు తలెత్తున్నాయి. సాయంత్రం చీకటి పడిన తర్వాత జలాల్ బాగ్ గ్రౌండ్ మందు



బాబుకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు అక్కడే మద్యం సేవిస్తు హంగామా చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో రాత్రి వేళలో గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైన పోలీసులు , సంబందిత అధికారులు స్పందించి గ్రౌండ్‌లో రాత్రి వేళ్లలో గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ హంగామా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> శ్రీకాంత్ కొడుకు రోషన్ మేక, శ్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఏమో ఏమో ఇది'. యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ ఖరారైంది.

## అక్టోబర్ 30న 'ఏమో ఏమో ఇది'




శ్రీకాంత్ కొడుకు రోషన్ మేక, శ్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఏమో ఏమో ఇది'. యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించేందుకు ఈ సినిమా సిద్ధమవుతోంది. 'హిట్' ఫ్రాంచైజీతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్న రచయిత, దర్శకుడు శైలేష్ కొలను తొలిసారి ఓ ఆహ్లాదకరమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనదైన థ్రిల్లర్ కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, 'ఏమో ఏమో ఇది'తో పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నారు. రోషన్ మేక, శ్రీతి ముకుందన్‌ల ఫ్రెష్ పెయిర్ ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.ఇప్పటికే విడుదలైన 'ది ఫస్ట్ బ్రీత్ ఆఫ్ 'ఏమో ఏమో ఇది' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ వీడియో సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేయడంతో పాటు, చిత్రంలోని ప్రేమకథ ఎలా ఉండబోతోందనే ఆసక్తిని పెంచింది.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## సుబ్బు క్యారెక్టర్ డిఫరెంట్‌గా ఉంటుంది



హీరోయిన్ కయాదు లోహర్

నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్కేల్లో నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కయాదు లోహర్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. 'ప్యారడైజ్‌'లో సుబ్బు లక్ష్మి పాత్రలో కనిపిస్తాను. తనని అందరూ సుబ్బు అని పిలుస్తుంటారు. ఇందులో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. అవన్నీ మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి. జడల్ జర్నీలో లవ్ పోర్షన్‌గా కనిపిస్తాను. అలాగే నాకంటూ ఒక జర్నీ ఉంటుంది. అది చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.నాది చాలా పెర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న పాత్ర. అలాగే కథలో చాలా కీలకమైన పాత్ర. సుబ్బు క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివీల్ చేయకూడదు. నేను చేసిన పాత్రలన్నిటికి ఇది చాలా డిఫరెంట్. నాని గారు, శ్రీకాంత్ గారు, అనిరుధ్ గారితో కలిసి ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్ లో భాగం కావడం గొప్ప ఎక్స్‌పీరియన్స్.డ్రాగన్ సినిమా చూసిన తర్వాత నేను ఈ క్యారెక్టర్ చేయాలని శ్రీకాంత్ బిలీవ్ చేశారు. కథ చెప్పారు. తర్వాత లుక్ టెస్ట్ చేసి ఓకే చేశారు. అలా నటించడం, యాక్షన్ చేయడం అంత ఈజీ కాదు. నాకు చాలా చాలెంజెస్ ఇచ్చారు. మేము పడిన కష్టానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతున్నాను.ఇందులో నాని క్యారెక్టర్ నా ఫేవరెట్. ప్రతి పరిశ్రమ నుండి నాకు ఎంతో ప్రేమ లభిస్తుంది. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని. అన్ని పరిశ్రమల్లో పని చేసే అవకాశం రావడం, ప్రేక్షకుల ప్రేమ దక్కడం ఆనందంగా ఉంది.సుధాకర్ చాలా స్వీట్ అండ్ జెన్యూన్ పర్సన్. ఆయనకు సినిమాల పట్ల చాలా ప్యాషన్ ఉంటుంది. ఆయన నిర్మాణంలో పని చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఇది చాలా భారీ ప్రాజెక్ట్. ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు.'ప్యారడైజ్' బిగ్ స్క్రీన్ పై ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా. స్టోరీ, యాక్షన్, మ్యూజిక్.. అంతా ఫుల్ కమర్షియల్ ప్యాకేజ్‌లా ఉంటుంది. అడ్రినలిన్ రష్ ఇస్తుంది.సూర్య తో ఒక సినిమా చేస్తున్నాను. అలాగే మారి సెల్వరాజ్ తో ఒక సినిమా చేస్తున్నాను.



## 'ఏందయ్య సామీ'.. సాంగ్ రిలీజ్

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. ఈ పాటను అజయ్ అతుల్ మెలోడియస్ గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన లిరిక్స్ అందించగా, శ్వేతా మోహన్, అజయ్ గోగవలే మధురంగా పాడారు. 'ఏందయ్య సామీ..' పాట ఎలా ఉందో చూస్తే 'ఏందయ్యా సామీ ఇట్ట గాస్తాందీ వెన్నెల, ఊపేస్తా ఉంది సిత్తరాలా ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఝూముకి మందుపెట్టిందెవ్వరు, మాయ దారి మనస్సాగక జాగరమన్నరా...' అంటూ మళ్లీ మళ్లీ వినాలనిపించేలా సాగుతుందీ పాట. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ లో ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది.

## సస్పెన్స్ నేపథ్యంలో 'మిస్ కాళికా మిస్సింగ్'



జెఎస్ వి వి ఎంటర్ టైన్ మెంట్స్ మరియు జెఎస్‌ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిస్ కాళికా మిస్సింగ్'. సత్య ధనేకుల దర్శకత్వంలో రామకృష్ణ, పదిమల యమున సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుంది. మునిపెన్నడూ చూడని కథనంతో ఈ మూవీ చిత్రీకరణ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది .ఈ చిత్రాన్ని అక్టోబర్ నెలలో ప్రేక్షకులు ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాము' అని అన్నారు . ఈ చిత్రంలో హీరో హీరోయిన్స్ గా వినీత్ చంద్ర, డాలీషా తో పాటు ఎస్తేర్,అజయ్ ఘోష్, బ్రహ్మాజీ ,ఆలీ ,జ్యోతి, నాగ మహేష్, గుండు సుదర్శన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహం :శివ దేవరకొండ , మ్యూజిక్ : లీండర్ లీ మార్టీ , నిర్మాతలు :రామకృష్ణ, పదిమల యమున, దర్శకత్వం :సత్య ధనేకుల.

## పేద సినీ కార్మికులను ఆదుకోవడమే 'మనం సైతం' లక్ష్యం



నటుడు కాదంబరి కిరణ్

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆర్థికంగా వెనుకబడిన వారికి భరోసా ఇవ్వడం.. ఒంటరిగా మిగిలిన వృద్ధులకు తోడుగా నిలవడం.. సేవను ఒక కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్న 'మనం సైతం' ఫౌండేషన్ మరో బృహత్తర సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సపర్య – వుయ్ కేర్ ఫర్ అన్ కేర్డ్' పేరుతో నూతన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నటుడు కాదంబరి కిరణ్ ప్రకటించారు.హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా 'మనం సైతం' ద్వారా సమాజంలో ఆపదలో ఉన్నవారికి, అవసరార్థులకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో 'సపర్య' ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు.'సపర్య' ప్రాజెక్టులో భాగంగా అనాథాశ్రమం, వృద్ధాశ్రమం, పేదలకు అందుబాటులో ఉండే 'జనతా వైద్యం' ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు కాదంబరి కిరణ్ తెలిపారు. ఈ ఏడాది నుంచి 'క్వాలిటీ థాట్ ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్' భాగస్వామ్యంతో సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రత్యేక విద్యా పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తన 40 ఏళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని కాదంబరి కిరణ్ గుర్తుచేసుకున్నారు. తనకు సాధ్యమైనంత మేరకు సాటి మనిషికి సాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉందనే భావనతో 'మనం సైతం'ను ప్రారంభించానని చెప్పారు. ''పేదవాళ్లే నా పేరెంట్స్.. పేదవాళ్లే నా కుటుంబం. భగవంతుడు మనల్ని పైకి తీసుకువచ్చినప్పుడు మన రెండో చెయ్యి చాచి వందలాది మంది పేదలను ఆదుకోవాలి'' అని ఆయన అన్నారు.

## అక్టోబర్ 17న 'గరివిడి లక్ష్మి'

భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది.తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. అక్టోబర్ 17న సినిమా రిలీజ్ కానుంది.''అక్టోబర్ 17న మీ అభిమాన థియేటర్లలో మా గరివిడి లక్ష్మి ఆడి పాడి అలరించబోతోంది' అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో



అందరినీ ఆకట్టుకుంటుంది.ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మ ణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని నటిస్తున్నారు.

# నాలుగు డిమాండ్లపై సర్కార్ సానుకూలం..!

**ఉద్యోగ సంఘాలతో చర్చలు మరో సారి వాయిదా....**

**నేడు సిఎస్‌తో చర్చలు.. అనంతరం ప్రకటన..?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగ సంఘాల డిమాండ్లపైన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోనుంది. నాలుగు డిమాండ్లపైన ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండు డిఎలను చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు సమాచారం. మంగళవారం ఉద్యోగ సంఘాలతో జరగాల్సిన చర్చలు మరోసారి వాయిదాపడ్డాయి. అదే సమయంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు చర్చించినట్టు తెలిసింది. ఇందులో నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించారు.కాగా పెండింగ్ బిల్లుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.వెయ్యి కోట్లకు మరో రూ. 500ల కోట్లను అదనంగా చెల్లించే అవకాశాలు ఉన్నాయి. తొలుత పెండింగ్ బిల్లులను రూ.500ల కోట్లు, ఆ తర్వాత రూ.ఒక వెయ్యి కోట్ల ను చెల్లిస్తోంది. అయితే ఈసారి రూ.2వేల కోట్లను చెల్లించాలని ఉద్యోగ సంఘాలు పట్టుపడుతున్న నేపథ్యంలో రూ1500 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది . అయితే ముందుగా నిర్దేశించిన ప్రకారం మంగళవారం సాయంత్రం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సచివాలయానికి చేరుకున్నారు. కానీ ఉద్యోగుల డిమాండ్ల అంశంపైన సంజయ్ జాజు సిఎం, డిప్యూటీ సిఎంతో చర్చించారు. అలగే సిఎం అధ్యక్ష తన జరిగే సమావేశంలో పాల్గొన్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు సచివాలయం నుంచి వెళ్లిపోయారు. అయితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో బుధవారం మధ్యాహ్నం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరగనున్నట్టు టిజిఒ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.రమన్ రెడ్డి వెల్లడించారు.

# జోధ్‌పూర్‌లో 26 నుంచి తరంగ్ శక్తి విన్యాసాలు

**17 రోజులపాటు ఏడుదేశాల**

**వైమానిక బలగాల ప్రదర్శన**

**తొలిసారి రంగంలోకి అమెరికా ఎఫ్-35 ఫైటర్ జెట్**



**న్యూఢిల్లీ:** జోధ్‌పూర్‌లో ఏడు దేశాల వైమానిక దళాల సైనికశక్తి విన్యాసాలు సెప్టెంబరు 26వ తేదీ నుండి అక్టోబరు 12వ తేదీ వరకూ జరుగుతాయి. అతిథేయ దేశం భారత్‌తోపాటు అమెరికా,ఫ్రాన్స్,జర్మనీ,ఆస్ట్రేలియా,బంగ్లాదేశ్,శ్రీలంక,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల వైమానిక బలగాలు గగనతల యుద్ధ విన్యాసాల్లో పాల్గొంటాయి. జోధ్‌పూర్‌లో ''తరంగ్ శక్తి'' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.భారత్–జపాన్ దేశాలమధ్య సెప్టెంబరు 9 నుండి 22వ తేదీ వరకూ ''వీర్ గార్డియన్'' విన్యాసాలు పూర్తయిన నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ ''తరంగ్‌శక్తి'' విన్యాసాలు మొదలవుతున్నాయి. ఈ తరంగ్‌శక్తి విన్యాసాలలో ప్రత్యేకత ఏమిటంటే అమెరికాకు చెందిన బహుముఖ సామర్థ్యాలు ప్రదర్శించగల శక్తిమంతమైన ఎఫ్–35 స్టెల్త్ ఫైటర్ జెట్ మొదటిసారి పాల్గొంటున్నది. గతంలో ఏరో ఇండియా–2025 విన్యాసాలలో పాల్గొన్నప్పటికీ తరంగ్ శక్తి విన్యాసాలలో అమెరికా ఎఫ్–35 ఫైటర్ జెట్ పాల్గొనడం ఇదే మొదటిసారి.

ఈ విన్యాసాలలో భారతదేశం తన రాఫెల్, మిరేజ్–2000, జాగ్వార్, తేజస్,మిగ్–29, సు–30 ఎంకెఐ యుద్ధ విమానాలను, ఇతర గగనతల ఆస్తులను ప్రదర్శిస్తుంది. ఫ్రాన్స్‌దేశం కూడా తన రాఫెల్ యుద్ధ విమానాలుప్రదర్శిస్తుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఎఫ్–16 యుద్ధ విమానాలను,బంగ్లాదేశ్ సి–130 జె యుద్ధ విమానాలను ప్రదర్శిస్తాయి. జోధ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ కేంద్రంలో రెండు వారాలపాటు ఈ యుద్ధ విమానాలు విడిదిచేసి ఉంటాయి. ఈ విన్యాసాలకు సంబంధించి సీనియర్ ఐఎఎఫ్ అధికారులు మంగళవారం న్యూఢిల్లీలో ఒక పిపిటి ప్రెజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత వైమానికదళ ఉప ప్రధానాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ మీడియాకు ఈ ''తరంగ్ శక్తి'' విన్యాసాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ ఏడాది 65 మిత్ర దేశాలకు ఆహ్వానాలు పంపామని ఆయన చెప్పారు. ఐతే ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక,రాజకీయ అనిశ్చితి తక్కువ దేశాలు పాల్గొనడానికి కారణమా? అని ప్రశ్నించగా ఈ విన్యాసాలకు,భౌగోళిక పరిస్థితులకు సంబంధం లేదన్నారు. 2024లో 11 దేశాలు రెండు దశల్లో సాగిన విన్యాసాలలో పాల్గొన్నాయని,45 విమానాలు 800 విన్యాసాలు చేశాయని, మొత్తం 1000 గంటల కార్యక్రమాన్ని ఆనాడు నమోదు చేశామని చెప్పారు.

## తీవ్ర వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించామన్నారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. బుధ, గురువారాల్లో కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని చెప్పారు. శుక్ర, శనివారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల ప్రభావం కొనసాగనుందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండగా, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండగా, మిగిలిన ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగనున్నాయన్నారు. అనంతరం ఆదివారం నుంచి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురిసే అవకాశముందన్నారు.

**హైదరాబాద్‌లో వర్షం** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది.

కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, దుండిగల్, గాంధీనగర్, రామ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరింది. షేక్‌పేట ఫ్లైఓవర్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. భారీ వర్షం కురుస్తున్న సమయంలో అనవసర ప్రయాణాలు రద్దు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## పూర్తిస్థాయిలో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## అద్భుత విజయం

(మొదటి పేజీ తరువాయి)



డీ లింకే పార్టీ పగ్గాలు చేపట్టేస్థాయికి ఎదిగి ఈనాడు ఈ ఘన విజయాన్ని నమోదు చేశారు. డీ లింకే పార్టీ బెర్లిన్ ఎన్నికల్లో 26 శాతం ఓట్లు సంపాదించింది. 16 శాతం ఓట్లు సాధించిన ఎ.ఎఫ్.డి కంటే అధికార సిడియు పార్టీ కొద్దిశాతం ఓట్లు ఎక్కువ సంపాదించింది. ఇతర రాష్ట్రాలలో ఎన్నికల తరహాలోనే బెర్లిన్ రాష్ట్రంలో కూడా తామే ఘన విజయం సాధిస్తామని జాత్యాహంకార ఎ.ఎఫ్.డి విర్రవీగి చివరకు చతికిలపడింది. ఎ.ఎఫ్.డిని దేశంలోని ప్రధాన స్రవంతి పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.జర్మనీ పార్లమెంటును కూడా కైవసం చేసుకుంటామంటూ ముందుకు దూసుకుపోతూ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌ను గడగడలాడించిన ఎ.ఎఫ్.డికి వామపక్ష డీ లింకే పార్టీ ముకుతాడువేసి అడ్డుకుంది. అంతేకాకుండా డీ లింకే అధినేత్రి ఎలిఫ్ ఎరాల్ఫ్ మేయర్ పదవి చేపట్టేందుకు మార్గం సుగమం చేసింది.ఎలిఫ్ ఎరాల్ఫ్ టర్కీ దేశస్థురాలు. ఆ దేశంలో తిరుగుబాటు హింసను తప్పించుకునేందుకు ఆమె కుటుంబం జర్మనీ వచ్చి స్థిరపడింది.ఆమె హేంబర్గ్ యూనివర్సిటీలో చదువుకుని లాయర్‌గా ప్రాక్టీస్‌చేస్తూ వామపక్ష డీ లింకేపార్టీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారు.

ఫెడరల్‌స్థాయిలో అధికారం చెలాయిస్తున్న సిడియు పార్టీ వినాశకరమైన ఫలితాలు చవిచూడటంతో ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ రాజకీయంగా పెద్ద సంక్షోభంలో పడ్డారు. తమ పార్టీ పెద్ద నష్టాని చవిచూసిందని ఆయన అంగీకరించారు. కానీ అధికారంలో కొనసాగుతామని, అధికారాన్ని నిలబెట్టుకుంటామని బలంగా వాదించారు.జాత్యాహంకార ఎ.ఎఫ్.డిని అడ్డుకోవడంలో అత్యంత బలహీనమైన నాయకుడుగా మిగిలిపోయారని సొంత పార్టీ నుండే ఆయనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండు వారాలక్రితం శాగ్సొనీ – అన్హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో గెలిచిన ఎఎఫ్‌డి అధికారానికి ఆమడదూరంలో ఆగిపోయింది. భాగస్వాములకోసం వెతుకుతోంది. ఐతే ఏ రాష్ట్రంలోనూ ఎ.ఎఫ్.డిని అధికారపార్టీ భాగస్వామిగా ఉండనివ్వబోమని, వారి ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కాబోవని మెర్జ్ ఉద్ఘాటించారు. వారిని ఎక్కడా అధికారం చేపట్టకుండా బలంగా అడ్డుకుంటామన్నారు.ఇతర పార్టీలు కూడా ఇదే వైఖరి అవలంబిస్తాయన్నారు. ఐతే తాము అధికారం పంచుకోవడానికి ఏ రాజకీయపార్టీతోనైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఎ.ఎఫ్.డి ప్రకటించింది.

ఒకరకంగా చెప్పాలంటే యూరప్ అంతటా మితవాదం పేట్రేగుతోంది. ఈ మితవాదాన్ని అడ్డుకోవడానికి,ప్రతిఘటించడానికి వామపక్షాలు వామపక్షాలు బలమైన శక్తిగా ఉద్భవిస్తున్నాయి. ఎన్నికల విజయాలు సాధిస్తున్నాయి. ట్రంప్ నేతృత్వంలోని 'మాగా' ఉద్యమాన్ని ఎ.ఎఫ్.డి. జర్మనీలో దాదాపుగా అనుకరిస్తోంది. మేక్ జర్మనీ గ్రేట్ ఎగైన్ అనే నినాదం చేపట్టింది. ఐతే యూరప్‌తో ట్రంప్ అనుసరిస్తున్న పెడసరితనం,వ్యతిరేక ధోరణి నేపథ్యంలో ప్రపంచస్థాయిలో ఒక ప్రత్యేక ఖండాంతర గుర్తింపు ఉండాలని యూరప్ దేశాలు కోరుకుంటున్నాయి.ఈ పూర్వరంగంలో యూరప్‌లో పచ్చిమితవాదులు విజృంభించే అవకాశాలు తలెత్తాయి.పలు యూరప్ దేశాలలో జాతీయవాదం బలంగా ముందుకు వస్తోంది.గతంలో ఈ విధమైన గుడ్డి జాతీయవాదాలే యూరప్ నుండి వచ్చి రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీశాయి.ఒకవైపు యూరప్‌లో పచ్చిమితవాదం,మరోవైపు అమెరికా నుండి డోనాల్డ్ ట్రంప్ అనాలోచిత ఆర్థిక విధానాలు,దూకుడు పద్ధతులమధ్య తీవ్ర జాతీయవాద ధోరణులు,వాటి పర్యవసానాల తరుణంలో వామపక్షాలు అప్రమత్తంగా వ్యవహరించాలి.ఒకవైపు ఫాసిజం,మరోవైపు సోషలిజాన్ని వ్యతిరేకించే సామ్రాజ్యవాద విధానాలమధ్య యూరప్‌లో యువతరం వామపక్షాలను గుర్తించి ఆదరించి ఎన్నికల్లో గెలిపించడం ఒక సానుకూల పరిణామం.

## ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఈ ఏడాది ఏలాంటి ఇబ్బందులు కల్గకుండ ముందస్తుగానే పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశానలు జారీ చేశారు. కొనుగోళ్లలో నిల్వ సామర్థ్యానికి కొరత రాకుండా వినియోగంలో లేని రైస్ మిల్లులు, ఫంక్షన్ హాళ్లు, ఇతర ప్రత్యామ్నాయ నిల్వ ప్రదేశాలను కూడా ముందుగానే గుర్తించి . కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించారు.తప్పుడు రికార్డులు సృష్టించినా, లెక్కల్లో మోసాలకు పాల్పడినా రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జీలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

**ఈ ఏడాది 7 సన్న రకాలకే బోనస్**

తగ ఏడాది మాదిరిగానే సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నారు అయితే ఈసారి ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్నాలు బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాలకు మాత్రమే ఈ బోనస్ అందజేయనున్నారు. ఈ బోనస్ పొందేందుకు రైతులకు అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిబంధనలకు అనుగుణంగా ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ నేరుగా జమ చేయనున్నారు.

## గవర్నర్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్(సిఎంసి) నగర పాలక సంస్థల పరిధిలో ఈ చట్టం అమలు కానుంది. క్యూర్ చట్టం ద్వారా హైదరాబాద్ నగర పరిపాలనలో డిజిటల్ ఆధారిత విధానాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేలా చర్యలు చేపట్టనున్నారు. నగర విస్తరణ, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పాలనా విధానాలను ఆధునీకరించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ చట్టం ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు చట్టపరమైన గుర్తింపు లభించడంతో పాటు మరిన్ని అధికారాలు అందనున్నాయి. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ వంటి అంశాల్లో హైడ్రా పాత్ర మరింత బలోపేతం కానుంది. క్యూర్ పరిధిలోకి వచ్చే మూడు కార్పొరేషన్‌లలో ఒకే విధమైన పాలనా విధానాన్ని అమలు చేయడంతో పాటు పాత, కాలం చెల్లిన నిబంధనలను తొలగించి ప్రస్తుత నగర అవసరాలకు సరిపోయేలా చట్టంలో మార్పులు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు ఆధునిక పాలనా నమూనాను అందించడమే క్యూర్ చట్టం లక్ష్యంగా ప్రభుత్వం వెల్లడించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com